

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

31-1-2026 శనివారం సంపుటి: 31 సంచిక: 360 పేజీలు: 8+4 వెల: 6.50



ఇంధనశాఖలో 27 మందికి కారుణ్య నియామకాలు 3లో

శాంతి చర్చలకు జెలెన్‌స్కీని ఆహ్వానించిన రష్యా 5లో




శుక్రవారం వార్డు, మండల స్థాయి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల తరగతుల్లో లోకేష్

## కూటమిని ఎవరూ విడదీయలేరు..

### వైఎస్సార్సీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

### పార్టీనేతల శిక్షణ తరగతిలో మంత్రి లోకేష్

**విజయవాడ,జనవరి30,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమిని చీల్చేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నా విడదీయడం ఎవరి తరం కాదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు.వైఎస్సార్సీపీ తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టడంతో పాటు వాటిని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తెలుగుదేశం కార్యకర్తలదేనని స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా ఓర్పుతో, ఐక్యంగా దుష్ప్రచారాలను ఎదుర్కోవాలని సూచించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. టౌన్, వార్డు, మండల స్థాయి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల >>2

# గ్రీన్ ఎనర్జీలో ఎపి నం.1

**కుప్పం, జనవరి 30 ప్రభాతవార్త:** ప్రపంచదేశాలతో పోల్చితే భారతదేశం అభివృద్ధిలో ముందుకుసాగుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మూడు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్థానిక అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రాంగణంలో 15కోట్లతో ఏర్పాటుచేసిన విద్యా చల్ అకాడమీ, లెర్నర్ అకామిడేషన్ సెంటర్, టీచర్ ట్రైనింగ్ శిక్షణ భవనాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రసంగించారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే లక్ష్యంతోనే విజన్ 2047, వికసిత్ భారత్ 2047 నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త ఆవిష్కరణలతోనే భవిష్యత్తు ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగానే ఎపికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) క్వాంటం వ్యాలీ తీసుకువచ్చినట్లు చెప్పారు. రాష్ట్రానికి అన్ని టెక్నాలజీలు వచ్చాయన్నారు. టాటా ఇన్నోవేషన్ హబ్, డ్రోన్ సిటీ, స్పేస్ టెక్నాలజీలు తెచ్చామన్నారు. రాష్ట్రంలో ఈఏడాది నుంచే డ్రోన్ అంబులెన్స్‌లను సైతం తీసుకువచ్చేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ తీసుకురావడం జరిగిందన్నారు. అలాగే గ్రీన్ ఎనర్జీ తయారీలో దేశంలోనే ఎపి నెంబర్‌వన్ రాష్ట్రంగా ఉందన్నారు.గ్రీన్ ఎనర్జీతో కరెంట్ ధరలు తగ్గుతున్నాయని ఇప్పటికే యూనిట్‌కు 38పైసలు తగ్గించామని మునుముందు మరింత తగ్గే అవకాశం ఉందని స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లాలోని శ్రీహరి కోట సమీపంలో ఐదువేల ఎకరాల్లో కమర్షియల్ పార్క్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సృజనాత్మకత, >>2

ఈ యేడాది నుంచే డ్రోన్ అంబులెన్స్ సర్వీసులు

శ్రీహరికోట వద్ద 5వేల ఎకరాల్లో కమ్మర్షియల్ పార్కు

కొత్త ఆవిష్కరణలతోనే భవిష్యత్తు

కుప్పం పర్యటనలో సిఎం చంద్రబాబు



శుక్రవారం కుప్పంలో విద్యాసంస్థలను ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో ముచ్చటిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో అగస్త్యఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామ్‌జీ రాఘవన్

## 14నే బడ్జెట్

### 11 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఆరంభం

### నోటిఫికేషన్ విడుదల

**విజయవాడ.జనవరి 30,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నోటిఫికేషన్ ను ప్రభుత్వం విడుదల చేసింది. శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11 నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 11న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. 14వ తేదీన ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉంది. అలాగే బీఏసీ సమావేశాల్లో పని దినాలను శాసనసభ, మండలి ఖరారు చేయనుంది. 2026- 27కు రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై కసరత్తు మొదలైంది. అన్ని ప్రభుత్వ శాఖలు జనవరి నెలాఖరులోగా తమ బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్థికశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలను సూచించింది. దీంతోపాటు 2025 26 అంచనాల సవరణ ప్రతిపాదనలు కూడా ఇవ్వాలని, అదే సమయంలో ఏ ప్రభుత్వ హెడ్ కింద ఎంతమొత్తం ఆదా అయ్యిందో ముందే గుర్తించాలని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా వివిధ ఖాతాల కింద ఎంత ఖర్చు చేశారు? మిగిలిన మూడు నెలల్లో ఎంత ఖర్చుచేసే అవకాశముందో స్పష్టమైన అంచనాలతో సవరణలు ప్రతిపాదించాలని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ ఇప్పటికే ఉత్తర్వులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిస్తోంది. ఇళ్ల నిర్మాణం, రహదారులు, ఇతర రవాణా సౌకర్యాల అభివృద్ధి, రక్షిత నీటికల్పన, విద్య, వైద్యం తదితర అంశాల్లో ప్రమాణాల మెరుగుదల, పారిశ్రామికీకరణ విస్తృతిని దృష్టిలో ఉంచుకొని మూలధన బడ్జెట్ ప్రణాళిక రూపొందించాలి. అలాగే పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం, కేంద్ర ప్రాయోజిత పథకాలు, రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలో భాగంగా అమలయ్యే పథకాలు, నాబార్డ్, హడ్కో సాయంతో చేపడుతున్న పనుల గురించి వివరంగా సమర్పించాలి.




# కాలుష్యానికి కళ్లెం వేద్దాం



శుక్రవారం విశాఖలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న డి.సిఎం పవన్

### అధునాతన సాంకేతికతతో వ్యర్థాల నిర్వహణ చేపట్టాలి

### ఉత్తరాంధ్రలోనూ వ్యాపిస్తున్న కాలుష్యం

### గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టులో పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వాలి

### విశాఖలో డి.సిఎం పవన్

**విశాఖపట్నం, జనవరి 30 ప్రభాతవార్త:** 'కాలుష్యం మన దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారిపోయింది. రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే కొంత వరకు కాలుష్యాన్ని భరించక తప్పని పరిస్థితి. అయితే కాలుష్యాన్ని పూర్తి స్థాయిలో నివారించలేకపోయినా నిలువరించి నియంత్రించే ప్రయత్నం అయితే జరగాలి. ముఖ్యంగా పారిశ్రామికవాడల్లో కాలుష్య నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ నిర్దేశించారు. పరిశ్రమలు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను తు.చ. తప్పక పాటిస్తూ జీవ వైవిధ్యానికి సహకరించాలని సూచించారు. నూతన సాంకేతికత సాయంతో వ్యర్థాల నిర్వహణ, గాలి నాణ్యత పెంపు తదితర చర్యలు తీసుకోవాలని తెలిపారు. శుక్రవారం సాయంత్రం విశాఖలోని ఓ ప్రైవేటు హోటల్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణం, కాలుష్య నియంత్రణ అంశంపై విశాఖ పరిసరాల్లోని పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశం అయ్యారు. పోర్టు నుంచి పారిశ్రామికవాడల వరకు యాజమాన్యాలు కాలుష్య నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'ఉత్తరాంధ్ర తీర ప్రాంతం ఎంత వేగంగా అభివృద్ధి చెందిందో అంతే వేగంగా ఇక్కడ గాలి నాణ్యత తగ్గుతూ వచ్చింది. గడచిన రెండేళ్ల కాలంలో పరిస్థితులు కాస్త మెరుగుపడినప్పటికీ పరవాడ పారిశ్రామికవాడ పరిధిలోని తాడి గ్రామం లాంటి చోట్ల పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. రసాయన పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం కారణంగా తాడి గ్రామంలో ఇంటికొకరు చొప్పున క్యాన్సర్ బారిన పడిన దుస్థితి. చిన్నారుల్లో చర్మ వ్యాధులు, మహిళల్లో గర్భస్రావాలు, ఊపిరితిత్తుల వ్యాధులు ఆ ప్రాంతంలో సర్వసాధారణం అయిపోయాయి. అలాగే విశాఖ పోర్టు కాలుష్యం కూడా పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్యంపై దాడి >>2



## హోంగార్డు ఆస్తులు కోటాను కోట్లు!

### ఎసిబి తనిఖీల్లో బట్టబయలు

### విజయనగరం, విశాఖలో అధికారుల సోదాలు

**విజయనగరం, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీసు శాఖలో ఆయనో సాధారణ ఉద్యోగి. కనీసం కానిస్టేబుల్ కూడా కాదు. అంతకన్నా దిగువ ర్యాంకు ఉన్న హోంగార్డు మాత్రమే.కానీ ఏసీబీలో ఉద్యోగం ఆయన అవినీతి ఆలోచనలకు బీజం వేసింది. అవినీతి అధికారుల ఆచూకీ తెలుసుకొని వారి నిగ్గు తేల్చే అవినీతి నిరోధకశాఖలో ఆయనకు హోంగార్డుగా >>2

# గ్రూప్-1 తుది ఫలితాలు

### 87 నియామకాల జాబితా ప్రకటించిన ఎపిపిఎస్సీ

**విజయవాడ.జనవరి 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీగ్రూప్1 తుది ఎంపిక జాబితాను ఎట్టకేలకు ఏపీపీఎస్సీ విడుదల చేసింది. 87 గ్రూప్ 1 ఉద్యోగాల నియామకాల కోసం ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. వివిధ కేటగిరీల్లో పోస్టులకు ప్రాథమికంగా ఎంపిక చేసిన వారి హాల్‌టికెట్ నంబర్లతో కూడిన జాబితాతోపాటు ఈ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ఇతర వివరాలను అధికారులు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. రిజర్వేషన్ రోస్టర్ కేసులో స్టే లేకపోవడం, న్యాయస్థానం ఆదేశాలకు లోబడి ఫలితాలు వెల్లడించేందుకు హైకోర్టు అనుమతించడంతో ఈ ఫలితాలను అధికారులు ప్రకటించారు.

**ఎంపిక జాబితా కోసం క్లిక్ చేయండి**

గ్రూప్1 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ 2023 డిసెంబరు 8న ప్రకటన విడుదల చేయగా 2024 మార్చి 17న ప్రిలిమ్స్ నిర్వహించింది. 2025 మేలో మెయిన్స్ నిర్వహించి, జూన్‌లో ఫలితాలు విడుదల చేసింది. జూన్ 23 నుంచి జులై 15 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎట్టకేలకు నేడు(శుక్రవారం) రాత్రి తుది ఎంపిక జాబితాను వెలువరించింది.

**గ్రూప్-2 పరీక్షల తుది ఎంపిక జాబితా**

గ్రూప్2 పరీక్షల తుది ఎంపిక జాబితా (ఫైనల్ సెలెక్షన్ లిస్ట్)ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం(2712026) రాత్రి పొద్దుపోయాక విడుదల చేసింది.మొత్తం 905 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయగా, ప్రస్తుతం 891 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెల్లడించింది. గ్రూప్2లో క్రీడా కోటాకు సంబంధించి రెండు పోస్టులను రిజర్వ్ చేయాలని గతంలో హైకోర్టు ఆదేశాలు ఇచ్చినందున న్యాయస్థానాన్ని ఆశ్రయించిన అభ్యర్థులు ఇచ్చిన ఐచ్ఛికాల మేరకు ఎక్సైజ్ ఎస్సై, లా ఏఎస్ఓ పోస్టులను పక్కన పెట్టింది. ప్రకటించిన 891 పోస్టుల్లో హైకోర్టు తీర్పును అనుసరించి, హారిజంటల్ రిజర్వేషన్ కారణంగా 25 పోస్టుల్లో మార్పులు జరిగే అవకాశముంది. మిగతా 866 పోస్టుల్లో ఏ మార్పూ ఉండదు. ఇంకా ప్రకటించని 14 పోస్టుల్లో హైకోర్టు తీర్పుతో పక్కన పెట్టిన క్రీడా కోటా పోస్టులు 2 పోనూ 7 దివ్యాంగ, 5 రిజర్వేషన్ పోస్టులకు ఆయా కేటగిరీల్లో అభ్యర్థులు లేరు. అయితే గ్రూప్2లో 905 పోస్టుల భర్తీకి 2023 డిసెంబరు 7న ఏపీపీఎస్సీ ప్రకటన జారీ చేసింది. 2024 ఫిబ్రవరి 25న ప్రిలిమినరీ, 2025 ఫిబ్రవరి 23న మెయిన్ పరీక్షలు నిర్వహించారు. 2025 ఏప్రిల్ 4న ఫలితాలు వెల్లడించారు. క్రీడా కోటాకు సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున అభ్యర్థుల ఎంపిక జాబితా తయారీకి ఇన్నాళ్లుగా జాప్యం జరిగింది.






శుక్రవారం విశాఖలో నిర్వహించిన అనకాపల్లి ఉత్సవ్‌లో కళాకారులతో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, మంత్రి కొల్లు రవీంద్ర, స్పీకర్ అయ్యన్నపాత్రుడు తదితరులు

# పర్యాటక హబ్‌గా అనకాపల్లి

**- అనకాపల్లి ఉత్సవ్‌లో మంత్రి దుర్గేష్**

**- ఉత్తరాంధ్ర సంస్కృతికి ఈ వేడుకలు అద్దంపడుతున్నాయని వెల్లడి**

**అనకాపల్లి, జనవరి 30 ప్రభాతవార్త:** విశాఖ ఉత్సవ్‌లో భాగంగా అనకాపల్లి జిల్లా ముత్యాలమ్మపాలెం తీరంలో నిర్వహిస్తున్న 'అనకాపల్లి ఉత్సవ్' నిజమైన ప్రజా ఉత్సవంగా సాగుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎంపి సిఎం రమేశ్, సహచర మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్‌లతో కలిసి పాల్గొన్న అనకాపల్లి ఉత్సవ్‌లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్ ఆద్యంతం ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ప్రకృతి ఒడిలో, సుందరమైన సముద్రతీరంలో జరుగుతున్న ఈ వేడుకలు ఉత్తరాంధ్ర ఆచారాలను, సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పేలా దిగ్విజయంగా సాగుతున్నాయన్నారు. అనకాపల్లి జిల్లా ఏర్పాటు తర్వాత జరుగుతున్న తొలి భారీ పర్యాటక ఉత్సవం కావడంతో స్థానికుల్లో, పర్యాటకుల్లో మిన్నంటిన ఉత్సాహాన్ని ఆయన కొనియాడారు. జిల్లా ఏర్పాటు తర్వాత మొట్టమొదటిసారిగా ఇంత ఘనంగా ఉత్సవాలు నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. ముత్యాలమ్మపాలెం సముద్రతీరంలో వేడుకలు జరుపుకోవడం ఆనందం.

# కాలుష్యానికి కళ్లెం వేద్దాం

>> చేస్తోంది. పోర్టు పరిసరాల్లో బొగ్గు కాలుష్యం కారణంగా ఊపిరితిత్తుల వ్యాధులు, చర్మ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా పోర్టు అథారిటీ పరిధిలోని గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంటుంది. అక్కడ నివశించే ప్రజలు ఎన్నో సందర్భాల్లో వారి సమస్యలు నా దృష్టికి తీసుకువచ్చారు. ఇలాంటి ఘటనలపై మానవతా దృక్పథంతో స్పందించి బాధిత ప్రజలకు అండగా నిలవాలి. పరిశ్రమలు నిబంధనలు పాటించవన్న భావన ఉందిరాష్ట్రం అభివృద్ధి చెందాలి అంటే పరిశ్రమలు రావాలి. అదే సమయంలో ఒక పరిశ్రమను స్థాపించాలి అంటే ఎన్నో సామాజిక అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. పరిశ్రమలు కాలుష్య నియంత్రణ వ్యవహారంలో నిబంధనలు సరిగా పాటించవన్న భావన ప్రజల్లో బలంగా ఉంది. అన్ని రకాల కాలుష్యాలకు ఉత్తరాంధ్రను డంపింగ్ ప్రాంతం చేశారని ఆ ప్రాంత ప్రజలు వాపోతూ ఉంటారు. పరిశ్రమలు వచ్చిన ప్రతిసారి ప్రజల్లో నిరక్ష్యానికి గురవుతున్నామన్న భావన కూడా పెరిగిపోతోంది. పరిశ్రమల యాజమాన్యాలు సాటి మనుషుల పట్ల కనీస బాధ్యతతో స్పందించాల్సిన అవసరం ఉంది. పారిశ్రామికవాడల్లోని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు చేయగలిగినంత చేయాలి.

# గ్రీన్ ఎనర్జీలో ఏపి నం.1

>> ఆవిష్కరణలు, టెక్నాలజీ, నాలెడ్జ్ వైపు దృష్టి సారించాలని సూచించారు. పిల్లలేదేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు.

**తెలుగువారికే అత్యధిక ఆదాయం :** ప్రపంచంలో అధికంగా విదేశాల్లో భారతీయులకు ఆదాయం వస్తోందని అందులో అధికంగా ఉన్నది తెలుగువారేనని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. 1995లో ఇంటర్నెట్ విప్లవం వచ్చిందనిదాన్ని అందిపుచ్చుకున్నట్లు పేర్కొన్నారు. అదే సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో అత్యధికంగా ఇంజనీరింగ్ కాలేజ్‌లు ఏర్పాటుచేశామన్నారు. అలాగే ఐటి సంస్థలను హైదరాబాద్‌కు తీసుకువచ్చామన్నారు. ఇండియాలోనే తొలిసారి వైజాగ్‌లో మెడ్‌టెక్ పార్కు, జీనోమ్ వ్యాలీ ఏర్పాటుచేశామన్నారు. కోవిడ్ సమయంలో భారత్ బయోటెక్ జీనోమ్ వ్యాలీలోనే కోవిడ్ టీకాలు తయారు చేయగా ప్రధాని నరేంద్రమోడీ దాదాపు వంద దేశాలకు సరఫరా చేశారన్నారు.

**కుప్పం ఓ ప్రయోగశాల :** కుప్పాన్ని తాను ఓ ప్రయోగశాలగా మార్చినట్లు సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఇప్పటికే కుప్పానికి భారీ పరిశ్రమలు వచ్చాయన్నారు. మరిన్ని పరిశ్రమలు సైతం వస్తున్నాయన్నారు. కుప్పానికి కృష్ణాజలాలు తీసుకువచ్చామని తద్వారా చెరువులు కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంతో పాటు కోలార్ మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే సైతం రానుందని పేర్కొన్నారు. కుప్పంలోని అగస్త్య ఫౌండేషన్‌ను దేశంలోనే ఓ ఉత్తమ ఇన్నోవేషన్ కేంద్రంగా మార్చుతామని ఈ ఫౌండేషన్ ఏర్పాటై పాతికేళ్లు పూర్తికావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిడిపి జిల్లా అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, అగస్త్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామ్‌జీ రాఘవన్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కూటమిని ఎవరూ విడదీయలేరు..

>> కోసం నిర్వహించిన 11వ శిక్షణ తరగతుల్లో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పాల్గొన్నారు. పార్టీ క్యాడర్ సమన్వయంతో పాటు సిద్ధాంతాలకు కట్టుబడి పని చేయాల్సిన అవసరం ఉందని లోకేశ్ స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ హయాంలో కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామి, టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిందని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. చేయకూడని పాపాలు చేసి ఇప్పుడు తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. 2014- 19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినా వాటిని ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడంలో వెనుకబడ్డామని గుర్తు చేశారు. అదే అప్పటి ఓటమికి ప్రధాన కారణమన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజలకు నేరుగా వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని తెలిపారు. ఇకపై అభివృద్ధితో గురించి విస్తృతం ప్రచారం చేయాలన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలతో రాజకీయాలు చేసే శక్తులను ధీటుగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. కూటమి నాయకుల మధ్య సఖ్యత అత్యంత ముఖ్యమని లోకేశ్ వ్యాఖ్యానించారు. పార్టీ నాయకులు అలగడం తగదని, ప్రతి ఒక్కరి కష్టాన్ని పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ ఒక కుటుంబం అని, కుటుంబంలో సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. మరోవైపు పార్టీ బలోపేతం కోసం తాను ఓ కార్యకర్తలా కృషి చేస్తున్నానని లోకేశ్ అన్నారు. పనిచేసే కార్యకర్తలనే పార్టీ ప్రోత్సహిస్తుందని వెల్లడించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో మార్పులు రావాలని లోకేశ్ సూచించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు పొలిట్ బ్యూరో స్థాయికి వచ్చేలా సంస్కరణలకు శ్రీకారం చుట్టామని అన్నారు. కింద నుంచి పై స్థాయి వరకు కూడా యువతకు పార్టీలో ప్రాధాన్యం ఎంతో అవసరమని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం పదవుల్లో అన్ని కులాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, అలానే మహిళలకు 33 శాతం పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. సంక్షేమం అభివృద్ధికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అయితే టీమ్ 11కోడి కత్తి, కల్తీ నెయ్యి, కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్ అని లోకేశ్ విమర్శించారు. ఇచ్చిన హామీలు అన్నీ ఓ పద్ధతి ప్రకారం నెరవేర్చుతూ ముందుకెళ్తున్నామని, అలానే చేసిన పనులు చెప్పుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు.



మహాత్మునికి నివాళిని అర్పిస్తున్న సిఎం చంద్రబాబు

# మహాత్మునికి సిఎం చంద్రబాబు నివాళి

**విజయవాడ,జనవరి30,ప్రభాతవార్తప్రతినిధి:** మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘనంగా నివాళులర్పిస్తూ "ఎక్స్" వేదికగా ట్వీట్ చేశారు. అహింసను పరమధర్మంగా చెప్పిన మహాత్ముడు ప్రాతఃస్మరణీయుడని అన్నారు. ఆయన బోధనలు నేటికీ అనుసరణీయమని అన్నారు. జాతిపితకు మరొక్కసారి ఘన నివాళి అర్పిస్తున్నానని సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. గుంటూరు పర్యటనకు వెళ్ళడానికి ముందు ఉండవల్లిలోని తన నివాసగృహంలోని మహాత్ముని చిత్రపటానికి సీఎం చంద్రబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు. జాతిపితకు మంత్రి నారా లోకేష్ నివాళి సత్యం, అహింసలే ఆయుధాలుగా దేశానికి స్వాతంత్ర్య సముపార్జించిన జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆ మహనీయునికి ఘన నివాళి అర్పించారు. అహింస అనే ఆయుధంతో సూర్యుడస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి భరతమాత దాస్యశృంఖలాల నుంచి విముక్తి కలిగించిన మహోన్నతుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు. 20వ శతాబ్దంలో మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన వ్యక్తుల్లో మహాత్మాగాంధీ ఒకరని, తాను నమ్మిన సిద్ధాంతాలను ఆచరించి చూపారని, భారతదేశంపై చెరగని ముద్ర వేశారన్నారు. దేశానికి స్వాతంత్ర్య ఫలాలు అందించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం కృషిచేద్దామని మంత్రి లోకేష్ అన్నారు.

# ఎపి జైళ్ల శాఖ డిజి అంజనీకుమార్ నేడు పదవీ విరమణ

**వైజాగ్‌లో ఘనంగా సన్మానించిన జైళ్ల శాఖ**

**హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:** ఎపి జైళ్ల శాఖ డిజి అంజనీ కుమార్ ఆయన సతీమణి వసుంధర సిన్హా (ముంబాయి ఐటి కమిషనర్)కు వైజాగ్‌లో శుక్రవారం ఆ రాష్ట్ర జైళ్ల శాఖ ఘనంగా సన్మానించింది. శనివారం నాడు ఆయన పదవీ విరమణ చేయనున్న సందర్భంగా జైళ్ల శాఖ అంజనీ కుమార్ దంపతులకు ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సన్మాన సభలో జైళ్ల శాఖతో పాటు ఎపి పోలీసు శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి ఎపి క్యాడర్‌కు చెందిన అంజనీ కుమార్ 1990 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. ఉమ్మడి ఎపిలోని అనేక చోట్ల ఆయన పనిచేశారు. రాష్ట్ర విభజన తరువాత ఎపి కేడర్‌కు కేటాయించినా కొన్ని కారణాల వల్ల తెలంగాణలో చేరారు. ఈ క్రమంలోనే అంజనీ కుమార్ హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా, ఎసిబి డిజిగా సేవలదించి తెలంగాణకు డిజిపిగా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ ఆయనను ఆకస్మికంగా బదిలీ చేసి రోడ్ సేఫ్టీ విభాగం డిజిపిగా నియమించింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం ఎపికి కేటాయించగా ఏడాదిన్నర క్రితం ఆ రాష్ట్ర సర్వీసులో చేరి జైళ్ల శాఖ డిజిగా చేరారు. ముక్కుసూటి వ్యక్తిగా పనిచేసే అధికారిగా ఆయనకు పేరుంది. ఎక్కడ పనిచేసినా నిక్కచ్చి గా వ్యవహరించడం ఆయన ప్రత్యేకత. తెలంగాణ డిజిపిగా పనిచేసిన సమయంలో ఎన్నికలు సాఫీగా జరిగేందుకు ఆయన తనదైన శైలిలో వ్యవహ రించారు. 36 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో ఆయనకు అనేక అవార్డులు, కేంద్ర ప్రభుత్వం నుంచి రివార్డులు, పోలీసు పతకాలు అందాయి.





వైజాగ్‌లో ఎపి జైళ్ల శాఖ డిజి అంజనీ కుమార్, ఆయన సతీమణి వసుంధర సిన్హాలకు సన్మానం జరిగిన దృశ్యం

# ఐగాట్ కర్మయోగి పోర్టల్‌లో ఎపి జాతీయ రికార్డు

**- కోటికి పైగా ఎన్‌రోల్‌మెంట్లు పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా ఘనత: సిఎం చంద్రబాబు - ప్రభుత్వ ఉద్యోగుల నిబద్ధతను కొనియాడిన ముఖ్యమంత్రి - పిఎం స్వనిధి కింద 3.42 లక్షల కుటుంబాలకు.. 978 కోట్లు పంపిణీ**

**విజయవాడ.జనవరి30,ప్రభాతవార్తప్రతినిధి:** ఐగాట్ కర్మయోగి పోర్టల్‌లో ఆంధ్రప్రదేశ్‌సరికొత్త జాతీయ రికార్డు సృష్టించింది. దేశంలో కోటి కోర్సుల దరఖాస్తులను పూర్తిచేసిన తొలి రాష్ట్రంగా ఏపీ నిలిచింది. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఈ విజయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఈ పోర్టల్‌లో కోటికి పైగా ఎన్‌రోల్‌మెంట్లు, 80 లక్షలకు పైగా కోర్సులు పూర్తయ్యాయని.. 4,290 కోర్సుల ద్వారా ఇది సాధ్యమైందని సీఎం పేర్కొన్నారు." శుభవార్త ఐగాట్ కర్మయోగి పోర్టల్‌లో ఆంధ్రప్రదేశ్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఇందులో కోటికి పైగా దరఖాస్తులు వచ్చాయి. 80 లక్షలకు పైగా కోర్సులకు శిక్షణ పూర్తైంది. మొత్తం 4,290 కోర్సుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు నైపుణ్యాభివృద్ధి పొందారు. ఇది ప్రభుత్వ ఉద్యోగుల నిరంతర అభ్యాసం పట్ల బలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(ఏపీఎస్‌డిపి) ఆధ్వర్యంలో సమర్థవంతంగా ఈ కర్మయోగి కార్యక్రమం అమలవుతోంది. నైపుణ్యంతో కూడిన భవిష్యత్తు వైపు ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తోంది"అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. మరో ట్వీట్‌లో ఈ 30 ఏళ్లలో ప్రపంచంలో ఎంతో అభివృద్ధి జరిగింది. టెక్నాలజీలో మార్పులు వచ్చాయి. నాడు ఐటీ నేడు ఏఐ వచ్చింది. ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నాం. అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంది. మరి ఇండియాలో ఏముంది అని అడిగే వారి కోసం అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఉంది అన్నది సమాధానమన్నారు. ఆనాడు సైబరాబాద్ కట్టాం..నేడు క్వాంటమ్ వ్యాలీకి శ్రీకారం చుట్టాం. ఒకప్పుడు కరెంటు ఉండేది కాదు...ఇప్పుడు ఇంటిపైనే కరెంటు తయారు చేసుకుంటున్నాం. అందుకే నేను ప్రోజ్యూమర్ అనే కొత్త కాన్సెప్ట్ తెచ్చాం. అసెంబ్లీలో కరెంటు గురించే గంటల కొద్దీ చర్చలు జరిగేవి. అందుకే నాడు విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చాం. విద్యుత్ రంగంలో మన దేశం నెంబర్ వన్ గా ఉండటం గర్వ కారణం. అమెరికాలోనూ కూడా నాలుగు గ్రిడ్ లు ఉన్నాయి. ప్రపంచంలో సింగిల్ పవర్ గ్రిడ్ ఉండే ఏకైక దేశం మనదే. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీకి శ్రీకారం చుడుతున్నాం. ఇంకో పదేళ్లలో గుంటూరు సహా అమరావతి రూపురేఖలు ఎలా ఉంటాయో చూస్తారు. గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. గుంటూరు కు182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు వస్తుంది. రెన్యువబుల్ ఎనర్జీతో పొల్యూషన్ అనేది ఉండదు. 1995లో నేను ఐటీని ప్రమోట్ చేశాను. 2000లో బయో టెక్నాలజీ ప్రమోట్ చేశాను. జీనోమ్ వ్యాలీకి భూములిచ్చాం. కొవిడ్ వ్యాక్స్ న్ భారత్ బయోటెక్ జినామ్ వ్యాలీ నుంచి తయారుచేసింది. ప్రజల ఆరోగ్యం కోసం సంజీవని పేరుతో కొత్త ప్రాజెక్టు తెస్తున్నాం. గేట్స్ ఫౌండేషన్ సహకరించేందుకు ముందుకొచ్చింది. కుప్పం నియోజకవర్గంలో





పైలట్ ప్రాజెక్టుగా అమలు చేశాం. 70 వేల మందికి క్లినిక్ టెస్టులు చేశాం. చిత్తూరు జిల్లాలో స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నాం. ఈ ఏడాదిలోనే 28 జిల్లాలు పూర్తిగా సంజీవని ప్రాజెక్టులో భాగంగా డిజిటల్ హెల్త్ రికార్డులు చేయడమే కాకుండా 72 లక్షలమంది రోగుల డేటా తీసుకుంటున్నాం. ఎవరి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది, క్యాన్సర్, న్యూరో సమస్యలపై దృష్టి పెట్టాం. కార్పొరేట్ ఆస్పత్రులు ఫైవ్ స్టార్ హోటళ్లను మించాయి. చికిత్స ఖర్చు కంటే రూమ్ ఖర్చే ఎక్కువవుతోంది. ఈ 2026లోనే డ్రోన్ అంబులెన్స్ తీసుకురావాలని అనుకుంటున్నాం. పీఎం స్వనిధి కింద 3.42 లక్షల కుటుంబాలకు 978 కోట్లు పంపిణీచేసామని వివరించారు.. మూడు నగరాల్లో తృప్తి క్యాంటీన్లు, 2,673 ఉద్యోగ అవకాశాలతో 18 జాబ్ మేళాలు, మరియు ఆటో డ్రైవర్ సేవాలో పథకం కింద ..436 కోట్ల వ్యయంతో 2.90 లక్షల ఆటో, టాక్సీ మరియు మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి ..15,000 ఆర్థిక సహాయం అందించబడింది. సామాజిక న్యాయం కేంద్రంగా ఉంది. వెనుకబాటుతనం ఆధారంగా ఎస్సీ ఉప వర్గాల మధ్య సమాన రిజర్వేషన్లు కల్పించడానికి ఎస్సీ ఉపవర్గీకరణ చేపట్టబడింది. షెడ్యూల్డ్ కులాల కోసం ఆర్థిక సహాయం గణనీయంగా పెరిగింది 2019-24 మధ్య సంవత్సరానికి సగటున ..70 కోట్ల నుండి 2024-26లో సంవత్సరానికి ..115 కోట్లకు పెరిగింది. అదనంగా, 11.44 లక్షల మంది ఎస్సీ పెన్షనర్లకు ..3,938.75 కోట్లు విడుదల చేయబడ్డాయి, హాస్టళ్లు మరియు గృహ నిర్మాణంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టబడ్డాయి. 2025-26 సంవత్సరానికి, 20,692 మంది లబ్ధిదారులకు స్థిరమైన జీవనోపాధిని కల్పించడానికి ఎస్సీ ఆర్థిక సహాయ పథకాల కింద ..341 కోట్లు కేటాయించబడ్డాయి. వెనుకబడిన తరగతుల విషయానికి కొస్తే, ప్రభుత్వం ఆర్థిక సాధికారత మరియు సామాజిక గౌరవానికి కట్టుబడి ఉంది. బీసీ సహకార ఆర్థిక సంస్థ ద్వారా ఈ సంవత్సరం ..11,620 కోట్లు మళ్లించబడ్డాయి. శాసన సభలలో బీసీలకు 33 రిజర్వేషన్‌తో ప్రాతి నిధ్యం బలోపేతం చేయబడింది మరియు స్థానిక సంస్థలు మరియు నామినేటెడ్ పదవులలో 34 రిజర్వేషన్‌ను అమలు చేయ డానికి చర్యలు తీసుకుంటున్నారు. విద్య కోసం, ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ..686.64 కోట్లు మరియు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం..420.74 కోట్లు విడుదల.

# హోంగార్డు ఆస్తులు కోటాను కోట్లు!

>> అవకాశం రావడంతో ఆయన పంట పండింది. ఒక నెల కాదు. , ఒక సంవత్సరం కాదు... ఏకంగా 15 సంవత్సరాల పాటు ఏసీబీ కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వర్తించారు. అవినీతి అధికారులపై వస్తున్న ఫిర్యాదుల సమాచారాన్ని చాకచక్యంగా తెలుసుకొని మరో కంటికి తెలియకుండా నేరుగా సదరు అవినీతి అధికారులతోనే మాట్లాడి బేరం పెట్టుకునేవాడు. ముందస్తు సమాచారం ఇవ్వడం ద్వారా వారిని అప్రమత్తం చేయడం, వారి నుంచి భారీ మొత్తంలో లక్షలాది రూపాయలను గుంజడం అలవాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో కోట్లాది రూపాయల అక్రమ ఆస్తులను పోగేసుకున్నాడు. సదరు హోంగార్డు నెట్టి శ్రీనివాసరావు కదలికలను, వ్యవహార శైలిని అనుమానించిన అధికారులు ఆరు నెలల క్రితం ఆయనను ఏసీబీ నుంచి జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపించేశారు.

**వారం - వర్జ్యం**

31-01-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శ్రావణ కార్తె
త్రయోదశి ఉ.8.26, చతుర్దశి తె.5.41
పునర్వసు రా. 1.35
వర్జ్యం : ఉ.9.03-10.33
దు.ఉ.6.39-8.13
శుభసమయం : ఉ.8.30-9.00
రాహుకాలం - ఉ.9.00-10.30

**వార్తాఫలం**

**మేషం:** విలువైన వస్తు భద్రతపట్ల తగు జాగ్రత్తలు అవసరం. నిర్మోహమాటంగా త్రోసిపుచ్చండి. శ్రమ అధికం.

**వృషభం:** ఇబ్బందికరంగా పరిణమిస్తాయని మీరు భావించిన అంశాలను ఎంత మాత్రంగా పరిగణనలోనికి తీసుకోకండి.

**మిథునం:** దూరప్రాంతంలో వున్న మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఋణాలు తీరి ఊరట చెందుతారు.

**కర్కాటకం:** సహోద్యోగులతో ఏర్పడిన అభిప్రాయ భేదాలు తొలుగుతాయి. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**సింహం:** భాగస్వామ్య వ్యాపారాలలో భాగస్వాముల పాత్ర నామమాత్రమవుతుంది. వ్యాపారాలు లాభిస్తాయి.

**కన్య :** కర్త, కర్మ, క్రియ అన్నీ మీరే అయి నడిపిస్తారు. రాజకీయ పరమైన అంశాలు అమితంగా ఆకర్షిస్తాయి.

**తుల :** మీలోని మంచితనాన్ని పదిమందీ గుర్తించాలని ఆరాట పడతారు. అందుకు తగిన ప్రయత్నాలు చేస్తారు.

**వృశ్చికం:** శత్రువులు సైతం మిత్రులుగా మారతారు. భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** గృహాలంకరణకు, ఆరోగ్యానికి ఎక్కువ ప్రాముఖ్యతనిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మకరం :** సోదరుల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగులకు పదోన్నతులు, స్థానమార్పులు.

**కుంభం:** కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. కొత్త విద్యలపై ఆసక్తి చూపుతారు.

**మీనం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వీసా, పాస్‌పోర్ట్స్ వంటి అంశాలు సానుకూల పడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కాకినాడలో 60 పడకల కోరమాండల్ ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి లోకేష్


**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 30(ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వలసపాకల బీచ్ రోడ్డులో కోరమాండల్ ఎరువుల కర్మాగారం ఆధ్వర్యంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటుచేసిన 60 పడకల ఆసుపత్రి నూతన భవనాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా ఆసుపత్రి ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు కోరమండల్ ఇంటర్నేషనల్ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం 60 పడకల ఇంటిగ్రేటెడ్ కోరమాండల్ హాస్పటల్ నూతన భవనాన్ని రిబ్బన్ కట్ చేసి మంత్రి ప్రారంభించారు. ఆసుపత్రి భవనం మొత్తం కలియతిరిగి వసతులను పరిశీలించారు. కార్పోరేట్ సామాజిక బాధ్యత కింద కోరమాండల్ సంస్థ గత కొన్నేళ్లుగా అవుట్ పేషంట్ హాస్పిటల్ ను నిర్వహిస్తోంది. కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల నుంచి ఏడాదికి 1.2 లక్షల మందికి పైగా రోగులకు సేవలందించడం జరుగుతోంది. మొదటి దశలో ఆసుపత్రి అభివృద్ధికి రూ.8 కోట్లు వెచ్చించారు. రెండో దశలో ప్రస్తుతం రూ.32 కోట్లు వెచ్చించి ఇన్ పేషంట్ సదుపాయాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్ఎమ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఏ అలగప్పన్, ఎండీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.శంకరసుబ్రహ్మణ్యన్, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అరుణ్ అలగప్పన్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ డైరెక్టర్ వి.నారాయణన్ తో పాటు ఎంపీ సానా సతీష్, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం వెంకటేశ్వరరావు, రాజమండ్రి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



కోరమండల్ ఆసుపత్రి ప్రారంభిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

# నెయ్యి టెండర్లలోనూ నిబంధనల ఉల్లంఘన

**- లడ్డూలలో నెయ్యి కల్తీని బహిర్గతం చేసిన సిట్ - మైక్రోడిఎన్ఏ పరీక్ష తప్పనిసరిగా చేయాలి - టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు**



**తిరుమల,జనవరి 30ప్రభాతవార్తప్రతినిధి:** 2019-24 మధ్యకాలంలో తిరుమలకు స్వచ్ఛమైన ఆవునెయ్యి సరఫరా చేసే అంశంలో నెయ్యి కొనుగోలు టెండర్ల ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారని ,కొందరికి లాభం చేకూర్చేలా అప్పటి పాలకమండలి ,అధికారులు నిబంధనలను మార్చారని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. కల్తీనెయ్యి సరఫరా చేశారని సిబిఐ సిట్ అధికారులు ఛార్జిషీట్‌లో ఆధారాలతో దాఖలు చేసినా, దానిపై వైసిపి నాయకులు వాస్తవాలకు విరుద్ధంగా ప్రచారం చేయడం దారుణమన్నారు. నెయ్యినాణ్యతపై తుది నిజాలు వెలుగులోకి రావాలంటే మైక్రో డిఎన్ఏ పరీక్ష తప్పనిసరిగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో, అప్పటి వైసిపి టిటిడి బోర్డు హయాంలో తిరుమలకు కల్తీనెయ్యి జరిగిందనేది సిట్ ఛార్జిషీట్‌లో పేర్కొందన్నారు. అయితే ఈ తప్పుడు పనులు చేసి ఈ పాపం కేసులో తప్పించుకునేందుకు వైసిపి పెద్దలు పలు రకాల ఆరోపణలతో, వాస్తవాలను వక్రీకరించి మాట్లాడటం మంచిది కాదన్నారు. వైసిపి నాయకుల తీరు, వ్యాఖ్యలపై శుక్రవారం సాయంత్రం తిరుపతిలోని పద్మావతి అతిధిగృహంలో బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి, సి.దివాకర్‌రెడ్డి, నరేశ్‌కుమార్‌తో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు.

అసలు నెయ్యి కల్తీ జరగలేదని చెప్పడం వాస్తవం కాదన్నారు. సిట్ చార్జిషీట్‌లో కల్తీజరిగిందనేది స్పష్టంగా నమోదు చేశారని, అసలు వైసిపి బోర్డు పెద్దలు నెయ్యి కొనుగోలు టెండర్ల ప్రక్రియనే మార్చేశారని వెల్లడించారు. సరైన సామర్థ్యం లేని డెయిరీలకు. సంస్థలకు నెయ్యి టెండర్లు అప్పగించడమే పెద్ద నేరమన్నారు. సుమారు 250కోట్ల రూపాయలతో 60లక్షల కిలోల కల్తీనెయ్యి కొనుగోలు జరిగిందన్నారు. నెయ్యినాణ్యతను పరీక్షించిన ఎన్‌డిడిబి జంతు కొవ్వు ఉందని నివేదిక ఇచ్చిందని ఛైర్మన్ నాయుడు మరోసారి వెల్లడించారు.

# ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే పి4

● సమాజానికి కొంత తిరిగి ఇచ్చినప్పుడే నిజమైన సంతృప్తి ● జన్మభూమికి ప్రవాసాంధ్రుల సేవలు స్ఫూర్తిదాయకం ● పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో సంజీవని ప్రాజెక్టు ● పదేళ్లలో గుంటూరు సహా అమరావతి రూపురేఖలు మారతాయి ● గుంటూరు జిజిహెచ్‌లో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం చంద్రబాబు ● రూ.100 కోట్ల విరాళం సమకూర్చిన గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులకు ముఖ్యమంత్రి అభినందన



గుంటూరు, జనవరి 30 ప్రభాతవార్తప్రతినిధి: ఎంత ఎదిగినా జన్మభూమిని మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సంపాదించిన దాంట్లో కొంత సమాజసేవకు వినియోగిస్తే వచ్చే తృప్తి మాటల్లో చెప్పలేనిదని సీఎం అన్నారు. గుంటూరు జీజీహెచ్ లో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. కానూరిజింఖానా మాతా శిశు సంరక్షణ కేంద్ర నిర్మాణం కోసం కాలేజీ పూర్వ విద్యార్థులు రూ.100 కోట్ల విరాళాలను సమకూర్చారు... ఎక్విప్మెంట్, ఫర్నిచర్ కోసం రూ. 27 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... క్లినిమాలలో ఇంకా మంచి మిగిలే ఉందని ప్రవాసాంధ్రులు నిరూపించారు. సాధారణంగా నలభై, యాభై ఏళ్ల క్రితం విదేశాలకు వెళ్లి స్థిరపడినవాళ్లు జన్మభూమిని మర్చిపోతారు. కానీ మీరంతా చదువుకున్న కాలేజీని గుర్తు పెట్టుకుని 1981లోనే జింఖానా సంస్థ ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున సాయం చేస్తున్నారు. అందుకు మీ అందర్నీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఆరోగ్య కేంద్రం నిర్మాణంతో పాటు భవిష్యత్ లో దాని నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు రాకుండా బ్యాంకులో కొంత సొమ్ము డిపాజిట్ చేయడం గొప్ప విషయం. మనతో పాటు సమాజం కూడా బాగుండాలన్నదే మన సంస్కృతి. ఇప్పటి వరకు పాఠశాలలకు, ఆస్పత్రులకు, దేవాలయాలకు, ఆట స్థలాలకు ఎంతోమంది దాతలు పెద్ద ఎత్తున విరాళాలు ఇచ్చారు. మనదేశ సంస్కృతి, సంప్రదాయాలు మరే దేశంలోనూ కనిపించవు. అమెరికాలోనైతే 18 ఏళ్లకే పిల్లలు బయటకు వెళ్లి స్వతంత్రంగా జీవిస్తారు. కానీ మనదేశంలో పిల్లలు ఎంత పెద్దవారైనా జీవితాంతం వారిని తల్లిదండ్రులు కంటికిరెప్పలా కాపాడుకుంటునే ఉంటారు. 1995లో నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మెడిసిన్ చేసిన ఎంతోమంది అమెరికా వెళ్లేవాళ్లు. ఇది చూసి చాలామంది నాతో బ్రెయిన్ డ్రెయిన్ అవుతోందన్నారు. రాబోయే రోజుల్లో బ్రెయిన్ గెయిన్ అవుతుందని వారికి చెప్పాను అని ముఖ్యమంత్రి అన్నారు.

### పేదల అభ్యున్నతి కోసం పి4

నేను జన్మభూమి కార్యక్రమానికి పిలుపునిచ్చినప్పుడు ఎంతోమంది ప్రవాసాంధ్రులు తాము పుట్టి పెరిగిన ఊరికి సాయం చేసేందుకు ముందుకొచ్చారు. మనదరం గ్రామీణ ప్రాంతాల్లో చిన్న కుటుంబాల్లో పుట్టిన వారమే. అవకాశాలు అందిపుచ్చుకుని అంచెలంచెలుగా ఎదిగాం. రహదారులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ రంగంలో వేగవంతమైన అభివృద్ధికి పీ4 మోడల్ సరైందని కేంద్రం భావిస్తోంది. అయితే ధనిక, పేదల మధ్య వ్యత్యాసాలు పెరిగిపోతున్నాయి. నేను అందుకే పేదల అభ్యున్నతి కోసం పీ4 తీసుకొచ్చాను. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతాయి. చదువు అనేది గేమ్ ఛేంజర్. అంబేద్కర్, అబ్దుల్ కలామ్ ఆర్థిక సాయంతోనే అత్యున్నత స్థాయికి ఎదిగారు. పీ4 కార్యక్రమం లక్ష్య సాధనలో 50 శాతం రీచ్ అయ్యాం. ప్రవాసాంధ్రులు కూడా పేదలకు ఆర్థిక చేయూత అందించేందుకు ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు.

### దాతృత్వం గొప్పది:

గుంటూరు మెడికల్ కాలేజీలో చదివిన వారిలో 8 మందికి పద్మశ్రీలు రావడం గొప్ప విషయం. మన రాష్ట్రంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ తర్వాత ఏర్పాటైన రెండవది గుంటూరు మెడికల్ కాలేజీ. జీజీహెచ్ లో మాతా, శిశు ఆరోగ్య కేంద్రాన్ని 2,69,245 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 5 అంతస్తుల్లో ఏర్పాటు చేశారు. మొత్తంగా 600 బెడ్లు ఈ బ్లాకులో ఉన్నాయి. ప్రసూతి విభాగం 300 బెడ్లు, పీడియాట్రిక్స్ విభాగంలో 200 బెడ్లు విభాగాల్లో మిగిలిన బెడ్లు ఉన్నాయి. నిర్మాణం కోసం డాక్టర్ గవిని ఉమాదేవి రూ.22 కోట్లు, నరిసెటింట్ల తెల్ల రూ.8 కోట్లు, వాసిరెడ్డి రమాదేవి కొండ్రగుంట వెంకట్రావు రూ. 4.32 కోట్లు, ముప్ప వేదవతివెంకటేశ్వరరావు రూ. 4.04 కోట్లు, డాక్టర్ తేలికచర్ల గుడిమెడ కుటుంబాలు రూ. 3.60 కోట్లు, డాక్టర్ లక్ష్మీచౌదరి గంగ రూ. 3.40 కోట్లు, బీనా నూతక్కిగోపాలరావు రూ.3.20 కోట్లు ఇచ్చారు. పూర్వ విద్యార్థులు ఈ బ్లాక్ నిర్మాణంతో పాటు... గతంలో రూ.35 కోట్లను వెచ్చించి ఆడిటోరియం నిర్మించారు. తులసీ సీడ్స్ సహా పలువురు దాతలు ముందుకొచ్చారు. గుంటూరు ఎంపీ, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రూ.80 కోట్ల వరకూ విరాళాలు సేకరించి పనులు పూర్తి చేస్తున్నారు. నాట్కో కూడా 201718లో రూ. 47 కోట్లు, ఈ ఏడాది రూ.18 కోట్లు, క్యాన్సర్ చికిత్సకు రూ. 18 కోట్లు, తలసేమియా అవసరాలకు రూ. 12 కోట్లు ఖర్చు చేశారు. అలాగే గుంటూరులో మిలీనియమ్ బ్లాక్ కోసం రూ. 16 కోట్లు, విశాఖ ఎయిమ్ మెడికల్ కాలేజీ బ్లాక్ నిర్మాణం కోసం రూ. 60 కోట్లు, కాకినాడ ఆస్పత్రికి రూ. 40 కోట్లు, కర్నూలు మెడికల్ కాలేజీకి రూ. 20 కోట్లు ఖర్చు చేయడం అభినందనీయం అని సీఎం చంద్రబాబు అన్నారు.

### మేటి నగరంగా అమరావతి

నూతన గ్రీన్ ఫీల్డ్ నగరంగా అవతరిస్తోందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 202526 ఆర్థిక సర్వేలో స్పష్టం చేసింది. ప్రధాని మోదీ నాయకత్వంలో 2038 నాటికి ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం తయారవుతుంది. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్య సాధనతో మనం ముందుకెళ్తున్నాం. రాజధానికి అంత భూమి ఎందుకు, 100 ఎకరాల్లో సచివాలయం కట్టేస్తే చాలని ఎంతోమంది అన్నారు. కానీ జాతికి గుర్తింపు లభించాలన్నా, అన్ని ప్రాంతాలతో సమానంగా మనం ఉండాలన్నా అభివృద్ధి చెందాలి. కర్ణాటక రాష్ట్రానికి బెంగుళూరు, తమిళనాడుకు చెన్నై, తెలంగాణకు హైదరాబాద్ నగరాలున్నాయి. మనం అమరావతిని చిన్న నగరంగా వదిలేస్తే ఆర్థిక వ్యవస్థలో వెనకబడతాం. అందుకే హైదరాబాద్ కంటే మెరుగైన నగరం కట్టాలని నిర్ణయించాం. ఈ 30 ఏళ్లలో ప్రపంచంలో ఎంతో అభివృద్ధి జరిగింది. టెక్నాలజీలో పెను మార్పులు వచ్చాయి. అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంది... మరి ఇండియాలో ఏముందని అడిగే వారికి అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఉందన్నదే మన సమాధానం. ఆనాడు సైబరాబాద్ నిర్మించాం. నేడు క్వాంటమ్ వ్యాలీకి శ్రీకారం చుట్టాం. ఒకప్పుడు ఇళ్లలో కరెంటే ఉండేది కాదు ఇప్పుడు ఇంటిపైనే కరెంటు తయారు చేసుకుంటున్నాం. 1999లో నాటి అసెంబ్లీలో కరెంటు గురించే గంటల కొద్దీ చర్చలు జరిగేవి. అప్పుడు విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చాం. విద్యుత్ రంగంలో మన దేశం నెంబర్ వన్ గా ఉండటం గర్వకారణం. అమెరికాలో కూడా నాలుగు గ్రిడ్ లు ఉండగా... ప్రపంచంలో సింగిల్ పవర్ గ్రిడ్ ఉండే ఏకైక దేశం మనదే. సోలార్ విండ్ పంపుడ్ స్టోరేజీకి శ్రీకారం చుడుతున్నాం. ఇంకో పదేళ్లలో గుంటూరు సహా అమరావతి ప్రాంత రూపురేఖలు ఎలా మారతాయో మీరే చూస్తారు. గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. 182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు వస్తుంది. రెన్యువబుల్ ఎనర్జీ ఉంటుంది. పొల్యూషన్ మాటే వినపడదు. 1995లో ఐటీని, 2000లో బయో టెక్నాలజీని ప్రమోట్ చేశాము. ఆనాడు జినోమ్ వ్యాలీకి భూములిచ్చి ప్రోత్సహించగా ఆ తర్వాత కాలంలో భారత్ బయోటెక్ కొవిడ్ వ్యాక్సిన్ అక్కడి నుంచే తయారు చేసిందని సీఎం అన్నారు.

### రాష్ట్రమంతటా సంజీవని

టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చి నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు అందించే లక్ష్యంతో సంజీవని ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాం. ప్రజల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేసేలా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నాం. కుప్పంలో పైలట్ ప్రాజెక్టు అయింది. త్వరలో రాష్ట్రమంతటా విస్తరించి రోల్ మోడల్ గా మారుస్తాం. నేడు కార్పొరేట్ ఆస్పత్రులు ఫైవ్ స్టార్ హోటళ్లను మించిపోతున్నాయి. రోగి చికిత్స ఖర్చు కంటే రూమ్ ఖర్చే ఎక్కువవుతోంది. త్వరలో ఎయిర్ అంబులెన్స్‌లు వస్తున్నాయి. 2026లో డ్రోన్ అంబులెన్స్ తీసుకురావాలని అనుకుంటున్నాం. ప్రవాసాంధ్రులు అమెరికా నుంచి వర్చువల్ గా లేక ఇక్కడికి వచ్చినప్పుడు కానీ పేషెంట్లకు ట్రీట్ మెంట్ చేసి, మెరుగైన వైద్య సేవలకు తగిన సూచనలు చేయాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి సత్యకుమార్ సహా పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

## తిరుమల సమాచారం

### రేపు మాఘమాస పౌర్ణమి గరుడసేవ



తిరుమల, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: పవిత్రమైన మాఘమాసం పౌర్ణమి విశేషమైన రోజున ఆదివారం (రేపు) సాయంత్రం తిరుమలలో గరుడ సేవ జరగనుంది. విశేషాభరణాల అలంకృతుడై మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించనున్నారు. ప్రతినెలా పౌర్ణమి రోజు తిరుమల ఆలయ మాఢ వీధుల్లో గరుడవాహనసేవ నిర్వహించడం పరిపాటి. ఆదివారం పౌర్ణమి వేళ గరుడ వాహనసేవ రాత్రి7గంటలకు జరగనుంది.

### భగవంతుని ఆశీస్సులందుకున్నాం




తిరుమల, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు పొందడంతో ఆనందంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు. దేవుని కరుణాకటాక్షాలు అందరిపై కలగాలని వేడుకున్నామన్నారు. శుక్రవారం వేకువజామున శ్రీవారి సుప్రభాతసేవ సమయంలో మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్, ఎంపి కేశినేని చిన్ని, మంత్రి టిజి భరత్ ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### తిరుచానూరు పద్మావతి అమ్మవారికి జత కర్ణపత్రాలు బహూకరణ



తిరుమల, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: సిరులతల్లి... తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి దాత బంగారు,రాళ్ళతో పొదిగిన జత కర్ణపత్రము ఆభరణాలను బహుకరించారు.

తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన కె.దీపక్ కుటుంబం 178 గ్రాముల బరువుతో రూ.23లక్షల విలువైన జత కర్ణపత్రములు బంగారు ఆభరణాలను టిటిడి అధికారులకు అందజేశారు. ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంధ్రనాత్, ఆలయ సూపరింటెండెంట్ సురేశ్, ఏవిఎస్ఒ రాధాకృష్ణ, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చలపతి, ప్రసాద్, ఆలయ అర్చకుడు బాబు స్వామి సమక్షంలో వీరి ఆభరణాలను అందజేశారు. అమ్మ వారికి వీటిని అలంకరించనున్నారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు.





మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన ఆయిల్ పామ్ ధరల నిర్ధారణ కమిటీ సమావేశం

## శ్రీవారి ఆలయం వెలుపల మరింత సాఫీగా కదిలేలా ఉక్కురాడ్ల లైను

తిరుమల, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేస్తున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు భక్తులకు సాఫీగా, సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌ల నుండి ఆలయంలోనికి క్యూలైన్లమీదుగా చేరుకునే భక్తులు సంఖ్య పెరిగితే దక్షిణమాఢవీధిలో వెలుపల క్యూలైన్ తెరచి భక్తులను ఎలిఫెంట్ గేట్ సమీపంలోనుండి ఆలయంలోనికి అనుమతినిస్తారు.
ఇక్కడ ఇదివరకు ఎలాంటి నియంత్రణ క్యూలైన్ లేకపోవడంతో భక్తులు గుంపులు గుంపులుగా వచ్చేవారు. అక్కడి భద్రత స్బింది నియంత్రించడం కష్టంగా మారింది.
ఇటీవల రథసప్తమికి ముందు ఈ ప్రాంతంలో భక్తుల క్యూలైన్ రద్దీని అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి గమనించారు. అక్కడ భక్తులకు ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా అదనంగా ఉక్కురాడ్లతో క్యూలైన్‌ను ఆధునీకరించి ఏర్పాటుచేశారు. దీనివల్ల వైకుంఠమ్ క్యూలైన్ నుండి వచ్చే భక్తులు ఎలిఫెంట్ గేట్‌మీదుగా ఈ వెలుపల క్యూలైన్‌లో సాఫీగా చేరుకునే వీలుకలుగుతుంది.

## ఆయిల్ పామ్ రైతుల సంక్షేమమే లక్ష్యం

### ధరల నిర్ధారణ కమిటీ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు

విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన 2025-26 నూనె సంవత్సరముకు గాను పామ్ ఆయిల్ గెలలు ధరను లెక్కించే సూత్రాన్ని నిర్ణయించేందుకు, ఆయిల్ పామ్ ధరల నిర్ధారణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఆయిల్ పామ్ విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకతలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 1.97 లక్షల మంది రైతులు 2.49 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేస్తుండగా, ఇది 24 జిల్లాలు, 371 మండలాలకు విస్తరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ నూనె గింజల మిషన్ ద్వారా ఉచిత మొక్కలు, సాగు ప్రోత్సాహకాలు, అంతర పంటలకు సహాయం, బిందు సేద్యం పరికరాలపై రాయితీలు అందిస్తున్నామని, కూటమి ప్రభుత్వ లక్ష్యసాధక నిర్ణయాలతో ఆయిల్ పామ్ రాష్ట్ర రైతులకు స్థిరమైన, లాభదాయక ఆదాయ పంటగా మారుతోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ఉద్యానవన శాఖ సంచాలకులు శ్రీనివాసులు, ఉద్యాన అదనపు సంచాలకులు, ఆయిల్ పామ్, ఆయిల్ ఫెడ్, ఆయిల్ పామ్ రైతులు, ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇంధన శాఖలో 27 మందికి కారుణ్య నియామకాలు

**ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**




విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ శాఖలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద 27 మంది అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు మంజూరు చేశారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సహా విద్యుత్ శాఖలోని పలు సంస్థల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఈ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియామక పత్రాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ట్రాన్స్‌కో, జెన్‌కోలో ఎప్పటికప్పుడు కారుణ్య నియామకాలు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో అర్హత మేరకు ఇంజినీరింగ్ ఉద్యోగాలు ఒక్కరికీ ఇవ్వలేదని విమర్శించారు. ఉన్నత విద్యార్హత ఉన్నవారికి కూడా ఆఫీసు సబార్డినేట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మాత్రమే ఇచ్చారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అభ్యర్థి అర్హతకు తగిన ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. అర్హులైనవారికి జూనియర్ ఇంజినీర్ ఉద్యోగాలు కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల్లోని పిల్లలకు 600 మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చామని.. కారుణ్య నియామకాల్లో జాప్యం లేకుండా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. సీఎం చంద్రబాబు నాయుడు అభ్యర్థుల ఏజ్ రిలాక్సేషన్ విషయంలోనూ సానుకూలంగా స్పందించి కారుణ్య నియామకాలకు పచ్చజెండా ఊపారని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. తద్వారా బాధిత కుటుంబాలకు చెందిన ఓవర్ ఏజ్, అండర్ ఏజ్ వారికి ప్రత్యేక అనుమతులతో ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. భవిష్యత్తులోనూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుని, ప్రతి మూడు నెలలకు ఒకసారి కారుణ్య నియామకాలు చేపడుతుందని చెప్పారు. దీనితో బాధితుల కుటుంబాలకు త్వరితగతిన ఊరట లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుత విద్యుత్ శాఖ ఇన్ సర్వీస్ ఉద్యోగులతో పాటు, కొత్తగా విధుల్లో చేరిన వారికి అవసరమైన శిక్షణను విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులందరూ విధుల్లో రెట్టింపు ఉత్సాహంగా పని చేసి విద్యుత్ సంస్థలకు మంచి పేరు తీసుకు రావాలని మంత్రి సూచించారు. సీఎస్ కె. విజయానంద్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తూ ఉద్యోగులు ఎవరైనా చనిపోతే కారుణ్య నియామకాలు చేపడుతున్నామని అన్నారు. ఏడాది లోపు దరఖాస్తు చేసుకోలేకపోయినవారికి కూడా సడలింపులు ఇచ్చి ఉద్యోగాలు కల్పించామని అన్నారు. ఉద్యోగుల భద్రత, యోగక్షేమాలు కల్పించడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రమాదాల బారిన పడిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఉద్యోగంలో చేరిన అభ్యర్థులంతా తమ స్కిల్ పెంచుకుంటూ వృత్తిపరమైన అభివృద్ధి సాధించాలని సీఎస్ విజయానంద్ ఆకాంక్షించారు.

## బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్ దరఖాస్తులు స్వీకరణ

విజయవాడ (గన్నవరం), జనవరి 30 ప్రభాతవార్త: బాలల సంరక్షణ కేంద్రాలకు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లాఅదనపు పర్యవేక్షణాధికారి టి.జ్యోతి ఒప్రకటనలో తెలిపారు. సంరక్షణ కేంద్రాలకు ఏదైని చట్టం కింద లైసెన్స్ తీసుకున్నప్పటికీ జువనైల్ జస్టిస్ చట్టం 2015లోని సెక్షన్ 41 కింద రిజిస్ట్రేషన్ తప్పదన్నారు. రక్షణ సంరక్షణ అవసరమైన పిల్లల కోసం పూర్తిగా కాని పాక్షికంగా నడపబడుతున్న బాలసంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వివరించారు. దరఖాస్తుతోపాటు అన్ని రకాల పత్రాలు జిరాక్స్ కాపీలతో 13తేదీ లోపు జిల్లా బాలల పరిరక్షణ విభాగం, ప్రభుత్వ అబ్జర్వేషన్ హోమ్ ఫర్ బాయ్స్ ప్రాంగణం, కబేళా సెంటర్, విద్యాధరపురం, విజయవాడ కార్యాలయంలో స్వయంగా సమర్పించాలని టి.జ్యోతి సూచించారు.

## మార్చి 3న శ్రీవారి ఆలయం మూత

### ఉ.9గంటల నుండి సా. 7.30గంటల వరకు దర్శనాలుండవు



తిరుమల, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మార్చి 3వ తేదీ మంగళవారం 10.30గంటలు పాటు తిరుమలేశుని ఆలయాన్ని మూసివేస్తున్నారు. ఆరోజు సాయంత్రం 3.20గంటల గంటలకు గ్రహణం ప్రారంభమై సాయంత్రం 6.47గంటలకు పూర్తవుతుంది. సాధారణంగా గ్రహణసమయానికి ఆరుగంటలు ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. మార్చి 3వ తేదీ ఉదయం చంద్రగ్రహణం ప్రభావంతో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 7.30గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేసి అన్ని దర్శనాలను రద్దుచేశారు. సాయంత్రం 7.30గంటలకు ఆలయం తలుపులు తెరచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 8.30గంటలకు శ్రీవారి భక్తులకు స్వామివారి దర్శనం పున:ప్రారంభమవుతుంది. ఆరోజు ఆలయంలో జరగాల్సిన అష్టదళపాద పద్మారాధనసేవ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది. దేశవిదేశాల్లో ఉన్న శ్రీవారి భక్తులు ఈ విషయాన్ని గమనించి తిరుమల యాత్ర ప్రణాళికలు రూపొందించుకోవాలని టిటిడి కోరింది.

## త్వరలో తిరుమలకు ఆ వాహనాలు బ్యాన్!

### ఘాట్‌లో కాలుష్య నియంత్రణ దిశగా టిటిడి కార్యాచరణ



తిరుమల, జనవరి 30 ప్రభాతవార్తప్రతినిధి: ఆధ్యాత్మికనగరం... యాత్రాస్థలం తిరుపతిలో రోజురోజుకూ పెరిగిన కాలుష్య శాతాన్ని నియంత్రించడంలో భాగంగా పుణ్యక్షేత్రం తిరుమలకు పాత డీజిల్, పెట్రోల్‌తో నడిచే వాహనాలకు త్వరలోనే చరమగీతం పాడాలనే కార్యాచరణ టిటిడి రూపొందిస్తోంది. ఇందుకోసం యాత్రికులు కూడా వీలైనంత వరకు విద్యుత్ వాహనాలను వినియోగించుకునే దిశగా టిటిడి అవగాహన కల్పించనుంది. తిరుపతినుండి తిరుమలకు ఘాట్‌లో నడిచే వాహనాల వల్ల కాలుష్యం పెరిగిపోతోంది. పర్యావరణం కూడా కలుషితమవుతోందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిరుమలకొండపై వాయు, వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యుత్ వాహనాల వినియోగంపై టిటిడి అధికారులు ఇప్పటికే దృష్టిపెట్టారు. దశాబ్దకాలం క్రిందటి వాహనాలను, కాలంచెల్లిన వాహనాలను తిరుమలకు దాదాపు అనుమతించడం లేదు. అలిపిరి వద్ద రవాణాశాఖ, పోలీసులు తనిఖీ చేసి ఆ తరువాత అనుమతినిస్తున్నారు. ఘాట్‌లో సామర్థ్యం లేనివాహనాలను అలిపిరిలోనే నిలిపివేసి ఆర్టీసి బస్సుల్లో, ప్రత్యామ్నాయాలు చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుమలను పూర్తిస్థాయిలో కాలుష్య రహిత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలనే సిఎం చంద్రబాబునాయుడు సూచనలు టిటిడికి స్పష్టంగా తెలిపారు. ఈ నేపథ్యంలో టిటిడి అధికారులు కూడా తిరుమల ఘాట్‌లో విద్యుత్ వాహనాలు వినియోగం పై అవగాహన, చర్యలకు సిద్ధమవుతున్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సిఎం సూచనలు అమలు చేసే దిశగా కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే తిరుమలకు 50వరకు విద్యుత్‌తో నడిచే ఆర్టీసి బస్సులు తిరుగుతున్నాయి. ఇవేగాక మరో వందవరకు టిటిడి అధికారుల కార్లు, రెండువందలపైగా ద్విచక్ర వాహనాలు కూడా విద్యుత్‌తో నడిచేవి వినియోగిస్తున్నారు. గతంలోనే తిరుమలకు విద్యుత్ వాహనాలు నడపాలని ప్రభుత్వం సంకల్పించింది. టిటిడి ఉద్యోగులకు గత బోర్డు సులభ విధానంలో విద్యుత్ వాహనాలు కొనుగోలుకు మార్గం సుగమం చేశారు. ఇప్పుడు తిరుమల పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపింది. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలవుతోంది. ఇక పూర్తిగా పాత డీజెల్, పెట్రోల్‌తో నడిచే వాహనాలను కూడా మెల్లగా తిరుమలకు అనుమతించకూడదని నిర్ణయించారు. ప్రస్తుతం ఆరువేలవరకు రోజువారీగా యాత్రికుల వాహనాలు, ట్యాక్సీలు దేశంలోని అనేక రాష్ట్రాల నుండి పెట్రోల్, డీజెల్‌తో నడిచేవి తీసుకువస్తున్నారు. 450వరకు ఆర్టీసి బస్సులు డీజిల్‌తో నడిచేవి తిరుగుతున్నాయి. స్థానికంగా తిరుపతి- తిరుమల మధ్య నాలుగు వేల వరకు ట్యాక్సీలు, వాహనాలు డీజెల్, పెట్రోల్‌వి నడుపుతున్నారు. దీనివల్ల ఘాట్‌లో, తిరుమల కొండపై కాలుష్యం శాతం పెరిగిపోతోందనేది పర్యావరణ శాస్త్రవేత్తల అంచనా. దీన్ని తగ్గించేందుకు, పచ్చదనం పెంపొందించడంతోబాటు పూర్తిగా విద్యుత్‌తో నడిచే వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని టిటిడి అధికారులు తీవ్రంగా ఆలోచన చేస్తున్నారు. 2026 జూన్‌నాటికి పాత డీజెల్, పెట్రోల్ వాహనాలను ఘాట్‌లో అనుమతించరాదనేది ఒక అంశంగా చర్చించారు. తిరుమలను కాలుష్యరహిత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలనే ఆశయం దిశగా అడుగులు పడుతుండటం శుభపరిణామంగానే భావిస్తున్నారు.

## మల్లవరం- కనిగిరి కొత్త రైల్వే లైన్

### రైల్వే సేఫ్టీ కమీషనర్ తనిఖీ, స్పీడ్ ట్రయల్ పూర్తి



సచివాలయం, జనవరి 30 ప్రభాతవార్త: సికింద్రాబాద్ - నడికుడి - శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులో భాగంగా మల్లవరం- కనిగిరి స్టేషన్ల మధ్య (కిమీ 118.310 నుంచి 154.239వరకు) నూతనంగా నిర్మించిన బ్రాడ్ గేజ్ లైన్‌ను దక్షిణ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమీషనర్ తనిఖీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించే ఈ ప్రాజెక్టులో ఇది ఒక కీలకమైన ఘట్టం. ఉదయం 9.30గంటలకు మల్లవరం స్టేషన్ నుండి ఈ తనిఖీ ప్రారంభమైంది. 35.929కిమీ మేర సాగిన ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే నిర్మాణ విభాగం, గుంటూరు డివిజన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కిమీ 142.075 వద్ద ఉన్న 2డిగ్రీల మలుపు లోతైన కట్టింగ్‌లు, ఎత్తైన గట్టుల వద్ద రైలు ప్రయాణ భద్రతను పరీక్షించారు.

**విజయవంతమైన స్పీడ్ ట్రయల్:** మధ్యాహ్నం మోటార్ ట్రాలీ తనిఖీ అనంతరం, కనిగిరి- మల్లవరం స్టేషన్ల మధ్య అత్యంత వేగంతో రైలును నడిపి స్పీడ్ ట్రయల్ నిర్వహించారు. ఈ పరీక్షలో ట్రాక్ స్థిరత్వం మరియు వేగ పరిమితుల వద్ద రైలు ప్రయాణం సాఫీగా సాగినట్లు అధికారులు ధ్రువీకరించారు. **ప్రాజెక్టు ప్రయోజనాలు:** 308కిమీ నడికుడి - శ్రీకాళహస్తి ప్రాజెక్టులో మల్లవరం - కనిగిరి విభాగం అత్యంత కీలకం. ఈ లైన్ అందుబాటులోనికి రావడం వల్ల రద్దీగా ఉండే చెన్నై -హౌరా తీరప్రాంత రైలు మార్గానికి ఇది ప్రత్యామ్నాయంగా మారుతుంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. ఈ ప్రాంతం నుండి వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల రవాణా మరింత సులభతరం అవుతుంది. సిఆర్ఎస్ తుది నివేదిక సమర్పించిన తర్వాత, ఈ మార్గంలో ప్రయాణీకుల, సరుకు రవాణా రైళ్ళ రాకపోకలకు అనుమతి లభిస్తుంది.

వార్త

అహంకారం ఆత్మను పతనం చేయడమే కాక అనామకునిగా చేయడానికి ముఖ్య కారణమౌతుంది.

-సిసిరో

# 'సమ భావన' సామరస్యమేనా?

విశ్వవిద్యాలయాల్లో సమానత్వాన్ని ప్రోత్సహించడానికి అన్ని విద్యాసంస్థలు 'ఈక్విటీ' కమిటీలను ఏర్పాటు చేయడం తప్పనిసరి చేస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సరికొత్త నిబంధన ఇప్పుడు అత్యున్నత న్యాయస్థానం జోక్యం కోరుతోంది. ఈ నిబంధనలకు లోబడి కమిటీలు ఏర్పడతే కుల వివక్ష రూపు మాపడం తేలిక అని యుజిసి భావించింది. ఆ నేపథ్యంలోనే సర్వసమ్మతంగా ఉంటుందని ఎలాంటి విద్యార్థి భాగస్వామ్య సమావేశాలు లేకుండా ప్రకటించేశారు. కానీ విద్యార్థి సంఘాలు సుప్రీంకోర్టు కెక్కాయి. ఈ నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తాత్కాలిక స్టే మంజూరైంది. ఈ సందర్భంగా న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు ఆలోచించదగినవే. వ్యాఖ్యలు తీర్పులుగా రాకపోయిన ఈఅంశంలో ఉన్న లోతుపాతుల్ని చర్చించేందుకు మార్గదర్శకాలు అవుతాయి. యుజిసి మార్గదర్శకాలు అస్పష్టంగా ఉన్నందున వీటిని దుర్వినియోగం చేసేందుకే ఎక్కువ అవకాశం ఉందన్న ధోరణిలో ఉందనే న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. విద్యాసంస్థల్లో స్వేచ్ఛాయుత సమానత్వం, సమ్మిళిత వాతావరణాన్ని ప్రతిబింబించే పరిస్థితులు ఉండాలని ధర్మాసనం భావిస్తోంది. రోహిత్ వేముల కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇన్నాళ్లకు యుజిసి నిబంధనలు 2012 స్థానంలో కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చింది. కొత్త నిబంధనలలో కులవివక్ష నిర్వచనాన్ని సరైన విధానంలో భాష్యం చెప్పలేదని కొన్ని వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ అంశంలో ఒబిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బందికే పరిమితం చేయడంలో అభ్యంతరాలు వెల్లువెత్తాయి. కొన్ని వర్గాలను యుజిసి మినహాయించడం సరైన విధానం కాదని కోర్టులో పిటిషనర్ వాదిస్తున్నారు. 'ఉన్నత విద్యాసంస్థల్లో సమభావన' అన్న నినాదం బాగానే ఉంది. కానీ ఎక్కడో ఏదో తేడా ఉందని పలు వర్గాలు అభ్యంతరాలు నడమ ఇప్పుడు ఏదో ఓ రూపంలో సుప్రీంకోర్టుకు చేరతాయి. అప్పుడే ఆ నిర్ణయంలోని లోపాలు తేటతెల్లమవుతాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల సాధారణ ప్రవర్తనను కూడా స్థానిక సంప్రదాయాలను సాటి విద్యార్థులకు అవగాహనలేక 'టీజింగ్'కు గురవుతున్నారన్న వార్తలు వింటూనే ఉన్నాం. యుజిసి కొత్త నిబంధనలో ర్యాగింగ్ అంశాన్ని చేర్చకపోవడమూ విమర్శకు గురైంది. ఈ కారణాల చేతనే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల్యా బాగ్చీ ధర్మాసనం 'ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వ ప్రోత్సాహక కమిటీ ఏర్పాటు నిబంధనలు 2026ను నిలిపివేసింది. అంతవరకు పాత నిబంధనలే అమల్లో ఉంటాయి. జనరల్ కేటగిరీ విద్యార్థులకు ఫిర్యాదు చేసే హక్కులేకపోవడం వల్లనే అత్యధిక విద్యార్థులు తమకు కష్టం కలిగితే దిక్కెవరు? అన్న చందాన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాంతీయతత్వంతో ర్యాగింగ్ సమస్యలు తలెత్తుతున్న అంశాలు బయటికి వస్తున్నా వాటిని పరిష్కరించే యోచన యుజిసి నిబంధనల్లో కనబడటం లేదని జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి అభిప్రాయపడ్డారు. 2019లో రోహిత్ వేముల, పాయల్ తడ్వి మాతృమూర్తులు దాఖలు చేసిన 'పిల్'సందర్భంగా ఎన్నో అంశాలకు మార్గదర్శకాలను రూపొందించారు. వాటిని మార్చడంలో కుల వివక్షను పూర్తిగా నిర్మూలించాలన్న రాజ్యాంగ లక్ష్యంతోనే కొత్తనిబంధన రూపుదిద్దుకొంది. ఈ విషయంలో సుప్రీం ధర్మాసనం జోక్యం చేసుకోవడంపై భారతీయ జనతా పార్టీ, బిఎస్‌పి, టిఎంసి, ఎస్పీ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అంశాలపై విస్తృత చర్చలు జరగాల్సి ఉంది. కుల వివక్షలేని, కుల రహిత సమాజ సాధన కోసం స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లయినా సరైన దిశగా ఆలోచించలేకపోతున్నారు అనే భావన కలుగుతోందన్న ధర్మాసనం అభిప్రాయం కరెక్టే. కులాంతర వివాహాలు, సర్వమత ప్రార్థనలు, పరమత సహనం వెల్లివిరుస్తున్న సందర్భాలు రానురాను గోచరిస్తూనేఉన్నాయి. అయినా 'సమ భావన' నిబంధనలో సమాజాన్ని చీల్చే ఆలోచనలెందుకు వస్తున్నాయో అర్థంకాదు. సమాజం మారుతున్నప్పుడు నిర్ణయాలు కూడా ఆ దిశగానేఉండాలి. ప్రఖ్యాత న్యాయ కోవిదులు, సామాజిక స్థితిగతులపై సమగ్ర అవగాహన ఉన్న నిపుణులు, ఇలా ఇద్దరు, ముగ్గురుతో కమిటీ ఏర్పాటు అత్యంత అవశ్యకం. సమాజం ఎలా ప్రగతి సాధించాలి? దాని కోసం విద్యాసంస్థల్లో నిబంధనలు తమ భవిష్యత్ జీవితంలో ఎలా ఉపయోగపడతాయి. వాటి పర్యవసానాలు ఎలా ఉంటాయి అనే అన్ని అంశాలను వారు లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుందని ప్రధాన న్యాయమూర్తి సూచించారు. యూనివర్సిటీల్లో 'వివక్ష' అనగానే కులానికి అంటగట్టే ఏ విధమైన భాష్యాన్నైనా సరిచేయాలని ఆ విధమైన ప్రస్తావన తప్పనిసరిగా ఉండాలని విద్యార్థిలోకంకోరుతోంది. యుజిసి నిబంధనతో విద్యార్థిలోకంలో అలజడి మొదలైంది. కొన్ని సందర్భాల్లో అలజడి, మరికొన్ని అంశాల్లో ఆవేదన, ఇంకొన్ని ఉదంతాల్లో క్రమశిక్షణ వంటిఅన్ని అంశాలూ విద్యార్థుల్లో ఉండేవే. కానీ ఒక్కసారిగా యుజిసి ఆలోచనలు నిరసనలకు దారితీయకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత వర్సిటీల్లో ఉంది. విద్యార్థులకు కులాల వారీ హాస్టళ్ల ఏర్పాటును సుప్రీంకోర్టు వ్యతిరేకిస్తోంది. ఇన్నాళ్లూ ఒకే హాస్టల్‌లో కలిసి మెలిసి ఉండే వారిలో కులవైషమ్యాలు తలెత్తుతాయని ధర్మాసనం కూడాఆవేదన వ్యక్తం చేయడం విశేషం. 'ఐక్యభారత్' భావనను విద్యాయాల్లో తీసుకొచ్చే దిశగా నిపుణుల నివేదిక ఉండాలని ప్రజలు కోరుతున్నారు. 'సమభావన'కు అసలు సిసలైన నిర్వచనాన్నివ్వగల పరిస్థితి ఇప్పుడు ధర్మాసనం దృష్టిలోపడడం మంచిదే అయింది.



అధికారం నిలుపుకోలేనివారు వేరొకరిపై అధికారం చూపడం భావ్యం కాదు.

ఆస్కార్‌వైల్డ్



విజయం మేధావిని వినయవంతుణ్ని చేస్తుంది. సామాన్యుడిని ఆశ్చర్య పరుస్తుంది. అవివేకిని అహంభావిగా మారుస్తుంది.

స్వామి వివేకానంద

# గాంధీయిజమా! బ్రాందీయిజమా?

దశలవారీగా తగ్గిస్తామని వేదికలెక్కి ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చిన కొందరు నేతలు దశల వారీగా విస్తరింప చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో మంచినీరు దొరకని గ్రామాలు ఎన్నో ఉన్నాయి కానీ మద్యం దొరకని గ్రామాలు లేవనే చెప్పొచ్చు. ఇప్పటికైనా గాంధీ వారసులమని చెప్పుకొనే నేతలు ఆలోచించాలి. అవినీతిలో కూరుకు పోయి నిస్తేజంగా ఉన్న ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయాలి. సంకుత ప్రయోజనాలు విడనాడి విశాల ధృకథ్పంతో ప్రధానంగా జాతి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని అడుగులు వేయాలి. అప్పుడే మహాత్ముడ్ని మరిచిపోలేదంటూ యేటా తామెంతో ఘనంగా నిర్వహిస్తున్న గాంధీ జయంతి, వర్ధంతులకు ఒక అర్థం ఉంటుంది

దామెర్ల సాయిబాబ

జనవరి ముప్పై సోదరా జాతికి ముప్పైనాదిరా, కరం చంద్ నేడుండినా ఈ నిషా బంద్ కాకుండేనా అంటూ ఎంతో ఆవేదనతో అన్నాడో కవి. వాస్తవానికి మద్యపాన నిషేధం అన్నది మహాత్ముడు భారత ప్రజలకు అందించిన అమృత సందేశం. ఆనాడు కాంగ్రెస్ పార్టీయేకాదు స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న ప్రజాస్వామ్యవాదులెందరో మద్యపానాన్ని ఈ దేశం నుంచి పారద్రోలాలని నినదించారు. రాజకీయాలకు అతీతంగా మహాత్ముడ్ని అందరూ గౌరవించేవారే, ఆదరించేవారే, ఆరాధించేవారే. ఆయన జయంతులు, వర్ధంతులు క్రమం తప్పకుండా చేసుకుంటూనే ఉన్నాం. ఆయన ఇచ్చిన సందేశాలను పదేపదే వల్లిస్తూనే ఉంటాం. నిన్న శుక్రవారం గాంధీ వర్ధంతి దేశవ్యాప్తంగా ఎంతో ఘనంగా నిర్వహించుకున్నాం. ఆయనకు ప్రధానమంత్రి నరేంద్రమోడీతోసహా పలు రాష్ట్రాల ముఖ్య మంత్రులు, మంత్రులు, నాయకులు పార్టీలకు అతీతంగా అందరూ శ్రద్ధాభక్తులతో నివాళులు అర్పించారు. ఆయన సిద్ధాంతాలను, ఆయన చేసిన ప్రసంగాలను జాతికి ఇచ్చిన సందేశాలను మరీ మరీ గుర్తు చేసుకుంటూనే ఉన్నాం. కానీ ఆయన నినదించిన మద్యపాన నిషేధాన్ని మాత్రం పట్టించుకోకపోగా కేవలం ఆదాయం కోసం మద్యం సేవించండి అంటూ పాలకులే ప్రోత్సహించ డం అత్యంత దురదృష్టకరం. మద్యనిషేధంపై ప్రజలను కూడబెట్టి ఉద్యమం చేసినవారే అధికారంలోకి రాగానే ఏరు దాటాకా తెప్పతగలేసినట్లు వ్యవహరిస్తున్నా రు. మద్యం అనేది ప్రభుత్వాలకు ప్రధానఆదాయాల్లో ఒకటిగా మారింది. ఈ పరిస్థితుల్లో మద్యనిషేధం విధించడం అన్నది సాధ్యం కాదని కొందరి ఆర్థిక నిపుణుల వాదన నిజమే కావచ్చు. ఆదాయం కోసం ప్రజలఆరోగ్యాన్ని పణంగా పెట్టడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలి. మద్యం వల్ల జరుగుతున్న కష్టనష్టాలను పరిశీలిస్తే ముఖ్యంగా క్షేత్రస్థాయిలో జరుగు తున్న విషయాలను మనసుపెట్టి చూస్తే ఎంతటి హృదయ విదారక పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారో తెలుస్తుంది. అధికశాతం నేరాలు మద్యం మత్తులోనే జరుగుతున్నాయి. మానవ సంబంధాలు, మమతానురాగాలను కూడా మద్యం తుంచివేస్తున్నది. మొన్న ఆ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో ఓ కన్న తండ్రి ఇద్దరు కుమారులనుఅత్యంత పాశవికంగా గొంతుకోసి చంపాడు. మద్యంమత్తులో భర్త పెట్టే బాధలు భరించ లేక ఇల్లాలు పుట్టింటికి వెళ్లిపోతే మైకంలో భార్యపై కసితీర్చుకునేందుకు సొంత కొడుకులనే గొంతుకోసి మట్టుపెట్టాడు. మద్యం తాగేందుకు డబ్బులు అడిగితే ఇవ్వని తల్లినే ఏకంగా కొట్టి చంపిన కొడుకులున్నారు. ఇలాంటి సంఘట నలు ఇటీవల కాలంలో తరచుగా జరుగుతున్నాయి. మరొక కిరాతకుడు మద్యం అలవాటు విడిచిపెట్టమని కాళ్లావేళ్లా పడిన భార్యను చంపి మూటకట్టి పడేశాడు. వారి ఏకైక కుమార్తె అనాథగా మారిపోయింది. మద్యం మత్తులో కూతురుపై అఘాయిత్యాలకు పాల్పడిన తండ్రులు జైళ్లలో మగ్గుతున్నారు. మద్యం రక్కసికి వేలాది కుటుంబాలు ఛిద్రమైపోతున్నాయి. ఇక నేరాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నది. మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు అంతేలేకుండా పోతున్నది. అధికశాతం నేరాల్లో నిందితులు మద్యంమత్తులో ఉన్నవారే. అంతెందుకుప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దేశరాజధాని ఢిల్లీలో జరిగిన నిర్భయ కేసులో దోషులందరూ పూర్తిమత్తులో ఉన్నవారే. చాలా ప్రమాదాలకు మూలకారణం ఈ మద్యంమత్తే అని చెప్పొచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొంతకాలం పూర్తి నిషేధం అమలు చేసిన సమయంలో నేరాలతోపాటు ప్రమాదాలు కూడా తగ్గినట్లు అధికారిక రికార్డులే వెల్లడిస్తున్నాయి. యేటాదాదాపుపదిహేడు, పద్దెనిమిది వేల మందికిపైగా ఈ ప్రమాదాల్లో మరణిస్తున్నారు. మరో యాభై, అరవైవేలమంది క్షతగాత్రులవుతున్నారు. ఇలా క్షతగాత్రులైనవారిలో కొందరు శాశ్వత వికలాంగులుగా మారి కుటుంబానికి భారమై, మంచానికే పరిమితమై జీవచ్ఛ వంలా జీవనం సాగిస్తున్నారు. ఆ విషయం అలాఉంచితే. మద్యంవల్ల మామూలువ్యాధులేకాదు ఊపిరితిత్తులు, కేన్సర్‌లాంటి ప్రాణాంతక వ్యాధులతో కోట్లాది మంది అల్లాడిపోతున్నారు. మద్యం అనేది ఇప్పటికిప్పుడు వచ్చింది కాదు. దీనికి సుదీర్ఘ చరిత్రఉంది. మద్యానికి బానిసలై అనారోగ్యంపాలై కుటుంబాలకు కుటుంబాలే రోడ్డున పడు తుండడంతో ఆనాడే ఆవేదన చెందిన మహాత్ముడు స్వతంత్ర భారతావని నుంచిమద్యాన్ని తరమికొట్టాలని పిలుపునిచ్చారు. మహాత్ముడు కలలకు అనుగుణంగాస్వాతంత్ర్యం సిద్ధిం చిన తర్వాత 1947 అక్టోబరు ఒకటో తేదీ నుంచి అప్పటి మద్రాసు ప్రభుత్వం మద్యనిషేధాన్ని విధించింది. అందులో భాగంగా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఆనాడే దీనిని విజయవంతంగా అమలుచేశారు. మద్యపానం వల్ల కలిగే కష్టనష్టాలను ప్రజలకు వివరించి చెప్పడంలోనూ, మరొకపక్క అక్రమంగా మద్యం తయారు చేసేవారిపై ఉక్కుపాదం మోపడంలోనూ ఆనాటి ప్రభుత్వం ఎంతోసమర్థవంతంగా వ్యవహరించింది. ఎక్కడో రహస్యంగా మద్యం సేవించాలనుకున్నా, తాగి పదిమందిలోకి రావాలనుకున్నా భయపడేవారు. తాగుబోతులంటే ప్రజల్లోఒకరకమైన హేయభావం ఉండేది. వారిని సామాజికంగా బహిష్కరించే స్థాయికి ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఆనాటి పాలకులుకొంత వరకు విజయం సాధించారు. తాగుబోతు యువకుల పెళ్లిళ్లు కావడంకూడా కష్టతరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. మద్యం రక్కసి రాష్ట్రాన్ని వదలిపెట్టక తప్పదనే పరిస్థితులు నెలకొన్నాయి. 1960ప్రాంతంలో రాజకీయ జోక్యంపెరగడంతో నిషేధాన్ని అమలుచేయడం కష్టతరంగా పరిణమించింది. సారాతయారీ దారులు కొందరు రాజకీయ నాయకుల అండదండలతో నిషేధానికి తూట్లు పొడవడం ప్రారంభించారు. మద్యనిషేధం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆదాయంకోల్పోతుందని దానిని ఎత్తివేయాలనే వాదనను లేవనెత్తారు. అప్పటికే తెలంగాణ ప్రాంతంలో నిషేధం అమలులో లేకపోవడం, అక్కడఆదాయం ఆనాటికి దాదాపు రూ.యాభైకోట్లు ఉండడంతో ఒకే రాష్ట్రంలో ఒక దగ్గర నిషేధం, మరొకదగ్గర నిషేధం లేకపోవడం వంటి కారణాలు తర్జనభర్జనల అనంతరం 1969 ప్రాంతంలో నిషేధానికి స్వస్తి పలికారు. దీంతో ఆదాయం ఆనాడే వంద కోట్లపైకి చేరుకున్నది. అదిఇప్పుడు రెండు తెలుగురాష్ట్రాలలో అరవై, డెబ్బైవేల కోట్లకుపెరిగింది. ప్రభుత్వాలకు ప్రధాన ఆదాయంగా మారిపోయింది. ఎన్నికల్లో కూడా ఇది కీలకమైపోయింది. నియోజక వర్గంలోఎన్ని మంచి పనులు చేసినా, ఎంతడబ్బు వెదజల్లినా మద్యం పంచకపోతే గెలుపు అసాధ్యమనే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రాజకీయాన్ని శాసించేస్థాయికి మద్యం ఎదిగిపోయింది. 1990ప్రాంతంలో ప్రధానంగా మహిళలు, మరికొందరు ప్రజాస్వామ్యవాదులు మద్యానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఉద్యమ తీవ్రతను గ్రహించిన ఆనాటి ముఖ్యమంత్రి కీ.శే. విజయభాస్కర్ రెడ్డి 1994 ఏప్రిల్ ఒకటిన సారాను నిషేధించి పాక్షికంగా మద్యనిషేధా న్ని విధించారు. కానీ అప్పటికే ఆరువందల కోట్ల రూపాయల వరకు రాష్ట్ర ఆదాయం కోల్పోతుందని కొందరు అధికారులు గగ్గోలు పెట్టారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉంటూ అధికార పీఠాన్ని అధిష్టించేందుకు ఆరాటపడుతున్న తెలుగు దేశం నేత ఎన్టీరామారావు పాక్షిక నిషేధంతో ఆశించినఫలితాలు రావని, సంపూర్ణ మద్యనిషేధమే సరైన మార్గమని పిలుపునిచ్చారు. అప్పటికే ఉద్యమిస్తున్న స్వచ్ఛసంస్థలు కొన్ని ఆయనతో గొంతుకలిపాయి. ఆఎన్నికల్లో ఈ నినాదం తెలుగుదేశం పార్టీకి ఎంతో ఉపయోగపడింది. ముఖ్యంగా మహిళలు నమ్మి తెలుగు దేశాన్ని అఖండ మెజారిటీతో గెలిపించారు. వేలాది మంది ప్రజలు పార్టీ కార్యకర్తలు, అధికారులు, అభిమానుల సమక్షంలో హైదరాబాద్ లాల్‌బహుదూర్ స్టేడియంలో ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం సంపూర్ణ మద్యనిషేధం ప్రకటిస్తూ ఫైలుపై తొలిసంతకం చేశారు. ఆతర్వాత కొద్దికాలానికి అదే ప్రభుత్వంమద్యం అమ్మకాలకు తెరలేపింది. దశలవారీగా తగ్గిస్తామని వేదిక లెక్కి ఎన్నో ఉప న్యాసాలు ఇచ్చిన కొందరు నేతలు దశల వారీగా విస్తరింప చేస్తున్నారు. తెలుగురాష్ట్రాల్లో మంచినీరు దొరకని గ్రామాలు ఎన్నో ఉన్నాయి కానీ మద్యం దొరకని గ్రామాలు లేవనే చెప్పొచ్చు. ఇప్పటికైనా గాంధీ వారసులమని చెప్పుకొనే నేతలు ఆలోచించాలి. అవినీతిలో కూరుకుపోయి నిస్తేజంగా ఉన్న ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయాలి. సంకుత ప్రయోజ నాలు విడనాడి విశాలధృకథ్పంతో ప్రధానంగా జాతి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని అడుగులు వేయాలి. అప్పుడే మహాత్ముడ్ని మరిచిపోలేదంటూ యేటా తామెంతో ఘనంగా నిర్వహిస్తున్న గాంధీ జయంతి, వర్ధంతులకు ఒక అర్థం ఉంటుంది. ●

## ఒక్క మాట

# భద్రత ముసుగులో నిఘా సామ్రాజ్యం

తిప్పర్తి శ్రీనివాస్

సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ మన జీవితం మరింత సౌకర్యవంతమవుతోంది. ఒక క్లిక్‌తో సమాచారం, ఒక యాప్‌తో సేవలు, ఒక కెమెరాతో భద్రత ఇవి ఆధునిక సమాజానికి గుర్తులు. కానీ ఈ సౌకర్యాల వెనుక దాగి ఉన్న మరో వాస్తవం ఏమిటంటే, వ్యక్తిగత గోప్యత క్రమంగా కనుమరుగవుతూ ఉండటం. 'భద్రత' అనే పదాన్ని ముందు పెట్టి, నిఘా వ్యవస్థలను విస్తరించడం నిజంగా ప్రజల రక్షణ కోసమా? లేక పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛపై దాడేనా? అనే ప్రశ్న నేడు ప్రతి ఆలోచన గల పౌరుడిని కలవరపెడుతోంది. ఒకప్పుడు నిఘా అనేది నేరస్తులపై మాత్రమే ఉండేది. నేడు పరిస్థితి మారిపోయింది. సీసీటీవీ కెమెరాలు, మొబైల్ ఫోన్ ట్రాకింగ్, బయోమెట్రిక్ డేటా, సోషల్ మీడియా పర్యవేక్షణ ఇవన్నీ సామాన్య ప్రజల జీవితాల్లో భాగమయ్యాయి. మనం రోడ్డుపై నడిచినా, బస్సులో ప్రయాణించినా, కార్యాలయంలో పని చేసినా, చివరకు మన ఇంట్లో ఉన్నా కూడా ఎవరో ఒకరు గమనిస్తున్నారనే భావన కలుగుతోంది. ఇది భద్రతకు సంకేతమా, లేక స్వేచ్ఛకు సంకెళ్లో? ప్రభుత్వాలు నిఘా వ్యవస్థలను సమర్థించడానికి ప్రధానంగా చూపే కారణం 'జాతీయ భద్రత'. ఉగ్రవాదం, నేరాలు, సామాజిక అశాంతిని నివారించడానికి నిఘా అవసరమని వాదిస్తాయి. నిజమే, కొన్ని సందర్భాల్లో నిఘా వల్ల నేరాలు వెలుగులోకి వచ్చాయి, దోషులు పట్టుబడ్డారు. కానీ ఈ నిఘా పరిమితులు ఎక్కడ ముగుస్తాయి? ఎవరి అనుమతితో, ఎవరి పర్యవేక్షణలో ఈ డేటా సేకరణ జరుగుతోంది? అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు చాలాసార్లు కనిపించవు. వ్యక్తిగత గోప్యత అనేది మానవ హక్కులలో ఒక ముఖ్యమైన హక్కు. ఒక వ్యక్తి ఏమి మాట్లాడాలి, ఎవరితో మాట్లాడాలి, ఎక్కడికి



వెళ్లాలి, ఏ ఆలోచనలను వ్యక్తపరచాలి ఇవి అతని స్వేచ్ఛకు సంబంధించిన అంశాలు. కానీ నిఘా విస్తరించిన కొద్దీ, ప్రజలు తమ మాటలు, చర్యలపై స్వయంగా నియంత్రణ విధించుకుంటున్నారు. ఎవరైనా వింటున్నారేమో, ఎక్కడైనా రికార్డ్ అవుతుందేమో అనే భయం సమాజంలో నెమ్మదిగా చొచ్చుకుపోతోంది. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతం. డిజిటల్ యుగంలో డేటా అనేది కొత్త సంపదగా మారింది. మన వేలిముద్రలు, కంటి రెటీనా వివరాలు, ఫోన్‌కాల్ రికార్డులు, లొకేషన్ డేటా ఇవన్నీ ఎవరి చేతుల్లో ఉంటున్నాయి? ఈ సమాచారాన్ని భద్రంగా ఉంచుతున్నారా? లేక వాణిజ్య ప్రయోజనాల కోసం లేదా రాజకీయ అవసరాలకోసం దుర్వినియోగం చేస్తున్నారా? అనే అనుమానాలు సహజంగా తలెత్తుతున్నాయి. ఒకసారి డేటా లీక్ అయితే, దాని ప్రభావం వ్యక్తి జీవితాన్ని పూర్తిగా అస్తవ్యస్తం చేయగలదు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో నిఘాగోప్యతమధ్య సమతుల్యతపై చర్చ జరుగుతోంది. కొన్నిదేశాలు కఠినమైన డేటా రక్షణ చట్టాలను తీసుకొచ్చాయి. పౌరుల అనుమతి లేకుండా వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడాన్ని నిషేధించాయి. కానీ ఇంకా చాలా దేశాల్లో స్పష్టమైన చట్టాలు లేకపోవడం వల్ల, అధికారాల దుర్వినియోగానికి అవకాశం ఏర్పడుతోంది. భద్రత అవసరమే. కానీ ఆ భద్రత ప్రజల హక్కులను హరించేస్థాయికిచేరితే, అది రక్షణకాదుఅణచివేత. నిజమైన భద్రతఅంటే ప్రజలు భయపడకుండా జీవించగలగడం, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచగలగడం. నిఘా వ్యవస్థలు పారదర్శకంగా ఉండాలి, చట్టపరమైన నియంత్రణలో ఉండాలి. ఎవరు, ఎందుకు, ఎంతవరకు నిఘా చేయవచ్చో స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం. చివరగా చెప్పాలంటే, భద్రత పేరుతో గోప్యతను త్యాగం చేయడం సులభమే. కానీ ఒకసారి కోల్పోయిన స్వేచ్ఛను తిరిగి పొందడం చాలా కష్టం. కాబట్టి సమాజం మొత్తం ఈ అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. భద్రత గోప్యత ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం నిలబడగలదు. లేకపోతే, నిఘా కళ్లనీడలో మన స్వేచ్ఛ నెమ్మదిగా మాయమైపోయే ప్రమాదం ఉంది. ●

# ఒక్క క్షణం తప్పిదం.. జీవితాంతం విషాదం

ఎస్. కిష్టయ్య

రోడ్డు ప్రమాదాలు నేటి భారత సమాజంలో అత్యంత తీవ్రమైన ప్రజా సమస్యగా మారాయి. ఇవి కేవలం ఒక్క వ్యక్తి లేదా ఒక కుటుంబానికి మాత్రమే సంబంధించిన విషాదాలు కావు. సమాజం మొత్తాన్ని ఆర్థికంగా, మానసికంగా, సామాజికంగా దెబ్బతీసే విపత్తులు, అభివృద్ధి, సాంకేతిక పురోగతి, వాహనాల సంఖ్య పెరుగుదల ఒకవైపు జరుగుతుండగా, భద్రతా సంస్కృతి మాత్రం అదేస్థాయిలో పెరగకపోవడమే రోడ్డు ప్రమాదాల తీవ్రతకు మూల కారణంగా మారింది. ప్రతి రోజు జరిగే ప్రమాదాలు మనకు అలవాటుగా మారిపోవడం ఈ సమస్య ఎంత లోతుగా వేళ్లూనుకుపోయిందో సూచిస్తోంది. గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది సుమారు ఐదు లక్షలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారిక నివేదికలు చెబుతున్నాయి. వీటిలో దాదాపు ఒకటిన్నర లక్షల మంది ప్రాణాలు కోల్పోతుండగా, లక్షల మందికి పైగా గాయాలపాలవుతున్నారు. అంటే సగటున ప్రతి గంటకు దాదాపు 17 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారన్న మాట. ప్రపంచంలో రోడ్డు ప్రమాద మరణాల్లో భారత్ ముందున్న దేశాల్లో ఒకటిగా ఉండటం అత్యంత ఆందోళనకరం. మరణించిన వారిలో సుమారు 60 శాతం మంది 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు గలవారే కావడం వల్ల, కుటుంబాలకు ఆధారమైన యువతే ఎక్కువగా బలవుతుండటం దేశానికి తీరని నష్టంగా మారుతోంది. ఈ ప్రమాదాలకు ప్రధాన కారణంగా మానవ తప్పిదమే అత్యధిక శాతంలో ఉంది. గణాంకాల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 75 నుంచి 80 శాతం వరకు మానవ నిర్లక్ష్యం, నియమాల ఉల్లంఘనే కారణం. అతివేగం ఒక్కటే సుమారు 40శాతం ప్రమాదాలకు కారణమవుతోంది. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు సుమారు 8నుంచి 10శాతం వరకు ఉంటున్నాయి. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ లేదా మెసేజ్‌లు చూస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలు ప్రతి ఏడాది పెరుగుతున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం విషయంలో కూడా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో మరణించిన వారిలో సగానికి పైగా హెల్మెట్ ధరించకపోవడం వల్ల తల గాయాలతోనే ప్రాణాలు కోల్పోతున్నారు. నాలుగు చక్రాల వాహనాల్లో సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల తీవ్ర గాయాలపాలయ్యే వారి సంఖ్య



కూడా అధికంగానే ఉంది. చిన్నపిల్లలను సురక్షితంగా కూర్చోబెట్టే చైల్డ్ సేఫ్టీ సీట్లు వినియోగించకపోవడం వల్ల పిల్లల మరణాలు, గాయాలు పెరుగుతున్నాయి. మానవ తప్పిదంతో పాటు రోడ్డు మౌలికసదుపాయాల లోపాలు కూడా ప్రమాదాలకు దోహదపడుతున్నాయి. దేశవ్యాప్తంగా జరిగే ప్రమాదాల్లో సుమారు 25శాతం వరకు రోడ్డు డిజైన్ లోపాలు, గోతులు, తగిన సంకేతాల లేమి, సరైన లైటింగ్ లేకపోవడం వంటి అంశాలు కారణమవుతున్నాయి. హైవేలు, జాతీయ రహదారులపై గుర్తించిన 'బ్లాక్ స్పాట్లు' వేలసంఖ్యలో ఉన్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ బ్లాక్‌స్పాట్ల వద్దే ప్రతి ఏడాది వేలాది ప్రమాదాలు, వందలాది మరణాలుజరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సరైన రోడ్డు భద్రతా చర్యలు లేకపోవడం వల్ల అక్కడ ప్రమాదాల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుంది. వాహనాల సాంకేతిక స్థితి కూడా ఒక ప్రధాన అంశం. సరైన నిర్వహణలేకపోవడం వల్ల బ్రేక్ ఫెయిల్యూర్, టైరు పేలడం, లైట్లు పనిచేయక పోవడం వంటి కారణాలతో జరిగే ప్రమాదాలు గణనీయంగా ఉన్నాయి. వాణిజ్య వాహనాల్లో ఓవర్ లోడింగ్ వల్ల జరిగే ప్రమాదాలు సుమారు 10శాతం వరకు ఉంటున్నట్లు అంచనాలు చెబుతున్నాయి. డ్రైవర్లకు సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల నిద్రలేమి, అలసట కారణంగా జరిగే ప్రమాదాలు ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ అసమతుల్యతే ప్రమాదాల పెరుగుదలకు దారితీస్తోంది. ప్రమాదాల తర్వాత పరిస్థితులు మరింత బాధాకరంగా ఉంటాయి. గణాంకాల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారిలో సుమారు 30శాతం మంది సరైన సమయంలో వైద్యం అందకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారు. 'గోల్డెన్ అవర్'లో చికిత్స అందితే ప్రాణాలు దక్కే అవకాశమున్న అనేక కేసులు ఆలస్యాల వల్ల మృత్యువాత పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ట్రామా కేర్ కేంద్రాల కొరత, అంబులెన్స్ సేవల ఆలస్యం ఈ పరిస్థితిని మరింత తీవ్రం చేస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలవల్ల దేశానికి జరిగే ఆర్థికనష్టం కూడా అపారమే. నిపుణుల అంచనాల ప్రకారం రోడ్డు ప్రమాదాల వల్ల దేశ జిడిపిలో సుమారు 3నుంచి 4శాతం వరకు నష్టం జరుగుతోంది. ఇది లక్షలకోట్ల రూపాయల విలువైన నష్టం. వైద్య ఖర్చులు, పనిదినాల నష్టం, కుటుంబాలపై పడే ఆర్థికభారం, సామాజిక భద్రతా వ్యవస్థలపై ఒత్తిడి కలిపి దేశ అభివృద్ధిని వెనక్కి లాగుతున్నాయి. ఈపరిస్థితిని మార్చాలంటేప్రభుత్వ, సామాజిక, వ్యక్తిగత స్థాయిల్లో సమగ్ర చర్యలు అవసరం. రహదారుల నిర్మాణంలో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం, బ్లాక్ స్పాట్లను శాస్త్రీయంగా సరిచేయడం, ట్రాఫిక్‌నియమాల అమలును కఠినంగా చేయడం అత్యవసరం. డ్రైవింగ్ లైసెన్సుల జారీప్రక్రియను కఠినతరంచేసి నిజమైన శిక్షణ పొందిన వారికే అనుమతులు ఇవ్వాలి. సమాజ స్థాయిలో రోడ్డు భద్రత ఒక ఉద్యమంలా మారాలి. పాఠశాల స్థాయి నుంచే ట్రాఫిక్ అవగాహనను పాఠ్యాంశంగా చేర్చాలి. ప్రమాదాల సమయంలో సహాయం చేసే వారికి చట్టపరమైన రక్షణ కల్పించాలన్న అవగాహనను విస్తరించాలి. ●

## ప్రజావాక్కు



### మానవత్వాన్ని చూపుదాం

గూడు లేని అభాగ్యులు ఫుట్‌పాత్‌లపై ఆకలి, చలి, నిరాశలతో ప్రతిరోజూ పోరాడుతూ జీవితాన్ని గడుపుతున్నారు. వారికి అన్నం పెట్టేందుకు కొందరు దాతలు ముందుకు వచ్చిమానవత్వాన్ని చాటుతున్నా, అది సరిపోవడంలేదు. సమాజంలోనిప్రతిఒక్కరం మనవంతుబాధ్యతను గుర్తించి చిన్న సహాయమైనా చేయూతనివ్వాలి. ఒక్కపూట అన్నం, ఒక మాట ధైర్యం, కొంచెం సానుభూతి కూడా వారి జీవితాల్లో ఆశనునింపగలదు. మనకు మిగిలిపోయే ఆహారాన్ని వృథా చేయకుండా అవసరమైన వారికి పంచితే, వారి కళ్లలో చిరునవ్వు వెలుగుతుంది. మనందరం కలిసిముందుకు వస్తే, గూడు లేని వారి బాధను కొంతైనా తగ్గించి, మానవత్వంతో నిండిన సమాజాన్ని నిర్మించగలుగుతాం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

**తెలుగు** రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రయాణికుల రక్షణకై చొరవ తీసుకుని ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను నిరంతరము పర్యవేక్షిస్తూ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న వాహనాలపై చర్యలుతీసుకుని ఫిట్నెస్ లేనివాహనాలు రోడ్లపైకి రాకుండా చూడాలి. ఈమధ్యరోడ్డుప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి. ప్రభుత్వాలు రోడ్డుప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తమైఎప్పటికప్పుడు తనిఖీలు చేపటాలి. ట్రాఫిక్ నియమ నిబంధనలను అతిక్రమిస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యలను కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వాలు సురక్షిత రవాణాకై రోడ్ల మరమ్మత్తులు చేపడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి.

- కె.నాగరాజు, నల్గొండజిల్లా

### టీచింగ్ సిబ్బంది అవసరం

**తెలంగాణ** రాష్ట్రంలోఉన్న కరీంనగర్‌జిల్లాలో ఉన్న ఎస్సీ సైనిక్‌స్కూల్, వరంగల్ జిల్లాలోఉన్న ఎస్టిసైనిక్ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎక్కువ సిబ్బంది ఉండాలి. అన్ని టీచింగ్ సబ్జెక్టులతోపాటుగా జనరల్ నాలెడ్జి, కరెంట్‌అఫైర్స్, పోటీ పరీక్షలుఆర్థిక సామాజిక విషయాలపై అవగాహనకల్పించడానికి మిగులుటీచింగ్ సిబ్బందిని ఉపయోగించాలి. క్రీడలకు ఫిజికల్ డైరెక్టర్, టీచింగ్ కోసం తప్పనిసరిగా టీచింగ్ సిబ్బంది ఉండే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-రాపాక రవీందర్, జనగాం

### స్టార్టప్ వ్యవస్థకు కొత్త దిశ

ప్రభుత్వ ప్రధాన పారిశ్రామికోత్పత్తి ప్రోత్సాహక కార్యక్రమం పదేళ్ల మైలురాయిని చేరుకున్న ఈసమయంలో, భారతదేశంలోని నూతన వ్యాపార వ్యవస్థను తిరిగి పరిశీలించాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. 2016లో కొన్ని వందల నూతన సంస్థలతో మొదలైన ఈ ప్రయాణం, నేడు లక్షల సంఖ్యలో నూతన వ్యాపార యత్నాలకు విస్తరించింది. ఈవ్యవస్థ కోట్లాది ఉపాధి అవకాశాలను సృష్టించి, ప్రపంచంలో అగ్రగణ్య స్థానాన్ని సంపాదించింది. ఇది గర్వకారణమే అయినా, ఈ విజయంతోనే తృప్తిపడి నిలిచిపోవడం భవిష్యత్తుకు హానికరమవుతుంది. ఇప్పటివరకుభారత నూతనవ్యాపారాలఎదుగుదలప్రధానంగా ప్రజల దైనందినఅవసరాలకు సంబంధించినసేవలపైనే ఆధారపడింది.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఉపాధి హామీ స్ఫూర్తి పోకూడదు

**సామ్రాజ్యవాద** విధానం అవలంబించే నేటి ప్రపంచంలో చుక్కానిలా తీసుకొచ్చిన ఉపాధి హామీ స్ఫూర్తి పోకూడదు అంటే తెలంగాణ లాంటి రాష్ట్రాలు డ్యూరబుల్ అస్సెస్ట్స్ మీద దృష్టి పెట్టాలి. పండ్ల తోటలు మీద దృష్టిపెట్టాలి. తెలంగాణలో పండ్ల తోటల వృద్ధి, కూరగాయాల తోటలు అభివృద్ధి చేయాలి. అప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యంఅవుతుంది. ఏలక్ష్యం తొని అయితే ఉపాధిహామీ ప్రవేశ పెట్టబడిందో ఆ లక్ష్యంచేరాలి. ఇప్పుడు రాష్ట్రాలు చేయాల్సింది ఏమిటి సంక్షేమం పేరుతో అప్పు లు తెచ్చి పప్పు బెల్లంలాగా పంచకుండా 40 శాతం నిధులు కేటాయించి పలవంతం అయినఉపాధి హామీ తెలంగాణలో సాధ్యం అని చూపాలి. ఇలా చేయడం వల్ల రైతులు లేదా కూలీల జీవన ప్రమాణ స్థాయిలు పెంచవచ్చు.

-భారత అవినాష్, జనగామ

### పెరుగుతున్న వాయు కాలుష్యం

**దేశంలో** మహా నగరాలు వాయు కాలుష్య కోరల్లో చిక్కుకుని ఉన్నాయి. దేశరాజధాని అందులో ప్రధానంగా ఉంది. పౌరులు తమ సొంత జీవన ప్రదేశాలను విడిచి వెళ్లలేరు. నివారణ చర్యలు కాగితాలమీదే ఉన్నంత కాలం వ్యక్తుల బాధ్యత ,ఇంగితం ఉండదు. ప్రకృతి రక్షణ, అవసరాల నియంత్రణ మరచిపోతే తెలియకుండానే హానికర వాయువులు ప్రవేశించి వింత వ్యాధులు ప్రబలి, వైద్యానికి నోచుకొని దుస్తితి వస్తుంది. ఇది ఏ రీతిలో మనిషికి గొప్పతనం. అభివృద్ధి చేసే దిశలో ఏ రంగమైన దాని ప్రతికూలతలు సమాంతరంగా చూడాల్సిందే.

-బి. మేఘనాదం, విశాఖపట్నం


మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ‘శాంతి’పై చర్చిద్దాం.. రండి!



## మాస్కోకు రావలసిందిగా జెలెన్స్కీకి రష్యా ఆహ్వానం
## మీరే కీవ్‌కు రావాలని పుతిన్‌ను కోరిన ఉక్రెయిన్ అధ్యక్షుడు
## రెండు రోజులు కాల్పుల విరమణ

**కీవ్/ మాస్కో, జనవరి 30:** రష్యా- ఉక్రెయిన్ శాంతి చర్చల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య దాదాపు నాలుగు సంవత్సరాల నుంచి కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించడానికి అమెరికా ప్రయత్నాలు ముమ్మరం కావడంతో శాంతి చర్చల కోసం మాస్కోకు రావాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెల్‌న్‌స్కీను రష్యా ఆహ్వానించింది. జెలెన్‌స్కీకు తగిన భద్రత కల్పిస్తామని, అందుకు తాము పూర్తి బాధ్యత తీసుకుంటామని మాస్కో స్పష్టం చేసింది. ఈ విషయాన్ని రష్యా అధ్యక్ష భవనం క్రిమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ వెల్లడించారు. ఇటీవల అమెరికా, రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య తొలి త్రైపాక్షిక సమావేశం జరిగిన నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడ్ని రష్యా ఆహ్వానించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక జెలెన్ స్కీ భద్రతపై తాము హామీ ఇస్తున్నట్లు రష్యా స్పష్టం చేసింది. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలు జరిపేందుకు రష్యా ఆసక్తిగా ఉన్నట్లు స్పష్టం చేసింది. ఇదే విషయంపై పుతిన్ సన్నిహితుడు యూరీ ఉషాకోవ్ మాట్లాడుతూ జెలెన్ స్కీను రష్యా ఆహ్వానించిందని.. ఒకవేళ అతడు సమావేశానికి సిద్ధమైతేనే అని స్పష్టం చేశారు. ఇంధన, మౌలిక సదుపాయాలపై ఒకరిపై ఒకరు దాడులు చేయడం తక్షణమే ఆపేయాలని ఇరు దేశాలు అంగీకరించాయనే వదంతులపై వ్యాఖ్యానిం చడానికి నిరాకరించిన కొన్ని గంటల తర్వాత క్రెమ్లిన్, జెలెన్‌స్కీని ఆహ్వానిస్తూ ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ స్పందిస్తూ, శాంతి చర్చల కోసం కీవ్‌కు రావా లంటూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఆహ్వానించారు. మాస్కో దాడులు ఆపితే, ఉక్రెయిన్ తన దాడులను ఆపుతుందని జెలెన్‌స్కీ పునరుద్ఘాటించారు. ఇదిలా ఉండగా, అమెరికా మధ్యవర్తిత్వంతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు సమావేశానికి సిద్ధంగా ఉన్నారని పేరు వెల్లడించడానికి నిరాకరించిన ఓ అమెరికా అధికారి తెలిపారు. రష్యా, ఉక్రెయిన్ శాంతి ప్రతినిధుల మధ్య అబుదాబిలో ఆదివారం మరోసారి దఫా చర్చలు జరగనున్నాయి. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. శీతాకాలం నేపథ్యంలో దాడులు ఆపాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ట్రంప్ కోరగా.

సానుకూలంగా స్పందించినట్లు అమెరికా అధ్యక్ష కార్యాలయం పేర్కొంది. అటు జెలెన్‌స్కీ దీనిపై స్పందిస్తూ, ట్రంప్ విజ్ఞప్తి మేరకు ఫిబ్రవరి 1వరకు రష్యాపై తామెలాంటి దాడులు చేయమని స్పష్టం చేశారు.



# అజిత్ శాఖలు ఎన్సీపీ వర్గానికే కేటాయించాలి

## సిఎం ఫడ్నవిస్‌ను కలిసిన అజిత్ వర్గం నేతలు

**ముంబయి,జనవరి 30:** దివంగత నేత అజిత్‌పవార్‌నిర్వహించిన ప్రభుత్వశాఖలన్నీ ఎన్సీపీ పరిధిలోనే ఉండాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) నాయకులు కలిసి విజ్ఞప్తిచేసారు. విమాన ప్రమాదంలో మరణించిన డిప్యూటీ సీఎం అజిత్ పవార్ పోర్ట్‌ఫోలియోలపై చర్చించారు. ఆయన నిర్వహించిన మంత్రి పదవులపై తమ పార్టీకే హక్కు ఉన్నదని తెలిపారు. ఎన్సీపీ సీనియర్ నేతలు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే, ఛగన్ భుజ్‌బల్ కలిసి సీఎం ఫడ్నవీస్ అధికార నివాసానికి వెళ్లారు. అజిత్ పవార్ నిర్వహించిన కీలకమైన ఆర్థిక, రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా శాఖలతో సహా అన్ని మంత్రిత్వ శాఖలు ఎన్సీపీ కోటాలోనే కొనసాగాలని కోరారు. ఈ మేరకు ఒక లేఖను సమర్పించారు. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశం తర్వాత ఎన్సీపీ కీలక నేత ప్రఫుల్ పటేల్ మీడియాతో మాట్లాడారు. మహాయుతి కూటమి ప్రభుత్వంలో తాము భాగస్వాములని తెలిపారు. అజిత్ పవార్ నిర్వహించిన పదవులను వీలైనంత త్వరగా భర్తీ చేయడానికి సరైన నిర్ణయం తీసుకోవాలని ఫడ్నవీస్‌ను కోరినట్లు చెప్పారు. మరోవైపు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు పార్టీతోపాటు ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నదని ప్రఫుల్ పటేల్ తెలిపారు. దుఃఖం నుంచి కోలుకోవడానికి అజిత్ పవార్ కుటుంబానికి కొంత సమయం ఇవ్వాలి. మేం త్వరలోనే సునేత్ర పవార్, ఇతర కుటుంబ సభ్యులతో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామని అన్నారు.



# అతడి భార్య అందంగా ఉందని పదవి!

## యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ విచిత్ర వ్యాఖ్యలు

**వాషింగ్టన్, జనవరి 30:** అమెరికా ఇంటీరియర్ సెక్రటరీగా డగ్ బర్గమ్‌ను అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియమించారు. ఈ నియామకంపై ట్రంప్ స్పందిస్తూ విచిత్ర వ్యాఖ్యలు చేశారు. బర్గమ్ భార్య చాలా అందంగా ఉందని, అందుకే ఆయనకు పదవి ఇచ్చినట్లు వెల్లడించారు. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో బర్గమ్, ఆయన సతీమణి అక్కడే ఉండటం గమనార్హం. మాదకద్రవ్యాల కట్టడి లక్ష్యంగా ఓ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై ట్రంప్ గురువారం సంతకం చేశారు. అనంతరం ఓవల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అధ్యక్షుడు మాట్లాడుతూ.. ‘బర్గమ్, అతని భార్య క్యాథరిన్ గుర్రపు స్వారీ చేస్తున్న విడియో చూశా. అందులో ఆమె చాలా ఆకర్షణీయంగా కనిపించారు. ఆమె ఎవరని నా సిబ్బందిని అడిగా. ఈ జంట గురించి వారు వివరించగానే నాకో అభిప్రాయం ఏర్పడింది. ప్రధానంగా ఆ కారణంగానే డగ్‌కు పదవి ఇచ్చా. డగ్ బర్గమ్ విజయవంతమైన బిజినెస్ మ్యాన్. నార్త్ డకోటాకు రెండుసార్లు గవర్నర్‌గా పనిచేశారు. అయితే, బర్గమ్ విజయం వెనక ఆయన భార్య పాత్ర కీలకంగానే ఉండి ఉంటుంది. అద్భుతమైన జంట’ అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే, ఈ వ్యాఖ్యలు వైరల్ కావడంతో ట్రంప్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. మహిళలను కించపరిచేలా ఆయన మాటలు ఉన్నాయంటూ పలువురు విమర్శించారు.

# ఐఓఎ అధ్యక్షురాలు పిటి ఉష భర్త హఠాన్మరణం



**కోజికోడ్, జనవరి 30:** భారత క్రీడా దిగ్గజం, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పి.టి. ఉష కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె భర్త 64 ఏళ్ల వెంగలిల్ శ్రీనివాసన్ శుక్రవారం తెల్లవారుజామున కేరళలోని కోజికోడ్‌లో కన్నుమూశారు. ఈ ఘటన జరిగిన సమయంలో ఉష ఇంట్లో లేరు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనడం కోసం ఆమె ఇంటికి దూరంగా ఉన్నారు. పి.టి. ఉష సాధించిన ప్రతి విజయం వెనుక ఉండి ఆమెను ముందుకు నడిపించిన ఆయన ఇక లేరన్న వార్త క్రీడాలోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ముందురోజు అర్ధరాత్రి దాటిన తర్వాత శ్రీనివాసన్ కోజికోడ్ జిల్లాలోని థిక్కోడి పెరుమాళ్‌పురంలో ఉన్న తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ఆయన్ను పెరుమాళ్‌పురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయిన శ్రీనివాసన్ పదవీ విరమణ చేసిన తర్వాత పూర్తిగా ఉష క్రీడా అకాడమీ, ఆమె బాధ్యతల నిర్వహణలో తోడుగా ఉంటూ వచ్చారు. ఎప్పుడూ ఆమె వెన్నంటే ఉంటూ భార్యకు అన్ని విధాలుగా అండగా నిలిచారు. కేరళలోని పెన్నని సమీపంలో కుట్టిక్కడ్‌కు చెందిన నారాయణన్, సరోజినీ దంపతులు శ్రీనివాసన్ తల్లిదండ్రులు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌లో డిప్యూటీ ఎస్పీ హోదాలో ఆయన రిటైర్ అయ్యారు. తన దూరపు బంధువైన పీటీ ఉషను1991లో శ్రీనివాసన్ వివాహం చేసుకున్నారు. వారికి డాక్టర్ ఉజ్వల్ విగ్నేష్ అనే కుమారుడు ఉన్నారు. ఉష అంతర్జాతీయ స్థాయిలో పయ్యోలి ఎక్స్‌ప్రెస్ గా గుర్తింపు పొందడంలో శ్రీనివాసన్ పాత్ర వెలకట్టలేనిది. వారు వివాహం చేసుకున్న నాటి నుంచి ఆమె క్రీడా జీవితంలోనే కాకుండా తదనంతరం ఆమె రాజకీయ ప్రస్థానంలోనూ శ్రీనివాసన్ వెన్నంటే నిలిచారు. ఉష సాధించిన ప్రతీ మైలురాయి వెనుక ఆయన ప్రోత్సాహం ఉండేదని సన్నిహితులు చెబుతుంటారు. ప్రధాని నరేంద్ర మోడీ సైతం పిటి ఉషతో మాట్లాడారు. శ్రీనివాసన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు మోడీ తెలిపారు.

# అజిత్‌పవార్ మరణంపై సిఐడి దర్యాప్తు షురూ



**ముంబయి,జనవరి 30:** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణానికి కారణమైన బారామతి విమాన ప్రమాదంపై రాష్ట్ర నేర దర్యాప్తు విభాగం (సీఐడీ) విచారణను ప్రారంభించింది. ఈ ఘోర ప్రమాదం ఎలా జరిగింది అనే విషయాన్ని నిగ్గు తేల్చనుంది. పుణె రూరల్ పోలీసుల పరిధిలో నమోదైన ఈ కేసును తక్షణమే సీఐడీకి బదిలీ చేశారు. ఈ కేసులో సీఐడీ ఎంట్రీ ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. సీఐడీ ప్రధానంగా విద్రోహచర్యలున్నాయా అన్న కోణంలో దర్యాప్తు చేయనుంది. అంటే విమానం ముంబయి నుంచి బయలుదేరడానికి ముందే, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా విమానంలో సాంకేతిక లోపాలు సృష్టించారా అనే కోణంలో లోతైన విచారణ జరుపుతున్నారు. బారామతిలో జరిగిన ఈ ఘటనపై తొలుత పుణె రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 194 కింద దీనిని ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా నమోదు చేశారు. ఇప్పుడు ఆ ఎఫ్ఐఆర్ సంబంధిత పత్రాలన్నింటినీ సీఐడీకి అప్పగిస్తున్నారు. సీఐడీ బృందం పుణె రూరల్ పోలీసుల నుంచి డాక్యుమెంట్లను సేకరిస్తోంది. విచారణలో భాగంగా సీఐడీ అధికారులు బారామతిలోని ప్రమాద స్థలాన్ని సందర్శించనున్నారు. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కూడా తన విచారణను ప్రారంభించింది. కాగా అజిత్ పవార్ మరణించిన వెంటనే ఎన్సీపీ పగ్గాలు ఎవరికి ఇవ్వాలనే చర్చ జరగడం బాధాకరమని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. ఇది అమానవీయ చర్య అని ఆయన మండిపడ్డారు. పుణె జిల్లా బారామతిలో బుధవారం జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన మరణించిన మరుసటి రోజే పార్టీలో వారసత్వ చర్చలు మొదలయ్యాయని వార్తలు వచ్చాయి. అజిత్ భార్య సునేత్ర పవార్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కొందరు డిమాండ్ చేస్తున్నారని, ఆమెకే పార్టీ బాధ్యతలు అప్పగించాలని మరికొందరు నాయకులు చెప్పినట్లు ప్రచారం జరిగింది. దీనిపై సంజయ్ రౌత్ శుక్రవారం స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో రాజకీయ పదవుల గురించి మాట్లాడే వారికి మానవత్వం లేదు. సునేత్ర పవార్ తన భర్తను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్నారు. ఆమె కన్నీరు ఇంకా ఆరలేదు. మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా ఈ సమయంలో సంయమనం పాటించాలని రౌత్ హితవు పలికారు. సునేత్ర పవార్ ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆమె బారామతి నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

# విలీనం దిశగా మహారాష్ట్ర ఎన్సీపీ

## నేడు ఎన్సీపీ శాసనసభా పక్ష సమావేశం



**ముంబయి, జనవరి 30:** మహారాష్ట్ర రాజకీయాల్లో ఎన్సీపీ చీలికవర్గంనేత అజిత్‌పవార్ మరణంతో ఆపార్టీలో నెలకొన్న శూన్యతను భర్తీచేసేందుకు పార్టీ కసరత్తుల ప్రారంభించింది. ఈ నేపథ్యంలో శనివారం ఎన్సీపీ శాసనసభా పక్ష సమావేశం జరుపుతోంది. అక్కడే శాసనసభ పక్ష నేతను ఎన్నుకోనున్నారు. అజిత్ పవార్ కుమారులు అంత ఆసక్తిగా లేకపోవడంతో ఆయన భార్య సునేత్రా పవార్‌నే నాయకురాలిగా ఎంచుకోవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. అజిత్ పవార్ నిర్వహించిన పోస్టులన్నీ ఎన్సీపీ తన ఖాతాలో వేసుకోవాలని భావిస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ సీనియర్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో చర్చలు జరిపారు. అజిత్ పవార్ డిప్యూటీ సీఎంతో పాటు ఆర్థిక శాఖ, మరిన్ని శాఖలు నిర్వహించారు. ఆ శాఖలన్నీ ఎన్సీపీ నిలబెట్టుకోవాలని భావిస్తోంది. ఇదిలా ఉంటే ఎన్సీపీ తిరిగి విలీనం అయి ఒకే పార్టీకావాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి సెకండ్ వీక్‌లో ఒక ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు వర్గాలు చెబుతున్నాయి. ఇక ఎన్సీపీ ఒక్కటి చేసేందుకు రెండు వర్గాల నాయకులు వచ్చే వారం సమావేశం కానున్నట్లు వర్గాలు తెలిపాయి. నాయకత్వం వహించేందుకు ముగ్గురు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. అజిత్ పవార్ భార్య సునేత్ర, సుప్రియ సూలే, ప్రఫుల్ పటేల్‌లో ఎవరొకరు నాయకత్వం వహించే అవకాశం ఉందని సమాచారం. 1999లో కాంగ్రెస్ నుంచి విడిపోయిన తర్వాత శరద్ పవార్ ఎన్సీపీని స్థాపించారు. అనంతరం అజిత్ పవార్ జూలై 2023లో పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఆయన వర్గం అధికార మహాయుతిలో చేరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్‌బాల్, దిలీప్ వాల్సే పాటిల్ వంటి శరద్ పవార్ సన్నిహితులు కూడా అజిత్ పవార్ శిబిరంలో చేరారు.

# ఆర్బీఐ లాకర్లలో భద్రంగా నిజాం నగలు!

## పార్లమెంటులో స్పష్టంచేసిన మంత్రి గజేంద్రసింగ్ షెకావత్



**న్యూఢిల్లీ,జనవరి 30:** నిజాం నవాబులకు చెందిన అపురూప ఆభరణాలపై కేంద్ర ప్రభుత్వం విధాన ప్రకటన చేసింది. ఈ నగలన్నీ కూడా ప్రస్తుతం భారత రిజర్వుబ్యాంకు ఆధీనంలో అత్యంత భద్రంగా ఉన్నాయని, అయితే వాటిని శాశ్వత ప్రదర్శన కోసం హైదరాబాద్‌కు తరలించే విషయంపై ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. రాజ్యసభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ నిన్న రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 1995 నుంచి 173 అపురూపమైన నిజాం ఆభరణాలు ఆర్‌బీఐ లాకర్లలో ఉన్నాయన్న విషయం ప్రభుత్వానికి తెలుసా అని అడగగా, మంత్రి అవును అని బదులిచ్చారు. ఈ నగల చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని ప్రభుత్వం గుర్తిస్తుందా అని, వాటిని సొంత గడ్డ అయిన హైదరాబాద్‌లో ప్రదర్శించాలన్న ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటుందా అని కూడా ప్రశ్నించారు. దీనికి మంత్రి బదులిస్తూ, నిజాం నగల చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను, వాటితో ముడిపడి ఉన్న ప్రజా ప్రయోజనాలను తమ మంత్రిత్వ శాఖ గుర్తిస్తుందని తెలిపారు. అయితే, ఆర్‌బీఐతో ఉన్న ఒప్పందం ప్రకారం వివరించారు.



# రాహుల్‌గాంధీపై శశిథరూర్ పొగడ్తల వర్షం

## పార్టీ మారుతున్నట్లు వచ్చిందంతా ఊహాగానాలే..

**న్యూఢిల్లీ,జనవరి 30:** తాను పార్టీ మారుతున్నానని వస్తున్న ఊహాగానాలకు కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ చెక్ పెట్టారు. తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని, ఎక్కడికీ వెళ్లబోనని స్పష్టం చేశారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలను కలిసిన మరుసటి రోజే థరూర్ చేసిన ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. శశిథరూర్ కొన్ని నెలలుగా ఆర్ఎస్ఎస్, బీజేపీ, ప్రధాని మోడీపై సానుకూలంగా మాట్లాడుతూ వస్తున్నారు. సడెన్‌గా ఆయన ప్రవర్తన మారడంతో కాంగ్రెస్ పార్టీని వీడతారనే ఊహాగానాలు వచ్చాయి. ఎన్నో నెలలుగా ఈ ఊహాగానాలు వ్యక్తమవుతున్నప్పటికీ వీటిపై స్పందించలేదు. తాజాగా ఖర్గే, రాహుల్ గాంధీతో భేటీ అనంతరం స్పందించారు. ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన థరూర్ రాబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెలుపుకోసం తాను ముందుండి పనిచేస్తానని చెప్పారు. కేరళ ప్రచారంలో చురుకుగా పాల్గొంటానని, కాంగ్రెస్‌కు బలంగా నిలుస్తానని తెలిపారు. తనపై వస్తున్న పార్టీ మార్పు వార్తలకు ఎలాంటి ఆధారం లేదని తేల్చిచెప్పారు.

# చనిపో.. వెళ్లిపో.. వంటి పదాలు ఆత్మహత్యకు పురిగొల్పడం కిందకు రావు..

## కేరళ హైకోర్టు సంచలన తీర్పు

**తిరువనంతపురం, జనవరి 30:** భార్యాభర్తల వివాదాల్లో కోపంతో వెళ్లిపో, పోతేపో, చనిపో వంటి పదాలు వాడితే ఆత్మహత్యకు ప్రేరేపించినవిగా పరిగణించలేమని కేరళ హైకోర్టు ఒక కుటుంబ వివాదంలో తీర్పు వెలువరించింది. భార్యాభర్తలు కోపంగా వెళ్లిపో, చనిపోవంటి పదాలను ఉపయోగించడం ఆత్మహత్యకు ప్రేరేపించబడదని పేర్కొంది. భారత శిక్షాస్మృతి ఐపిసి సెక్షన్ 306 ప్రకారం నేరాన్ని నిర్ధారించాలంటే, నిందితుడు ఆత్మహత్యకు ప్రేరేపించాలనే ఉద్దేశ్యాన్ని కలిగి ఉన్నాడని నిరూపించాల్సిన అవసరం ఉందని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు ఒక మహిళ, ఆమె చిన్న కుమార్తెకు సంబంధించినది. భర్త తిట్టడంతో ఆమె ఆత్మహత్య చేసుకుందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రాసిక్యూషన్ ప్రకారం, ఆ మహిళ భర్త మరో వివాహిత మహిళతో అక్రమ సంబంధం కలిగి ఉన్నాడు. ఈ విషయం మృతురాలు తెలుసుకున్నప్పుడు, ఆమె అతన్ని ప్రశ్నించింది, దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అక్రమ సంబంధంపై దంపతుల మధ్య గొడవ జరిగిన తరువాత, భర్త ఆ మహిళతో నువ్వు వెళ్ళి చావుపో అని చెప్పాడని, ఆ తర్వాత ఆ మహిళ తన ఐదున్నర ఏళ్ల కుమార్తెతో కలిసి సెప్టెంబర్ 15, 2023న బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. దీని తరువాత, కాసర్గోడ్‌లోని మెల్పరంబా పోలీస్ స్టేషన్ ఆ మహిళ భర్తపై కేసు నమోదు చేసింది. కాసర్గోడ్ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు అధుర్ నిర్దోషి అభ్యర్థనను తిరస్కరించి, అతనిపై అభియోగాలు మోపాలని నిర్ణయించింది. ఆ తర్వాత ఆ మహిళ భర్త హైకోర్టును ఆశ్రయించి, ఆ మాటలు కోపంతో పలికానని, తన భార్యను ఆత్మహత్యకు రెచ్చగొట్టడానికి ఉద్దేశించినవి కాదని కోర్టుకు తెలిపాడు. దీనిపై తీర్పు ఇస్తూ, హైకోర్టు సుప్రీం కోర్టు నిర్ణయాన్ని ఉదహరించింది, దీనిలో గొడవ సమయంలో కోపంతో మాట్లాడే సాధారణ లేదా అజాగ్రత్త పదాలు ఆత్మహత్యను ప్రేరేపించే ఉద్దేశ్యంగా పరిగణించ బడవని పేర్కొంది. ఈ కేసులో,వెళ్లిపోయి చని పో అనే పదాలు వాగ్వాదం జరుగుతున్న సమ యంలో తీవ్రమైన సమయంలో పలికారని, మృతురాలి ఆత్మహత్యకు ప్రేరేపించే ఉద్దేశ్యం లేకుండానే ఈ వ్యాఖ్యలు చేశారని హైకోర్టు పేర్కొంది.

# సంక్షిప్తంగా..

## సైబర్ నేరాల నిరోధంలో ‘సంచార్ సాథీ’ కి విశేష ఆదరణ



**న్యూఢిల్లీ, జనవరి 30:** సైబర్ నేరాలు, చోరీలను అరికట్టడానికి తీసుకొచ్చిన ‘సంచార్ సాథీ’ యాప్‌కు వినియోగదారుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని కేంద్రం వెల్లడించింది. ఇప్పటివరకు 2 కోట్లకు పైగా మంది సంచార్ సాథీని డౌన్‌లోడ్ చేసుకున్నట్లు కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఈ యాప్‌సాయంతో చట్టవ్యతిరేక, అనుమానాస్పద కార్యకలాపాలతో సంబంధం ఉన్న 1.52 కోట్ల మొబైల్ నంబర్లను బ్లాక్ చేశామన్నారు. మోసపూరిత సిమ్‌లతో ముడిపడి ఉన్న 27 లక్షల వాట్సప్ ఖాతాలతో పాటు ఇతర డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌లను కూడా బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. సైబర్ మోసాలను ఎదుర్కొనే బలమైన ఆయుధంగా సంచార్ సాథీ పనిచేస్తోందన్నారు.

## శబరిమల కేసు: నటుడు జయరామ్ విచారణ



**తిరువనంతపురం, జనవరి 30:** శబరిమల ఆలయంలో బంగారం తాపడాల అదృశ్యం కేసులో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కుంభకోణానికి సంబంధించి ప్రముఖ నటుడు జయరామ్‌ను సిట్ విచారించినట్లు తెలుస్తోంది. చెన్నైలోని ఆయన నివాసంలో ఈ విచారణ జరిగినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ కేసులో ఉన్నికృష్ణన్ పొట్టి ప్రధాన నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. బంగారం పూత కోసం ఆలయం నుంచి తీసుకొచ్చిన తాపడాలతో 2019లో చెన్నైలో ఉన్నికృష్ణన్ నిర్వహించిన పూజల్లో జయరామ్ పాల్గొన్న వీడియోలు ఇటీవలే బయటికి వచ్చాయి. ఇందుకు సంబంధించి సిట్ ఆరా తీసినట్లు సమాచారం. ఉన్నికృష్ణన్‌తో కలిసి ఎన్నిసార్లు పూజల్లో పాల్గొన్నారని సిట్ బృందం నటుడిని ప్రశ్నించిందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

## ‘నిఫా’తో ప్రమాదం లేదు: ప్రపంచ ఆరోగ్య సంస్థ




**జెనివా, జనవరి 30:** భారత్‌లోని పశ్చిమబెంగాల్‌లో ఇటీవల ఇద్దరికి నిఫా వైరస్ సోకరడంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం వైరస్ వ్యాప్తి కట్టడికి చర్యలు తీసుకుంటోంది. అయితే ఈ వైరస్ వ్యాప్తిపై భయంతో చైనా, థాయ్‌లాండ్, నేపాల్, మలేసియా, తైవాన్ వంటి దేశాలు తమ దేశంలోకి వచ్చే భారతీయులకు ‘నిఫా’ స్క్రీనింగ్ టెస్టులు ప్రారంభించాయి. దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పందిస్తూ.. భారత్‌లో నిఫా ప్రభావం తక్కువగానే ఉందని.. దానితో ప్రమాదమేమీ లేదని ప్రపంచ దేశాలకు తెలిపింది. వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి భారత్ వేగవంతమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొంది. ఈ వైరస్ వల్ల భారత్‌పై ప్రయాణ, వాణిజ్య పరిమితులు విధించాల్సిన అవసరం లేదని డబ్ల్యుహెచ్ఓ ప్రపంచ దేశాలకు సూచించింది. ఈ నిఫా వైరస్ ఒకరి నుంచి ఒకరికి వేగంగా వ్యాపిస్తున్నట్లు ఆధారాలు ఏమీ లేవని.. దీని వల్ల ప్రపంచ దేశాలకు ప్రమాదం తక్కువేనని తెలిపింది.

## ఇండిగో విమానానికి బాంబు బెదరింపు




**అహ్మదాబాద్,జనవరి 30:** కువైట్ నుంచి ఢిల్లీ కి బయలుదేరిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింఎ సందేశం రావడం కలకలం సృష్టించింది. దాంతో విమానాన్ని అహ్మదాబాద్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు.కువైట్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఇండిగో విమానం గాల్లో ఉండగానే టాయిలెట్‌లోని ఓ టిష్యూ పేపర్‌పై బాంబు బెదిరింపు సందేశం కనిపించింది. విమానంలో బాంబు పెట్టినట్లుగా ఆ టిష్యూ పేపర్‌లో రాసి ఉన్న బెదిరింపు సందేశాన్ని ఓ ప్రయాణికుడు గుర్తించి, సిబ్బందిని అప్రమత్తం చేశాడు. వెంటనే స్పందించిన పైలట్లు అహ్మదాబాద్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కి సమాచారం అందించి అత్యవసర ల్యాండింగ్ కోసం అభ్యర్థించారు. దాంతో విమానాశ్రయ అధికారులు ఫైర్ టెండర్లు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాన్ని సురక్షితంగా దించారు.

## అటవీ, దేవాదాయ పోస్టుల హాల్ టిక్కెట్లు ఫిబ్రవరి 2 నుంచి

విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: అటవీ, దేవాదాయ శాఖల్లో భర్తీ చేసేందుకు నిర్వహించనున్న పరీక్ష హాల్‌టిక్కెట్లను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపిపిఎస్‌సి) తన వెబ్‌సైట్‌లో పొందుపరచనునట్లు వెల్లడించింది. అటవీశాఖలో బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, తనేదర్, సెక్షన్ ఆఫీసర్ పోస్టులు, దేవదాయ శాఖలోని గ్రేడ్2 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఫిబ్రవరి 2 నుంచి ఏపి.జీవోటి.ఐఎన్ (ఆంగ్లంలో) వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని కమిషన్ కార్యదర్శి రవి పటాన్ సుభాస్‌శెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 9 నుంచి 13 వరకు ఈ పరీక్షలు నిర్వహించనునట్లు వెల్లడించారు.

## నిరుద్యోగ యువతకు 2 నుంచి ఉచిత నైపుణ్య శిక్షణ

విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో సీడ్ ఎపి ( సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ప్రైజ్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్) ద్వారా నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణను ఫిబ్రవరి 2 నుంచి ప్రారంభించనున్నట్లు శిక్షణా కేంద్రం ఇంచార్జి చింకా నారాయణ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. డీడీయూ జీకేవై కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల వయసు కలిగి ఉండాలన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, బీటెక్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. వీరికి 4 నెలల పాటు కంప్యూటర్,స్పోకెన్ ఇంగ్లీష్, ఎలెక్ట్రానిక్ తదితర విభాగాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు నారాయణ పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ప్రభుత్వం చేత సర్టిఫికెట్ అందించడంతో పాటు ప్రైవేటు కంపెనీలలో రూ 14 నుంచి రూ 20000 జీత భత్యం కలిగిన ఉద్యోగాలు ఇప్పించనున్నట్లు తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజనం, యూనిఫాం, కోర్సు మెటీరియల్ ఇస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 2న నేరుగా విజయవాడ సమీపంలోని కానూరు నవతా ట్రాన్స్‌పోర్ట్ రోడ్డులో ఉన్న సీడ్ ఏపీ శిక్షణా కేంద్రానికి చేరుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9581148566 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఇంచార్జి నారాయణ పేర్కొన్నారు.

## రేపు వివేకానంద మానవ వికాస కేంద్రం ప్రారంభం

విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ రామకృష్ణ మిషన్ మరో బృహత్ కార్యానికి శ్రీకారం చుట్టింది. విజయవాడ గాంధీనగర్‌లోని శైలజా థియేటర్ ఎదురుగా.. నూతనంగా నిర్మించిన వివేకానంద మానవ వికాస కేంద్రాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం ఉదయం 9గం.లకు నూతన భవన ప్రారంభోత్సవం జరగనుందని విజయవాడ రామకృష్ణ మిషన్ సహాయకార్యదర్శి శితికంఠ స్వామీజి వెల్లడించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, పూజ్య స్వామి వినిశ్చలానంద, స్వామి శశికాంతనంద, స్వామి హృదానంద, స్వామి శితికంఠానంద తదితరులు పాల్గొంటారని తెలిపారు.



## పంగోలియన్ స్వాధీనం

### ఆరుగురు నిందితుల అరెస్ట్

రాపూరు,(నెల్లూరు), జనవరి 30 ప్రభాతవార్త: రాపూరు మండలంలోని వెలిగొండ అడవులలో అంతరించిపోతున్న అరుదైన జంతువు పంగోళియన్(అలుగు) అక్రమ రవాణాను రాపూరు అటవీ అధికారులు డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ వారి సహకారంతో చేధించారు. ఇందుకు సంబందించిన వివరాలను శుక్రవారం రాపూరు అటవీ రేంజ్ అధికారి ఎస్.మాల్యాద్రి వివరించారు. డిఆర్ఐ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహిచిన ఆపరేషన్‌లో అంతరించి పోతున్న జాతులలో ఒకటైన అరుదైన పంగోళియన్(అలుగు), అనే జంతువు అక్రమ రవాణాను చేధించి అక్రమ రవాణాకు పాల్పడుతున్న అరుగురు వ్యక్తులను వారి వద్ద వున్న పంగోళియన్ అనే వన్యప్రాణిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. తెగచర్ల గ్రామ సమీపంలోని వెలిగొండ అడవులలో ఈ ప్రాణిని పట్టుకుని దాన్ని విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తుండగా తాము దాడులు నిర్వహించి ఆరుగురు నిందుతులు, ఒక పల్సర్ బైక్‌తో పాటు అరుదైన వన్యప్రాణి పంగోళియన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమెదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న వన్య ప్రాణితో పాటు, ముద్దాయిలను, బైక్‌ను వెంకటగిరి కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు రేంజర్ మాల్యాద్రీ తెలిపారు.

## దేవాదాయ శాఖ కమిషనర్‌ను తక్షణమే తొలగించండి

అనంతపురం, జనవరి 30 ప్రభాతవార్త బ్యూరో: రాష్ట్రంలో బ్రాహ్మణులకు, దేవాలయాలకు, దేవాలయ ఆస్తులకు రక్షణ కరువతోందని, ఇప్పుడు శ్రీశైలంలో కరివేన బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రం కాంపౌండ్ గోడ తొలగించారని ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం సమైక్య రాష్ట్ర అధ్యక్షులు జ్వాలాపురం శ్రీకాంత్ ఆరోపించారు. శ్రీశైలంలో నిత్య అన్నదాన సత్రం గోడ కూల్చడానికి కారకులైన శ్రీశైలం దేవాలయ ఏఈఓ చంద్ర శేఖర రెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డిలపై తక్షణ చర్యలు చేపట్టాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగుదేశం ప్రభుత్వంలో హిందూ దేవాలయాలకు రక్షణ లేకుండా దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ కుట్రపూరితంగా శ్రీశైలంలోని కరివెన్ బ్రాహ్మణ సత్రాన్ని అడ్డదారుల్లో కబ్జా చేసేందుకే ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందల కోట్ల భూ కుంభకోణాల్లో వివాదాల్లో కూరుకుపోయిన దేవాదాయ శాఖ కమిషనర్‌ను తక్షణం విధుల నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.



# అత్యంత శక్తివంత నగరంగా అమరావతి నిర్మాణం

- కేంద్ర ఆర్థిక సర్వేలో వెల్లడి
- నివాసయోగ్యమైన నగరాల్లో విజయవాడ, తిరుపతిలకు చోటు

విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న రాష్ట్ర రాజధాని అమరావతి అత్యంత ప్రణాళిబద్దంగా నిర్మాణం జరుగుతున్న శక్తివంతమైన నగరమని కేంద్ర ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. బహుళ ప్రయోజనాంశాలతో ఒక నగర నిర్మాణం శక్తి వంతంగా జరగడం అపూర్వ అంశంగా ఈ సర్వే పేర్కొంది. ఆర్థిక సర్వే (2025-26) రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణం ఒక అరుదైన అవకాశమని పేర్కొంది. ఇది సులభతర జీవనానికి భవిష్యత్ నగరంగా నిలుస్తుందని తెలిపింది. ఒక నగరం కిక్కిరిసిపోయాక, సేవల కొరత ఏర్పడ్డాక, అనధికార నిర్మాణాలు పెరిగాక మార్పులు, చేర్పులు చేయడం కంటే గ్రీన్‌ఫీల్డ్ నగరం ఏర్పాటు ద్వారా అక్కడి జీవన వ్యవస్థని ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా డిజైన్ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించింది.

భారీ మౌలిక సౌకర్యాలపై ఆధారపడే నగరాలకంటే విద్య, ఇతర రంగాల అనుసంధానంతో ఏర్పడే నగరాలే వేగంగా వృద్ధి చెందుతాయని స్పష్టం చేసింది. కొత్త నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుకోవచ్చని, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న అమరావతిని అందుకు ఉదాహరణగా ఆర్థిక సర్వే పేర్కొంది. ఏపీ రాజధాని నగరం అమరావతి అభివృద్ధి అన్నది జాతీయ, ప్రాంతీయ ప్రాధాన్యమున్న అంశమని తమిళనాడు ఎంపీ (ఏఐఏడీఎంకే) ఎం.తంబిదురై నేతృత్వంలోని రాజ్యసభ హామీల కమిటీ ఇటీవల వెల్లడించింది. రాజధాని అభివృద్ధి అన్నది జాతీయంగా, ప్రాంతీయంగా చాలా ప్రాధాన్యమున్న అంశంగా పేర్కొంది. ఈ క్రమంలో ఆర్థిక సర్వే అమరావతి శక్తివంతంగా ఎదుగుతుందని వివరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణం ఒక అరుదైన అవకాశమని పేర్కొంది. ఇది సులభతర జీవనానికి భవిష్యత్ నగరంగా నిలుస్తుందని తెలిపింది. ఒక నగరం కిక్కిరిసి పోయాక, సేవల కొరత ఏర్పడ్డాక, అనధికార నిర్మాణాలు పెరిగాక మార్పులు, చేర్పులు చేయడం కంటే గ్రీన్‌ఫీల్డ్ నగరం ఏర్పాటు ద్వారా అక్కడి జీవన వ్యవస్థని ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా డిజైన్ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించింది. భారీ మౌలిక సౌకర్యాలపై ఆధారపడే నగరాలకంటే విద్య, ఇతర రంగాల అనుసంధానంతో ఏర్పడే నగరాలే వేగంగా వృద్ధి చెందుతాయని స్పష్టం చేసింది. కొత్త నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుకోవచ్చని, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న అమరావతిని




అందుకు ఉదాహరణగా ఆర్థిక సర్వే పేర్కొంది.

### దేశంలోనే 10 నివాస యోగ్య నగరాల్లో తిరుపతి, విజయవాడ స్థానం

జీవన సౌలభ్య సూచీల్లో దేశంలో అగ్రస్థానంలో ఉన్న పది నగరాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, విజయవాడ నగరాలకు స్థానం దక్కింది. బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాల్లాగా తిరుపతి, విజయవాడ తీవ్రమైన జనాభా ఒత్తిడిని ఎదుర్కోవడం లేదని ఆర్థిక సర్వే వెల్లడించింది. ఇక్కడ నగరీకరణ జరుగుతోందని.. మౌలిక సౌకర్యాలు, ఉద్యోగావకాశాలు సులభంగా లభిస్తాయని వెల్లడించింది. పుణె, నవీ ముంబై, గ్రేటర్ ముంబై, చండీగఢ్. ఠాణె, రాయ్‌పూర్, ఇండోర్, భోపాల్‌లు నివాస యోగ్యమైన 10 నగరాల్లో ఉన్నాయి.

### సిమెంటు ఉత్పత్తిలో ఎపి రెండో స్థానం

పరిశ్రమలకు అవసరమైన అనుమతులను ఏపీ ప్రభుత్వం సింగిల్‌విండో విధానంలో వేగంగా అందిస్తోందని కేంద్ర ఆర్థిక సర్వే 2025-26 అభిప్రాయపడింది. పర్యావరణ అనుమతులు ఇచ్చేందుకు పట్టే సమయాన్ని బిజినెస్ రిఫార్మ్ యాక్షన్ ప్లాన్2024 (బీఆర్ఏపీ) ద్వారా తగ్గించిందని నివేదికలో ప్రస్తావించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే విధానాన్ని తీసుకొచ్చిందని ఆర్థికసర్వే నివేదికలో ప్రస్తావించింది.బీఆర్ఏపీ2024 ద్వారా సింగిల్‌విండో విధానంలో పరిశ్రమలకు క్లియరెన్స్‌లు, ఆన్‌లైన్‌లో భూమి రిజిస్ట్రేషన్, పర్యావరణ అనుమతులు ఇచ్చే విధానాన్ని ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ కన్సెంట్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్‌ను బలోపేతం చేసింది. దీనివల్ల అనుమతుల కోసం డిజిటల్ విధానంలో దరఖాస్తు చేసి ఆన్‌లైన్‌లో పురోగతిని చూసుకునే వెసులుబాటు సంస్థలకు లభించింది. ఇలాగే తమిళనాడు, కేరళ రాష్ట్రాలూ సుస్థిర విధానాలతో పరిశ్రమలకు అనుకూల పరిస్థితులను కల్పించాయని నివేదికలో పేర్కొంది. దేశంలో సిమెంటు ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండోస్థానంలో ఉందని ఆర్థికసర్వే ప్రస్తావించింది. దేశంలో ఉత్పత్తయ్యే 85 సిమెంటు 11 రాష్ట్రాల నుంచే వస్తోందని తెలిపింది. ఆ జాబితాలో రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్ ఉన్నాయి. దేశంలో సిమెంట్ పరిశ్రమ వార్షిక స్థాపిత సామర్థ్యం 690 మిలియన్ టన్నులు. 2025 ఆర్థిక సంవత్సరంలో సుమారు 453 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి జరిగిందని సర్వే పేర్కొంది. దేశంలో ప్రపంచ ప్రమాణాలతో మూడు బల్క్‌డ్రగ్ పార్కులను కేంద్రం అభివృద్ధి చేస్తే వాటిలో ఒకటి ఏపీలో ఉందని ఆర్థికసర్వే పేర్కొంది. మిగిలిన రెండు పార్కులు గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌లో ఏర్పాటవుతున్నాయి. ఈ పార్కుల అభివృద్ధికి కేంద్రం రూ.3వేల కోట్లు ఖర్చు చేస్తోంది. కొవిడ్ తర్వాత యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రెడియంట్స్, కీ స్టార్టింగ్ మెటీరియల్స్, డ్రగ్ ఇంటర్మీడియట్స్ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు కేంద్రం బల్క్‌డ్రగ్ పార్కుల ఏర్పాటుకు నిర్ణయించింది.

# మున్సిపాలిటీల్లో అభివృద్ధిపై మేథోమధనం

- 'టౌన్‌ప్లానింగ్'లో కీలక సంస్కరణలు తీసుకొచ్చినందుకు డైరెక్టర్ విద్యుల్లతకు అభినందన
- ఇంటిగ్రేటెడ్ డాష్ బోర్డు నూతన వెబ్‌సైట్‌ను 'పురపాలిక'కు అనుసంధానం
- నూతన వెబ్‌సైట్‌ను ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించిన మంత్రి నారాయణ







అనంతపురం జనవరి 30 ప్రభాతవార్త: ఇంటిగ్రేటెడ్ డాస్ బోర్డు అనే నూతన వెబ్‌సైట్‌ను రాష్ట్రంలోని 123 నగర, పురపాలక సంస్థలకు అనుసంధానం చేస్తూ రాష్ట్ర పురపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. నగరశివారులో వున్న జెఎన్‌టియూ రోడ్డులో వున్న ఆర్యభట్ట ఆడిటోరియం(డా.ఏపిజె అబ్దుల్‌కలాం న్యూ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్)లో శుక్రవారం పురపాలిక అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్చువల్ విధానంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రితో పాటు పురపాలక అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ సిర్డిఏ కమిషనర్ కన్నబాబులు హాజరైయ్యారు. ప్రాంతీయ సమీక్షా సమావేశంలో కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సిడిఎంఏ) సంపత్‌కుమార్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ రెడ్డి, పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ చీఫ్(ఈఎన్‌సి) ప్రభాకర్‌రావు, టిడ్కో ఎండి సునీల్‌రెడ్డి, పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ విద్యుల్లత, ప్రజా ఆరోగ్య ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్, మున్సిపల్ శాఖ డైరెక్టరేట్‌తో పాటు 42 నగర, పురపాలక సంస్థల కమిషనర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు. ఈ ప్రాంతీయ సదస్సుకు అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ బి.బాల స్వామి అధ్యక్షత వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రాంతీయ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అనివార్య కారణాల వల్ల మంత్రి నారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్ కుమార్‌రెడ్డిలు హాజరుకాక పోవడంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రాంతీయ సమీక్షా సమావేశంలోని కమిషనర్లకు నగర, పట్టణాలు అభివృద్ధికి చేపట్టాల్సిన విధివిధానాలపై దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ నూతన వెబ్‌సైట్ రూపకల్పన చేసి టౌన్ ప్లానింగ్ విభాగంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చినందుకు పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ విద్యుల్లతను ప్రత్యేకంగా అభినందలు తెలిపారు. ఈ వెబ్‌సైట్‌ను 123 నగర,పురపాలక సంస్థలకు అనుసంధానం చేస్తూ మంత్రి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించి, సాంకేతికతను సద్వినియోగం చేసుకుని నగర, పట్టణాలు అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని కమిషనర్లకు సూచించారు. అన్ని పురపాలక సంస్థల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, రోడ్డు, వీధిలైట్లకు ప్రాధాన్యతన ఇవ్వాలని, ప్రతి రోజూ పారిశుద్ధ్య నిర్వహణపై కమిషనర్లు మానిటరింగ్ చేయాలని, రోడ్లను ఊడ్చేందుకు స్వీపింగ్ మిషన్లు మాత్రమే ఉపయోగించాలన్నారు. అనధికార భవన నిర్మాణాలు, లేఅవుట్లను క్రమబద్ధీకరణకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, వచ్చే ఉగాదికి లక్ష ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందిచాలన్నది ముఖ్యమంత్రి లక్ష్య మని, మిగిలిన వాటిని జూన్ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. అలాగే మార్చి31లోపు లెగసీ వెస్ట్‌ను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో పార్కులను అభివృద్ధి చేయాలని, కుక్కలు, పందులతో ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేక దృష్టి సారించి ఎల్ఆర్ఎస్ స్కీమ్ ద్వారా క్రమ బద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన గడువును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమిషనర్లు సమన్వ యంతో విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా వుందని, నిర్లక్ష్యం వహించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.



## సమర్ధులకు సమన్నత గౌరవం: మంత్రి నిమ్మల

విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: సమర్థులైన ఉద్యోగులకు ఎప్పుడూ సమాజంలో సముచిత స్థానం, గౌరవం ఉంటాయని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. విజయవాడ జలసౌధలో ఈఎన్‌సి అడ్మిన్ శ్యాం ప్రసాద్, డిప్యూటీ ఈఎన్సి వీర ప్రతాప్‌ల రిటైర్మెంట్ కార్యక్రమానికి హాజరైన మంత్రి నిమ్మల వారి ఉభయులకు అభినందనలు తెలియజేశారు. శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నాగార్జున సాగర్ కుడి కాలువ వాటర్ మేనేజ్మెంట్, వెలిగొండ ప్రాజెక్ట్ పనుల పురోగతిలో చీఫ్ ఇంజనీర్ శ్యాం ప్రసాద్ సేవలు మరువలేనివన్నారు. సిఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్స్ బెంచింగ్, లైనింగ్, ఫీడర్ కెనాల్ జూన్ నాటికి పూర్తి చేసేలా శ్యాం ప్రసాద్ ప్రణాళికలు రూపొందించారని కొనియాడారు. నాగార్జునసాగర్ కుడి కాలువ, ప్రకాశం జిల్లా రైతులకు చీఫ్ ఇంజనీర్ శ్యాం ప్రసాద్ సేవలు గుర్తుండిపోతాయని కితాబిచ్చారు. అలాగే డిప్యూటీ ఈఎన్‌సి వీరప్రతాప్ గురించి కూడా ఆయన సేవలను కొనియాడారు. ఆయన అందించిన సేవలను గుర్తు చేశారు. ఒకే రోజు ఇద్దరు ఇంజనీర్లు రిటైర్ అవ్వడం ఇరిగేషన్ శాఖకు లోటే అయినా.. వారి విశ్రాంత జీవనం హాయిగా ఆనందంగా గడవాలన్నారు.

## జైలు నుంచి చెవిరెడ్డి విడుదల



విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: మద్యం అక్రమాల కేసులో అరెస్టయిన వైసీపీ సీనియర్ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఎట్టకేలకు జైలు నుంచి బయటకు వచ్చారు. హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో గురువారం రాత్రి ఆయన విజయవాడ జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. ఆయనతో పాటు ఇదే కేసులో నిందితులుగా ఉన్న వెంకటేశ్ నాయుడు (226 రోజుల తర్వాత), సజ్జల శ్రీధర్‌రెడ్డి (280 రోజుల తర్వాత) కూడా విడుదలయ్యారు. జైలు నుంచి బయటకు రాగానే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కేంద్రీకరించి సంచలన వ్యాఖ్యలు చేశారు.సీఎం తనను రాజకీయంగా టార్గెట్ చేశారని ఆరోపించారు. "ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం నుంచి రాజకీయంగా ఎదిగి, ఎమ్మెల్యేగా గెలిచినందుకే నాపై కక్ష కట్టారు. గతంలో 72 కేసులు పెట్టి వేధించడమే కాకుండా, జైలులో కూడా కనీస గౌరవం లేకుండా ప్రవర్తించారు" అని అన్నారు.

గతంలో ఎమ్మెల్యేగా ఉన్న తనను పోలీసులు బస్సులో కింద కూర్చోబెట్టి ఊర్లు తిప్పారని నాటి చేదు అనుభవాలను గుర్తు చేసుకున్నారు. నేతల విడుదల సందర్భంగా విజయవాడ జైలు పరిసర ప్రాంతాలు వైసీపీ కార్యకర్తలతో సందడిగా మారాయి. మాజీ మంత్రి జోగి రమేశ్ ఆధ్వర్యంలో నాయకులు వీరికి స్వాగతం పలికారు. భారీగా బాణసంచా కాల్చడమే కాకుండా జై జగన్ నినాదాలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు. వెన్నునొప్పి సమస్యతో బాధపడుతున్న చెవిరెడ్డి.. ఏసీబీ కోర్టు అనుమతితో గురువారం ఉదయం మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమానికి చికిత్స కోసం వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతుండగానే హైకోర్టు నుంచి బెయిల్ ఉత్తర్వులు రావడంతో మధ్యాహ్నం తిరిగి జైలుకు చేరుకుని ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుని రాత్రికి విడుదలయ్యారు.



శిక్షణా తరగతుల్లో ప్రసంగిస్తున్న ప్రఖర్ జైన్

## ప్రకృతి విపత్తుల నివారణలో కమ్యూనిటీలదే కీలకపాత్ర

### రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్

విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని కనిష్ట స్థాయికి తగ్గింపే ధ్యేయంగా రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రధాన లక్ష్యంతో ఈ ఏడాది చివరికల్లా ఆ నష్టాన్ని గణనీయంగా తగ్గిస్తామని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. స్థానిక ఎంజీ రోడ్డులోని డీవీ మేనర్ హోటల్‌లో రాష్ట్ర విపత్తు రిస్క్ తగ్గింపు కోసం రిస్క్ కమ్యూనికేషన్, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్‌పై రెండు రోజులపాటు వర్క్ షాపు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా రెండో రోజు శుక్రవారం డిజాస్టర్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ రాష్ట్రంలో తరచుగా సంభవించే తుపానులు, వరదల సమయంలో సమాచారాన్ని త్వరితగతిన చేరవేసేందుకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ప్రత్యేక కమ్యూనికేషన్ ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేయాలన్నారు. శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు జిల్లా స్థాయి, మండల స్థాయి, నుంచి స్వర్ణ గ్రామ/వార్డు సచివాలయ స్థాయి వరకు వెళ్లాలన్నారు. విపత్తుల సంభవించినప్పుడు ప్రజలకు సమాచారాన్ని అందించేటప్పుడు వారిని ఇబ్బంది పెట్టకుండా చాలా జాగ్రత్తగా, అర్థమయ్యేలా చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్డీఎంఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్. వెంకట దీపక్, ఎన్ఐడీఎం జేడీ కల్నల్ పీఎస్ రెడ్డి, యూనిసెఫ్ స్పెషలిస్ట్ సీమా, బీవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర జిల్లా స్థాయి అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్స్ ప్రతినిధులు, వివిధ జిల్లాల అధికారులు, నిపుణులు పాల్గొన్నారు.

## 31 గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 31 గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2026- 27 విద్యా సంవత్సరానికి గానూ 5వ తరగతి ప్రవేశాలకు ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ తాజాగా నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అర్హత కలిగిన బాలబాలికలు ఎవరైనా ఫిబ్రవరి 5 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్ష ద్వారా ఆయా గురుకులాల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో ఉచిత విద్య, వసతితో పాటు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు శిక్షణ కూడా అందిస్తారు. 5వ తరగతి ప్రవేశాలు పొందగోరే విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరంలో ఏదైనా ప్రభుత్వ పాఠశాలల్లో లేదా ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఇతర పాఠశాలల్లో 4వ తరగతి చదువుతూ ఉండాలి. అలాగే తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షకు మించకూడదు. అభ్యర్థుల వయోపరిమితి ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సెప్టెంబర్ 1, 2013 నుంచి ఆగస్ట్ 31, 2017 మధ్య జన్మించి ఉండాలి. బీసీ, ఓసీ అభ్యర్థులు సెప్టెంబర్ 1, 2015 నుంచి ఆగస్ట్ 31, 2017 మధ్య జన్మించి ఉండాలి. ఈ అర్హతలు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులు ఎవరైనా ఆన్‌లైన్ విధానంలో ఫిబ్రవరి 28, 2026వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయింపు చేస్తారు.

ప్రతి ఎస్టీ గురుకుల పాఠశాలలో మొత్తం 80 సీట్లు ఉంటాయి. ఒక్కో సెక్షన్‌కు 40 మంది చొప్పున రెండు సెక్షన్లుగా విభజిస్తారు. అన్ని గురుకులాల్లోన మొత్తం సీట్లలో ఎస్టీలకు 78 శాతం, ఎస్సీలకు 12 శాతం, బీసీలకు 5 శాతం, ఓసీలకు 2 శాతం, ఏఈక్యూలకు 3 శాతం చొప్పున సీట్లు కేటాయిస్తారు. రాత పరీక్ష హాల్ టికెట్లు మార్చి 10, 2026న విడుదల అవుతాయి. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 4, 2026వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో జరుగుతుంది. ఫలితాలు ఏప్రిల్ 29, 2026న వెల్లడిస్తారు. రాత పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో 4వ తరగతి స్థాయి సిలబస్‌లో మొత్తం 50 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. తెలుగులో 10 మార్కులు, ఇంగ్లీష్‌లో 10 మార్కులు, గణితంలో 15 మార్కులు, ఎన్విరాన్మెంటల్ సైన్స్‌లో 15 మార్కుల చొప్పున అడుగుతారు. నెగెటివ్ మార్కింగ్ ఉండదు. గ్రామీణ విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

## తిరుపతి ఐఐటిలో విప్లవాత్మక ప్రదర్శన

### ప్లాస్మా, వాటర్ క్వాలిటి రిసెర్చ్‌లను పరిశీలించిన కలెక్టర్

శ్రీకాళహస్తి, జనవరి 30 ప్రభాతవార్త: తిరుపతి ఐఐటిలో విప్లవాత్మక ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్లాస్మా రీసెర్చ్ గ్రూప్, వాటర్ క్వాలిటి రీసెర్చ్ గ్రూపులు కలెక్టర్‌కు ప్రదర్శించారు. నాన్-థర్మల్ ప్లాస్మా టెక్నాలజీపై అత్యాధునిక సాంకేతిక ప్రదర్శన నిర్వహించారు. ప్రొఫెసర్ షాహాబుద్దీన్, ఎం.మాలియేకల్, డాక్టర్ రీతేష్ కుమార్ గంగ్వార్ నేతృత్వంలోని బృందం ప్లాస్మా,శాస్త్రాన్ని వ్యవసాయం, పర్యావరణ భద్రత, పారిశ్రామిక రంగాల్లోని కీలక సవాళ్ళకు ఎలా వినియోగించాలో కలెక్టర్‌కు వివరించారు. శుక్రవారం తిరుపతి ఐఐటిలో ప్లాస్లా టెక్నాలజీపై ప్రత్యేక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర మాట్లాడుతూ తిరుపతి ఐఐటి బృందాన్ని అభినందిస్తూ ఈ ప్రదర్శనను పరిశీలించి చాలా ఆసక్తికరంగా ఉందని అభినందించారు. స్థిరమైన వ్యవసాయం పర్యావరణ పరిరక్షణకు ఈ సాంకేతికత మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఆధునాతన ప్లాస్మా శాస్త్రాన్ని రైతులకు ఉపయోగపడే ప్రాయోజిక స్థాయికి తీసుకువచ్చేందుకు తిరుపతి ఐఐటి శాస్త్రవేత్తల కృషిని అభినందించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్ రావు, ప్రకృతి వ్యవసాయ విస్తరణ అధికారి షణ్ముగం పాల్గొన్నారు.

## ఎస్‌పిడిసిఎల్ ఉద్యోగులకు అటెండెన్స్ యాప్



తిరుపతి, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఎస్‌పిడిసిఎల్ ఉద్యోగుల కోసం ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) అటెండెన్స్ యాప్‌ను రూపొందించామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించడంతోపాటు ఉద్యోగుల్లో జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో 229 మంది ఉద్యోగులతోపాటు పొరుగుసేవల సిబ్బందికి కూడా ఫిబ్రవరి 1వ తేదీ నుండి ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ విధానం అమలులోకి వస్తుందన్నారు. సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడవ, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని విద్యుత్ శాఖ కార్యాలయాల్లో కూడా ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ విధానాన్ని అమలులోకి తీసుకువస్తామని సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు.



ఉచిత కంటి శస్త్రచికిత్స మొబైల్‌బస్సు యూనిట్లను ప్రారంభించిన మంత్రి

## గుండ్రా సతీష్‌రెడ్డి సేవలు అభినందనీయం

### రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అనంతసాగరం(నెల్లూరు), జనవరి 30 ప్రభాతవార్త: పేదలకు మెరుగైన కంటి చూపు అందించడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అనంతసాగరం మండలంలోని సోమశిలలో గుండ్రా సతీష్‌రెడ్డి నేతృత్వంలో హెల్పింగ్ హార్ట్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి శస్త్ర చికిత్స మొబైల్ బస్సు యూనిట్లను మంత్రి ఆనం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో సోమశిలలోనే మూడురోజులపాటు పేదలకు ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి చూపు అందించేలా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ఇటీవల ఆత్మకూరులో గుండ్రా సతీష్‌రెడ్డి సహకారంతో నిర్వహించిన మెగా జాబ్‌మేళా ద్వారా సుమారు 600మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందడం సంతోషకరమన్నారు. మెట్టప్రాంత అభివృద్ధికి సతీష్‌రెడ్డి చేస్తున్న సేవలు అమోఘమని మంత్రి ఆనం ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ పావని, తాళ్ళూరి గిరినాయుడు, స్థానిక నేతలు రమణారెడ్డి, లక్ష్మీరెడ్డి, విజయనర్సింగ్ రెడ్డి, శంకర్ నేత్రాలయ సభ్యులు రంజిత్, వైద్యులు గజేంద్రకుమార్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉగాదికి జాబ్ క్యాలెండర్!

**వివిధ శాఖల్లోని ఖాళీల సేకరణ**

విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ప్రభుత్వం తీపికబురు అందించేందుకు సిద్ధమవుతోంది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌ను ఉగాది నాటికి విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకుని కసరత్తు ముమ్మరం చేసింది. దీని కోసం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రతి ఏటా ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను గుర్తించి, వాటి భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం అన్ని శాఖల నుంచి ఖాళీల జాబితాను తెప్పించుకుంటోంది. అయితే, కొత్త ఉద్యోగాల భర్తీ వల్ల ప్రభుత్వ ఖజానాపై పడే ఆర్థిక భారాన్ని కూడా జాగ్రత్తగా అంచనా వేస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాకే జాబ్ క్యాలెండర్‌పై తుది ప్రకటన చేయనున్నారు. ఇటీవల 16 వేల టీచర్.. 6 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రభుత్వం భర్తీ చేసింది. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో పాటు 6 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసింది. ఇప్పుడు కొత్త జాబ్ క్యాలెండర్‌ను పకడ్బందీగా రూపొందించి, వీలైనంత త్వరగా నియామక ప్రక్రియ చేపట్టాలని యోచిస్తోంది. గతేడాది జాబ్ క్యాలెండర్ వస్తుందని భావించినా అది కార్యరూపం దాల్చలేదు. అయితే ఈసారి మాత్రం ఉగాది నాటికి నిరుద్యోగుల నిరీక్షణకు తెరదించుతూ ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రకటన చేస్తుందని సమాచారం. దీనిపై త్వరలోనే పూర్తిస్థాయి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# రాష్ట్రానికి మరో నాలుగు డొమెస్టిక్ ఎయిర్‌పోర్టులు

విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో మరో నాలుగు కొత్త డొమెస్టిక్ విమానాశ్రయాలు ఏర్పాటు కానున్నాయి. తాడేపల్లిగూడెంలో కొత్త ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు అవకాశాలపై అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లు కేంద్రం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మోహోల్ సమాధానమిచ్చారు. ఈ నెలలోనే ఏపీ ప్రభుత్వం నుంచి ఈ అభ్యర్థన అందింది, విమానాశ్రయానికి అవసరమైన స్థల వివరాలను కూడా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు అందజేసిందని ఆయన వివరించారు. రాష్ట్రంలోని మరో మూడు ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటుకు సంబంధించిన ప్రాథమిక అధ్యయనాలు పూర్తయ్యాయని కేంద్ర మంత్రి తెలిపారు. కుప్పం, శ్రీకాకుళం, ఒంగోలులో ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి ఏఏఐ ఇప్పటికే అధ్యయనం పూర్తి చేసిందన్నారు. ఈ మూడు విమానాశ్రయాల నిర్మాణానికి అవసరమైన భూమి అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్స్ విధానం కింద పౌరవిమానయాన శాఖకు ప్రతిపాదనలు పంపించింది, అవి ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయని మురళీధర్ మోహోల్ పేర్కొన్నారు. మరోవైపు రాజమండ్రి ఎయిర్‌పోర్టులోని కార్గో టెర్మినల్ పూర్తి స్థాయిలో వినియోగంలో లేదని కేంద్రం స్పష్టం చేసింది. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. ఏటా 17,200 టన్నుల సామర్థ్యం ఉన్న ఈ టెర్మినల్ నుంచి 202425లో కేవలం 25 టన్నుల సరుకు మాత్రమే రవాణా అయిందని (0.15 వినియోగం) తెలిపారు. ఈ కారణంగా అక్కడ అదనపు కార్గో సౌకర్యాలు కల్పించే ఆలోచన లేదన్నారు.

### ఏపీలో భారీగా పెరిగిన టోల్ ట్యాక్స్ వసూళ్లు

ఏపీలో టోల్ ట్యాక్స్ వసూళ్లు గణనీయంగా పెరిగాయని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లోక్‌సభలో వెల్లడించారు. రాష్ట్రంలో 2023లో రూ.3,402 కోట్లు, 2024లో రూ.3,495 కోట్లు వసూలు కాగా, 2025లో ఆ వసూళ్లు రూ.4,126 కోట్లకు చేరినట్లు ఆయన తెలిపారు.



ఖేలో ఇండియా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మయాంక్ శ్రీవాస్తవతో క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

# క్రీడల అభివృద్ధికి మద్దతివ్వండి

### ఖేలో ఇండియా, శాయ్‌కు మంత్రి రాంప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి

### సానుకూలంగా స్పందించిన డిడిజి మయాంక్ శ్రీవాస్తవ

విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: క్రీడల పట్ల ఉన్నత తపనతో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి దిశగా కార్యాచరణ చేపడుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి.. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఖేలో ఇండియా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మయాంక్ శ్రీవాస్తవని ఢిల్లీలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అంశాలపై విస్తృతంగా చర్చించారు. మహిళా క్రీడాకారుల ప్రోత్సాహం కోసం 'అస్మిత' పథకం కింద ప్రతి జిల్లాలో మహిళల అథ్లెటిక్స్ నిర్వహణ, ఎస్‌ఏఐ నిధులతో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడ పోటీలు, ప్రతి ఆదివారం 'సండే ఆన్ సైకిల్' ఫిట్‌నెస్ కార్యక్రమాలు, కోచ్‌ల సంఖ్య పెంపు, క్రీడా బడ్జెట్ పెంపు వంటి ప్రతిపాదనలను మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎస్‌ఏఐ నుంచి మరింత ప్రత్యేక దృష్టి, సహకారం అందించాలని మంత్రి కోరగా, ఈ ప్రతిపాదనలకు మయాంక్ శ్రీవాస్తవని సానుకూల స్పందించారు. రాష్ట్రం క్రీడల అభివృద్ధికి తగినంత సహాయసహకారాలు అందిస్తామని రాష్ట్రంలో పర్యటిస్తామని మంత్రికి తెలిపారు.

### కడప- రాయచోటి రహదారి విస్తరణకు కేంద్రానికి విజ్ఞప్తి

ఈ క్రమంలోనే తాజాగా రాష్ట్ర రహదారుల అభివృద్ధి పైన న్యూఢిల్లీలోని ట్రాన్స్‌పోర్ట్ భవన్‌లో కేంద్ర రవాణా ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమావేశమయ్యారు. ఆయన కేంద్రం ముందు ఒక కీలక విజ్ఞప్తిని ఉంచారు. కడప -రాయచోటి మార్గంలో ట్రాఫిక్ పెరుగుతున్న క్రమంలో రహదారి విస్తరణకు కేంద్రానికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 2026-27 వార్షిక ప్రణాళిక కింద అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని ఏపీ మంత్రి కోరారు. కడప-రాయచోటి వీబీ40ను నాలుగు లేన్‌లుగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. గువ్వల చెరువు 950 మీటర్ల టన్నెల్ ప్రాజెక్టుకు త్వరితగతిన ఆమోదం ఇవ్వాలని మంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు ప్రజల భద్రత, సౌకర్యవంతమైన ప్రయాణమే లక్ష్యంగా మంత్రి కేంద్రం ముందు అనేక ప్రతిపాదనలు పెట్టారు. ప్రస్తుతం ఏపీలో కొనసాగుతున్న రహదారి ప్రాజెక్టులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ హైవేల అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో ప్రాజెక్టులను వేగవంతం చేసి త్వరితగతిన ఆధునిక రవాణా సదుపాయాలు అందించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

# రామతీర్థంలో కన్నుల పండుగగా సీతారాముల కల్యాణోత్సవం



నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), జనవరి 30 ప్రభాతవార్త: విజయనగరం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని సీతారాముల తిరు కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఏటా భీష్మ ఏకాదశి ఈ కళ్యాణం హిందూ సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందుకు సంబంధించి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో అధికార సిబ్బంది ఏర్పాట్లు చేయగా అర్చక స్వాములు శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవాన్ని జరిపించారు. ఉదయం 8 గంటలకు శ్రీమద్రామాయణ పారాయణం వేద పఠనం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు మూడు వాహనాల సేవ అట్టహాసంగా జరిగింది. రాత్రి పది గంటలకు తిరుక్కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవం తిలకించేందుకు నెల్లిమర్ల మండల పరిసర గ్రామాల ప్రజలతో పాటు విజయనగరం, గజపతినగరం, శ్రీకాకుళం జిల్లా రణస్థలం ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కల్యాణోత్సవం ఆద్యంతం హిందూ సాంప్రదాయ పద్ధతిలో జరిగింది. పెళ్లి కుమారుడు శ్రీరామచంద్రుడికి ప్రభుత్వం తరపున దేవస్థానం అధికారులు పట్టు వస్త్రాలను సమర్పించారు. పెండ్లి కుమార్తె సీతాదేవి తరపున పూసపాటిరేగకు చెందిన ఏకుల రామారావు కుటుంబీకులు హాజరై పట్టువస్త్రాలను, బంగారు శతమానం సమర్పించారు. వివాహ మహోత్సవంలో భాగంగా శ్రీరాముడు సీతాదేవికి తాళికట్టే ఘట్టం, ముత్యాల తలంబ్రాలు కార్యక్రమాలు కన్నుల పండుగగా జరిగాయి. 400 సంవత్సరాల క్రితం రామతీర్థంలో సీతారాముల విగ్రహాలను భీష్మ ఏకాదశి నాడు ప్రతిష్టించారని, అందువల్లనే భీష్మ ఏకాదశి ప్రతి సంవత్సరం కల్యాణ మహోత్సవం నిర్వహిస్తుంటారని కథనం. ఈ ఉత్సవం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దేవస్థానం ఈవో వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్చక స్వాములు ఖండవిల్లి సాయి రామాచార్యులు, ఖండవిల్లి కిరణ్ కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పానంగి పల్లి ప్రసాద్, సుదర్శనం పవన్ కుమార్, రాంగోపాల్ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భోగాపురం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి రామకృష్ణ పర్యవేక్షణలో నెల్లిమర్ల ఎస్సై బి. గణేష్ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# వైద్యపరీక్షల తరువాతే రేపు రామకృష్ణతీర్థంకు భక్తుల అనుమతి

### 12ఏళ్లలోపు పిల్లలు, అనారోగ్య సమస్యల భక్తులకు అనుమతిలేదు



తిరుమల, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలలో రేపు జరగనున్న రామకృష్ణతీర్థ ముక్కోటి వేడుకలకు, పవిత్ర పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు మెడికల్ స్క్రీనింగ్ పరీక్షలు అనంతరం అనుమతించాలని టిటిడి విఎస్ఓ అల్లం సురేంద్ర అధికారులకు సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న భక్తులను, 12ఏళ్లలోపు పిల్లలను రామకృష్ణతీర్థంకు అనుమతించబోమన్నారు. ఆదివారం ముక్కోటి పర్వదినం విజయవంతానికి శుక్రవారం సాయంత్రం తిరుమలలో పోలీసు, విజిలెన్స్, టిటిడి సిబ్బందితో కలసి సురేంద్ర సమీక్షించారు. రేపు ఉదయం 6గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు మాత్రమే యాత్రికులకు అనుమతించడం జరుగుతుందన్నారు. ఆలయం నుండి ఊరేగింపుగా పూలు,పండ్లు, స్వామివారి ప్రసాదాలు తీసుకెళ్ళి అక్కడ శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తులకు ప్రసాద వితరణ చేస్తారు. ప్రైవేట్ వాహనాలను, ద్విచక్రవాహనాలను అనుమతించరన్నారు. భక్తులు గోగర్భం కూడలి నుండి ఆర్టీసి బస్సుల్లోనే వెళ్ళాలన్నారు.



## విశ్వమానవత్వమే సాయితత్వం: జస్టిస్ బి.చంద్రకుమార్

అనంతపురము, జనవరి 30 ప్రభాతవార్త బ్యూరో: కుల మతాలకతీతమైన విశ్వ మానవత్వమే సాయితత్వమని హైకోర్టు విశ్రాంతన్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ పేర్కొన్నారు. మీనాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖకవి, కళారత్న డా.బిక్కి కృష్ణ అధ్యక్షతన మీనాక్షి వికాసకేంద్రంలో నిర్వహించిన జస్టిస్ బి.చంద్రకుమార్ రెండు సాయి పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. మీనాక్షి ఫౌండేషన్ అధ్యక్షులు రవికాంత్ రమణ సాయిబాబా ఎవరు..? సాయి కరుణే నా రక్షణ అన్న పుస్తకాలను ఆవిష్కరించారు. జస్టిస్ బి.చంద్రకుమార్ ఎంతో పరిశోధన చేసి సాయితత్వంపై పుస్తకాలు రాశారని కొనియాడారు. తన విలువలతో, తీర్పులతో న్యాయవ్యవస్థకే వన్నె తెచ్చిన జస్టిస్ బి.చంద్రకుమార్ శిర్డిసాయి జన్మరహస్యాలపై పరిశోధనలు చేసి సాధికారికమైన రచనలు చేశారని ఐ.ఆర్.ఎస్.అధికారి, ప్రముఖ కవి డా.జెల్ది విద్యాధర్ తెలిపారు. సాయిబాబాను విమర్శించేవారికి జస్టిస్ చంద్రకుమార్ రచనలే సమాధానం చెబుతాయని సీనియర్ జర్నలిస్టు మచ్చా రామలింగారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో శంకరం ఫౌండేషన్ అధ్యక్షుడు యలవర్తి ధనలక్ష్మి, కవులు ఏలూరి యంగన్న, జాబిలి చాంద్ బాషా, డా.మురళి, డా. దేవన్న, టి.వి.రెడ్డి, కె.కృష్ణవేణి, ఆశ్రయ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ బి.చంద్రకుమార్‌ను రవికాంత్ రమణ ఘనంగా సన్మానించారు.

# రేపు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ

ఇంద్రకీలాద్రి, జనవరి 30 ప్రభాతవార్త: ఫిబ్రవరి 1వ తేదీన మాఘమాస పౌర్ణమి పర్వదినాన దుర్గమ్మ వారు వేంచేసియున్న శ్రీ ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ కార్యక్రమం ఘాట్ రోడ్డు వద్ద వున్న శ్రీ కామధేను మాత అమ్మవారి ఆలయం వద్ద నుండి ప్రారంభిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ గిరి ప్రదక్షణ విద్యాధరపురం, కుమ్మరిపాలెం, నాలుగుస్థంబాల సెంటర్, సితార థియేటర్, పాలఫ్యాక్టరీ, బ్రాహ్మణ వీధి, కనకదుర్గానగర్ మీదుగా తిరిగి శ్రీ అమ్మవారి ఆలయానికి చేరుకుంటుందని భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామి అమ్మవార్ల అనుగ్రహం అందుకోవా లన్నారు.

### అద్భుతం.. అమోఘం భరతనాట్య ప్రదర్శన

దుర్గమ్మవారి ఆలయంలో శుక్రవారం వినుకొండకు చెందిన శ్రీ లక్ష్మి నృత్య కళాశాల ఆచార్యులు జి రేవతి ఆధ్వర్యంలో వారి శిష్యబృందం ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శనం అద్భుతం, అమోఘం అంటూ భక్తులు ప్రశంసించారు. శ్రీ అమ్మవారి వైభవాన్ని కొనియాడుతూ సాగిన కీర్తనలకనుగుణంగా నృత్య ప్రదర్శనలతో కళాకారులు అలరించారు. కార్యక్రమం అనంతరం వారికి దుర్గమ్మవారి దర్శనంతో పాటు ప్రసాదం, మెమెంటోలు అందించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ 31న కూచిపూడి నృత్యం, ఫిబ్రవరి 1న కూచిపూడి నృత్య ప్రదర్శనలు వారాంతపు రోజుల్లో నిర్వహించే కళాప్రదర్శనలను వీక్షించాలన్నారు.






దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

### నిత్యాన్నదానానికి విరాళాలు :

శ్రీ కనకదుర్గ అమ్మవారి నిత్య అన్నదాన పథ కానికి హైదరాబాద్‌కు చెందిన సినీ నిర్మాత కొమ్మినేని వెంకటేశ్వరరావు రు.1,01,116/ల విరాళం, గుంటూరు జిల్లా, పొన్నెకల్లు గ్రామానికి చెందిన ఎనకొల్లు శివాజీ అమ్మవారి నిత్య అన్నదాన పథకానికి రూ.1,11,111/లు విరాళం, గుంటూరుకు చెందిన కోట జయశంకరం కుటుంబ సభ్యులు రూ.1,00,000/లు విరాళంగా అందజేశారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసిన అనంతరం శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# చెక్‌పోస్ట్‌లో వాహనాల తనిఖీలు

### 20 లక్షల నగదు పట్టుకున్న పోలీసులు

**సిరిసిల్ల బ్యూరో, జనవరి 30, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో పెద్దమొత్తంలో నగదు పట్టుబడింది. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రగుడు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా రూ. 20 లక్షల నగదు పట్టుకున్నట్లు పట్టణ సిఐ కృష్ణ తెలిపారు. టిజి 23ఎ 1524 అనే కారును పోలీసులు తనిఖీ చేయగా వేములవాడకు చెందిన గణాచారి సంబాషిన్ అనే వ్యక్తి వద్ద అనుమానాస్పదంగా కనిపిస్తున్న రూ. 20 లక్షల నగదు తీసుకెళ్లడం గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల నిబంధలన ప్రకారం ఆ నగదును ఎస్ఎస్‌టి బృంద ఇన్ చార్జి జి.ఆనంద్, ఎపిఒ సమక్షంలో, మధ్యవర్తుల సమక్షంలో ఆ నగదును స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ నగదును ఎక్కడకు తీసుకెళుతున్నారనే విషయాన్ని విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఎన్నికల నామినేషన్ల స్వీకరణ జరుగుతున్న తరుణంలో లక్షలాది రూపాయలు పట్టుకోవడం కలకలం రేపింది. ఎవరైనా రూ. 50 వేలకు మించి డబ్బును తీసుకెళితే ఆధారాలు చూపించాలని లేనిపక్షంలో ఆ డబ్బును స్వాధీనం చేసుకుంటారని పోలీసులు తెలిపారు.

# కొండ దిగిన వెండి, బంగారాలు

## ఒక్క రోజులో రూ. 68 వేలు తగ్గిన వెండి




ముంబయి, జనవరి 30: అంతర్జాతీయ పరిణామాల కారణంగా గత కొన్నిరోజులుగా రాకెట్ వేగంతో దూసుకెళ్లిన బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిల నుంచి ధరలు అనూహ్యంగా దిగివచ్చాయి. ముఖ్యంగా వెండి ధరలు పతనమయ్యాయి. ఒక్కరోజే కిలో వెండి ధర ఏకంగా రూ.68 వేల మేర పడిపోవడం గమనార్హం. తులం బంగారం ధర కూడా రూ.15 వేల వరకు తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితి, అమెరికా స్టాక్ మార్కెట్లలో టెక్ షేర్ల పతనం, ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు ఎగబడటమే ఈ ఆకస్మిక పతనానికి ప్రధాన కారణాలని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఫ్యూచర్ మార్కెట్‌లో వెండి కిలో ఒక్కంటికి సుమారు 67 వేలు పతనం అయితే బంగారం కూడా రూ.15 వేలవరకూ తగ్గిందని సమాచారం. ఎంసిఎక్స్‌లో వెండి ఫ్యూచర్స్ మార్చి డెలివరీకి నిర్దేశించినవి కిలో వెండి 16.97శాతం క్షీణించి రూ.67,891 రూపాయల మేర తగ్గి రూ.3,32,002కి చేరింది. గురువారం రూ..4,20,048వద్ద వెండి ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరిన సంగతి తెలియందికాదు. దీనితోపోలిస్తే వెండి ధర సుమారు రూ.90వేలవరకూ పతనం అయింది. అలాగే పసిడిధరల్లో ఫ్యూచర్స్ కూడా ఫిబ్రవరి కాంట్రాక్టులు పదిగ్రాములు 9శాతం క్షీణించి రూ.15,246తగ్గి రూ.1,54,157కి చేరింది. గురువారం రూ.1,80,779వద్ద కొనసాగిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం ధర 500 డాలర్ల వరకు పడిపోయి, ప్రస్తుతం అది 5,189 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. వెండి ధర కూడా 12 శాతం మేర తగ్గి, 121 డాలర్ల గరిష్ఠ స్థాయి నుంచి 110 డాలర్లకు పడిపోయింది.

ఈ ఆకస్మిక మార్పునకు అమెరికాలోని టెక్నాలజీ రంగం కూడా కారణమైంది. కృత్రిమ మేధస్సు (ఏఐ)పై భారీగా ఖర్చు చేస్తున్న మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. క్లౌడ్ వృద్ధి మందగించడం, ఏఐ ఖర్చులు పెరగడంతో ఇన్వెస్టర్లలో ఆందోళన మొదలైంది. ఈ ప్రభావం కమోడిటీ మార్కెట్లపై పడింది. ఇన్వెస్టర్లు తమ నష్టాలను పూడ్చుకోవడానికి బంగారం, వెండిలోని పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. వెండి ధరల్లోని ఈ హెచ్చుతగ్గులపై ఆల్ ఇండియా జ్యువెల్లర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు పంకజ్ అరోరామాట్లాడుతూ గత 15 రోజుల్లోనే వెండి ధర రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు పెరిగింది. వేగంగా పెరగడం ఎప్పుడూ నిలకడగా ఉండదు. అందుకే ఇప్పుడు క్రాష్ అయ్యింది. అమెరికా వెండిని క్రిటికల్ మినరల్‌గా గుర్తించడం, చైనా ఎగుమతులను నియంత్రించడంతో డిమాండ్ పెరిగింది. ఎక్స్ఛేంజీలలో జరిగే పేపర్ ట్రేడ్ వల్ల ధరల్లో ఇంత అస్థిరత వస్తోంది. రానున్న కొన్నేళ్లలో వెండి ధర కిలోకు రూ.7 లక్షల వరకు వెళ్లే అవకాశం ఉంది. అయితే జ్యూయెలరీ ఫెడరేషన్ మాత్రం బంగారందరలు రూ.1,75,340వద్ద శుక్రవారం ఉదయం ట్రేడింగ్ జరిగిందని వెల్లడించింది.



ఒంగోలులో బాలల ప్రపంచ తెలుగు మహాసభల లోగో ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్, పట్టాభిరామ్, గజల్ శ్రీనివాస్, తదితరులు

# డిసెంబర్‌లో బాలల ప్రపంచ తెలుగు మహాసభలు

విజయవాడ, జనవరి 30 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్ర సారస్వత పరిషత్తు, బాల బాలికలలో తెలుగు భాష పట్ల అవగాహన, అనురాగం, స్వాభిమానం, బాధ్యత పెంపొందించాలనే లక్ష్యంతో "బాలల ప్రపంచ తెలుగు మహాసభలు- 2026" నిర్వహించడానికి సంకల్పించింది. 16 ఏళ్ల లోపు బాల బాలికలలో మాతృభాషపై అవగాహన, ప్రేరణ, అనురాగం, బాధ్యతను పెంపొందించేందుకు, తెలుగు భాషను ఒక స్వాభిమాన ప్రతీకగా వారు భావించేలా తీర్చిదిద్ది, ప్రతిభావంతులైన బాల బాలికలను గుర్తించి శాస్త్రీయ శిక్షణ అందించి, సంప్రదాయ కళలు, ఆధునిక సాంకేతికతల సమ్మేళనంగా తెలుగు వికాసాన్ని బాల బాలికల చేత ప్రదర్శింప జేయడమే ధ్యేయంగా 5, 6 తేదీలు డిసెంబర్ 2026 న ఎంతో ప్రతిష్టాత్మకంగా బాలల ప్రపంచ తెలుగు మహా సభలు నెక్స్ట్ జన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణం, ఒంగోలులో నిర్వహిస్తామని డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఒంగోలులో నిర్వహించిన " బాలలే మాతృ భాషకు భవిత" సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్ యాదవ్ బాలల ప్రపంచ మహా సభల లోగోను ఆవిష్కరించారు. వేలాది మంది బాల బాలికలు ఆ మహా సభలలో అష్టావధానం, పద్య నాటకం, పద్య రచన, కథా, కవిత, గేయ రచన, హరికథ, బుర్రకథ, శాస్త్రీయ, లలిత, చలన చిత్ర సంగీత గాన కార్యక్రమాల్లో పాల్గొనడం, వేయ మందికి పైగా బాల బాలికలు కవి సమ్మేళనంలో పాల్గొనడం, కూచిపూడి, జానపద నృత్య, కోలాట, కత్తి సాము వంటి ప్రదర్శనలలో పాలు పంచుకోవడం వల్ల తెలుగు భాష వికాసం కోసం ఒక కొత్త తరం సిద్ధం కావడం ఆనందంగా వుందని, డా.గజల్ శ్రీనివాస్ బాలల కోసం తెలుగు మహాసభలు తీర్చిదిద్దడం స్ఫూర్తిదాయకమని మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, జిల్లా కలెక్టర్ రాజు బాబు, పరిషత్ సభ్యులు అడ్డాల వాసు, లక్కం రాజు సునీత తదితరులు పాల్గొన్నారు.

# జంతుసంరక్షణ సామాజిక బాధ్యత

## ఎన్‌టిఆర్ కలెక్టర్ లక్ష్మీశా



విజయవాడ (గన్నవరం), జనవరి 30 ప్రభాతవార్త: జంతు సంరక్షణ సమాజిక బాధ్యత అని ప్రతిఒక్కరూ జంతుసంరక్షణకు కృషిచేయాలని ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. జంతుసంరక్షణ పక్షోత్సవాలను పురస్కరించుకుని పశుసంవర్దకశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్దులకు జంతుసంరక్షణ అంశంపై నిర్వహించిన పోటీలలో విజేతలకు శుక్రవారం కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందచేసారు. జిల్లాస్థాయిలో మొదటి బహుమతి పొందిన నందిగామ పాఠశాల విద్యార్ది ఎస్‌కె.సాహెబ్, ద్వితీయబహుమతి చందర్లపాడుకు చెందిన విద్యార్దిని యం.శ్రీలేఖ, విజయవాడ సివిఆర్ ఉన్నత పాఠశాల విద్యార్దులు బి.షర్మిల, ఎస్.శ్రీవల్లి, యం.రాజవెంకట్, వీర్లుపాడు మండలం దొడ్డదేవరపాడు విద్యార్దులు ఎస్.సాయిఉత్తేజ్, పి.రోహిత్‌కుమార్, పి.సాయి జస్పతలకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందచేసారు. ఈకార్యక్రమంలో జిల్లాపశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ యం.హనుమంతరావు, ఉపసంచాలకులు డాక్టర్ చంద్రశేఖరరావు, సహాయసంచాలకులు డాక్టర్ సునంద తదితరులు పాల్గొన్నారు.

### ఓపిఎస్‌కు నేరుగా ప్రజలే దరఖాస్తు చేయవచ్చు

బిల్డింగ్ పీనలైజేషన్ స్కిం(ఓపిఎస్)కు ప్రజలే స్వయంగా దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించినట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. ఓపిఎస్ దరఖాస్తు చేసేందుకు లైసెన్స్ టెక్నికల్ పర్సన్‌లు ప్రజల నుండి ఎక్కువ మొత్తం నగదు తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నందున నేరుగా ప్రజలే దరఖాస్తు చేసుకునే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

### వయోవృద్దుల రక్షణకు ప్రత్యేక చట్టాలు

వయోవృద్దుల రణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. వయోవృద్దుల సంక్షేమ కమిటీ సమావేశం శుక్రవారం విజయవాడలోని కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలో అప్పిలేట్ ట్రెబ్యూనల్‌కు వచ్చిన క్లెయిమ్‌ల పరిష్కారంతోపాటు వయోవృద్దుల క్షేమం సంక్షేమానికి రూపొందించిన కార్యాచరణను పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మొత్తం 454 క్లెయిమ్‌లకు గానూ ఇప్పటికే 392 పరిష్కారం కాగా మరో 62 పెండింగ్‌లో ఉన్నట్లు పెండింగ్ క్లెయిమ్‌లను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్దుల సంక్షేమశాఖ ఏడి వి.కామరాజు, ఏసిపి కె.వెంకటేశ్వరావు, డిఆర్డీఏ పిడి నాంచారరావు, డిప్యూటి డియంహెచ్ఓ ఇందుమతి, ఉమ్మడి కృష్ణా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి యం.వెంకటేశ్వరావు, ట్రెబ్యునల్ సభ్యులు ఎన్.కామేశ్వరి, ఆర్.వెంకటేశ్వరావు, ఎన్.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



## ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో గాడెక్కి, పీర్స్‌కు మిక్స్‌డ్ డబుల్స్ కిరీటం

## ఫైనల్స్‌కు అల్కరాజ్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మిక్స్‌డ్ డబుల్స్ కిరీటాన్ని గాడెక్కి-పీర్స్ జోడీ దక్కించుకుంది. ఇదే సమయంలో స్పెయిన్ సంచలనం, వరల్డ నంబర్ 1 కార్లోస్ అల్కరాజ్ ఫైనల్లోకి అడుగుపెట్టాడు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియన్లు ఒలివియా గాడెక్కి-జాన్ పీర్స్ 4-6, 6-3, 10-8 తేడాతో ఫ్రెంచ్ జంట క్రిస్టినా మ్లాడెనోవిక్-మాన్యుయెల్ గినార్డ్‌ను ఓడించి, 37 సంవత్సరాల తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జంటగా నిలిచారు. తొలి గేమ్‌లో మ్లాడెనోవిక్-గినార్డ్ పీర్స్‌ను బ్రేక్ చేసి ఆధిక్యాన్ని పదిలం చేసుకున్నారు. కానీ ఆస్ట్రేలియన్లు 2-2తో సమం చేయడానికి తీవ్ర ప్రయత్నంలో తిరిగి పోరాడారు. సెట్ కోసం సర్వ్ చేస్తున్నప్పుడు మ్లాడెనోవిక్ బ్రేక్ అయ్యాడు. కానీ ఫ్రెంచ్ జంట గినార్డ్ సర్వ్‌లో 6-4తో దాన్ని ముగించింది. ఈ ఆస్ట్రేలియన్ ద్వయం రెండవ సెట్‌లో స్థిరపడి, ప్రారంభంలోనే బ్రేక్ వేసి 3-1 ఆధిక్యంలోకి వెళ్ళి సర్వ్‌ని నిలబెట్టుకోగలిగింది. పీర్స్ రెండవ సెట్‌ను ఏస్‌తో 10 పాయింట్ల టైబ్రేక్‌కు బలవంతం చేశాడు. మ్లాడెనోవిక్ తొలి డబుల్ ఫాల్ట్ రెండవ సర్వ్‌లో ఫ్రెంచ్ ద్వయం 7-5తో ఆధిక్యంలోకి వెళ్లే ముందు, సర్వింగ్ జట్టు వరుసగా ఐదు పాయింట్లు కోల్పోవడంతో ముగింపుకు దారితీసింది. అలాగే సెమీఫైనల్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను ఓడించి ఫైనల్‌లోకి అల్కరాజ్ చేరుకున్నాడు. హోరాహోరీ సాగిన ఈ పోరులో 6-4, 7-6(5), 6-7 (3), 6-7 (4), 75 తేడాతో అల్కరాజ్ విజయం సాధించాడు.



# స్వదేశంలో టీమిండియాకు షాక్

## టీ20ల్లో 210 + లక్ష్య ఛేదన అంటేనే టెర్రర్

### అతిపెద్ద పరాజయాల లిస్ట్‌లో విశాఖ అగ్రస్థానం





**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు సాధారణంగా స్వదేశంలో అద్భుతమైన ప్రదర్శనలతో ప్రత్యర్థులను మట్టికరిపిస్తుంది. అయితే కొన్ని సందర్భాల్లో మాత్రం నిరాశపరిచే రీతిలో పరాజయాలు కూడా ఎదురయ్యాయి. ప్రధానంగా పొట్టి ఫార్మాట్‌లో టీమిండియా దూసుకుపోతున్నప్పటికీ, త్వరలో ప్రారంభం కాబోతోన్న టీ20 వరల్డ్ కప్ ముంగిట ఓ అంశం కలవరపెడుతోంది. టీ20ల్లో ఇప్పటికే భారత్ వరుసగా 11 సిరీస్‌ల్లో విజయం సాధించి జోష్‌లో ఉంది. అయితే 210+ పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో మాత్రం తడబాటుకు గురవుతోంది. జట్టులో స్టార్ ప్లేయర్లు ఉన్నప్పటికీ టీ20 చరిత్రలో టీమిండియా ఇప్పటిదాకా 210 పరుగులకు పైగా లక్ష్యాన్ని ఒక్కసారి కూడా ఛేదించలేదు. దీంతో ఇది వరల్డ్ కప్ ముంగిట భారత్‌కు పెద్ద బలహీనత అయినా ఈ సారి అటువంటి అవకాశం ఇవ్వకుండా దూకుడుగా ముందుకు వెళ్లాలనే పట్టుదలతో ఉంది. భారత్ టీ20ల్లో ఇప్పటిదాకా 118 సార్లు ఛేజ్ చేసింది. అందులో 80 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ఇందులో ఒక్క మ్యాచ్‌లో కూడా 210+ టార్గెట్ లేకపోవడం గమనార్హం. మరో 34 టీ20ల్లో ఓటమి పాలైంది. మిగిలిన నాలుగు మ్యాచ్‌ల ఫలితాలు తేలలేదు. ముఖ్యంగా భారీ పరుగుల తేడాతో ఓడిన మ్యాచ్‌లు భారత క్రికెట్ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయాయి. సొంతగడ్డపై భారీ పరాజయాల జాబితా ఓసారి చూస్తే 2025లో ముల్లాన్పూర్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టుకు స్వదేశంలో పరుగుల పరంగా ఎదురైన అతిపెద్ద పరాజయంగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో భారత్ 51 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్ ఫలితం భారత అభిమానులకు పెద్ద షాక్ అనే చెప్పాలి. ఇక టీమిండియా అతి పెద్ద ఓటముల్లో ఐదు టీ20 సిరీస్ భాగంగా ఈ నెల 28న విశాఖలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్ రెండో స్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో భారత్ 50 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఈ ఓటమి టీమిండియా ప్రదర్శనపై ప్రశ్నలు లేవనెత్తింది. 2022లో ఇండోర్లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 49 పరుగుల తేడాతో ఓడింది. అప్పట్లో బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ జట్టు విఫల మైంది. 2016లో నాగ్పూర్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 47 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. న్యూజిలాండ్‌మంచి ప్రదర్శనతో భారత్‌పై ఆధిపత్యం చెలాయించింది. అలాగే 2017లో రాజ్‌కోట్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 40 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. స్వదేశంలో వరుసగా న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఈ ఓటములు అప్పట్లో పెద్ద చర్చకు దారి తీశాయి. మొత్తంగా చూస్తే భారత్ స్వదేశంలో బలమైన జట్టే అయినప్పటికీ కొన్ని మ్యాచ్‌లో మాత్రం చేతులెత్తేసింది.



## సెమీస్‌కు ఢిల్లీ వారియర్స్: పంజాబ్ రాయల్స్‌పై 5-4తో విక్టరీ

**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్-2026 చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ దంగల్ వారియర్స్ పంజాబ్ రాయల్స్‌పై 5-4 తేడాతో అద్భుత విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. ఢిల్లీ జట్టు నిర్ణయాత్మక క్షణం మ్యాచ్‌లోని ఎనిమిదో టైలో వచ్చింది. దీనిలో తురాన్ బేరామోవ్ అండర్23 ఆసియా ఛాంపియన్ చంద్రమోహన్‌ను ఆధిపత్య ప్రదర్శనతో ఓడించి టైను 4-4తో సమం చేశాడు. తద్వారా ఢిల్లీ చివరి నాలుగు స్థానాలను కైవసం చేసుకుంది. అంతకుముందు, మహిళల 62 కిలోల పోటీలో ఫైటర్ ఆఫ్ ది మ్యాచ్ అనా గొడినెజ్ విజయంతో పంజాబ్‌ను పోటీలో నిలిపింది. 6 పాయింట్లతో ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్‌ను నిర్ధారించుకున్న పంజాబ్ రాయల్స్ (76 కిలోల) మహిళల విభాగంలో ప్రియా మాలిక్ వ్యూహాత్మక పోటీలో అనస్తాసియా అల్పీవాను 2-0 తేడాతో ఓడించి టైను బలంగా ప్రారంభించింది. పురుషుల విభాగంలో (86) ఢిల్లీ వాఫైపూర్ హది భక్తియార్ ధీటుగా స్పందించి నిరంతర దాడితో సందీప్ మాన్‌ను 20-7 తేడాతో ఓడించి టైను సమం చేశాడు. ఆ తర్వాతపురుషుల విభాగంలో (65) అనుజ్ కుమార్‌పై కెప్టెన్ సుజీత్ కల్కల్ 10-1 తేడాతో గెలుపొందగా, చిరాగ్ చికారాపై శుభమ్ కౌశిక్ 9-0 తేడాతో ఆధిక్యాన్ని 3-1కి పెంచడంతో ఢిల్లీ దూసుకెళ్లింది. మహిళల విభాగంలో (57) రజనితా జాంగ్రా పంజాబ్ ను వెనక్కి నెట్టి, కార్లా గొడినెజ్ గొంజాలెజ్ పై 5-1 తో విజయం సాధించింది. మహిళల బౌట్‌లో (62) మళ్లీ జోరు పెంచిన అనా గొడినెజ్ మొదటి పీరియడ్‌లో 5 పాయింట్ల భారీ త్రోతో ఆధిక్యాన్ని సాధించగా, రెండవ పీరియడ్‌లో అంజ్లీ ప్రతిఘటనను ఎదుర్కొన్నప్పటికీ, 11-7 విజయాన్ని సాధించింది.

## స్క్వాష్ ఆన్ ఫైర్ ఓపెన్‌లో చోత్రాణి, అనాహత్ విజయం



**న్యూఢిల్లీ:** స్క్వాష్ ఆన్ ఫైర్ ఓపెన్‌లో భారత్ షట్లర్లు వీర్ చోత్రాని, అనహాత్ సింగ్ ప్రత్యర్థులను మట్టికరింపించగా, వేలవన్ సింథిల్ కుమార్ ఓటమిపాలయ్యాడు. వాషింగ్టన్‌లో శుక్రవారం జరిగిన 16వ రౌండ్‌లో ఐదు గేమ్‌ల థ్రిల్లర్‌లో చోత్రాని ఫ్రెంచ్ ప్రపంచ 19వ నంబర్ బాప్టిస్ట్ మసోట్టిని ఓడించింది. ప్రపంచ 49వ ర్యాంకర్ చోత్రాని వరుసగా రెండోసారి పునరాగమనం చేసి 4వ ర్యాంకర్ మసోట్టిని 11-6, 7,11, 8-11, 11-1, 11-9తో ఓడించాడు. మొదటి రౌండ్‌లో బాలాజ్ ఫర్కాస్‌ను చోత్రాని 2-1, 8-2 తేడాతో ఓడించాడు. తదుపరి 24 గంటల తర్వాత ఫ్రాన్స్‌కు చెందిన మసోట్టిని ఓడించడానికి మరోసారి ఐదు గేమ్‌లు అవసరమయ్యాయి, ఉత్కంఠత నిండిన ఐదవ గేమ్‌లో అతను ఐదు మ్యాచ్ బంతులతో 10-4,ఆపై 10-9 వద్ద స్మార్ట్ బ్యాక్ హ్యాండ్ డ్రాప్‌తో ఆరవదాన్ని తీసుకున్నాడు. ఐదు మ్యాచ్‌లలో ముహమ్మద్ అసిమ్ ఖాన్‌పై గెలవడానికి డెక్లాన్ జేమ్స్ 2-0 తేడాతో వెనుకబడి ఉన్నప్పటికీ, చోత్రాని ఈ మ్యాచ్‌లో 72 నిమిషాల పాటు జరిగిన పోరును 11-7 తేడాతో ముగించాడు. అలాగే నంబర్ 2 సీడ్ కార్డెనాస్ సెంథిల్‌కుమార్‌పై మరో అద్భుత ప్రదర్శన చేసి గెలుపొందాడు. మహిళల విభాగంలో ఏడో సీడ్ అనహత్ సింగ్ రెండో రౌండ్‌లో హేలీవార్డ్ (రిపబ్లిక్ ఆఫ్ సౌతాఫ్రికా)ను 11-5, 11-8, 12-14, 11-5 తేడాతో ఓడిం చింది. ఆమె క్వార్టర్ ఫైనల్స్‌లో ఈజిప్టుకు చెందిన రెండో సీడ్ సనా ఇబ్రహీంతో తలపడనుంది.

కిరణ్ జార్జ్ నిష్క్రమణ



## థాయిలాండ్ మాస్టర్స్‌లో ఇషా చేతిలో రెండో సీడ్ ఓటమి

**న్యూఢిల్లీ:** థాయిలాండ్ మాస్టర్స్- 2026, సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత్ షట్లర్ ఇషారాణి బారువా రెండవ సీడ్‌ను ఓడించగా, కిరణ్ జార్జ్ నిష్క్రమించాడు. చైనీస్ తైపీకి చెందిన రెండవ సీడ్ సంగ్ షో యున్‌పై విజయం సాధించి భారత్‌కు చెందిన ఇషారాణి బారువా క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ 48వ ర్యాంక్‌లో ఉన్న ఇషా, 1 గంటా 2 నిమిషాల పాటు జరిగిన పోరులో 21-13, 14-21, 21-14 తేడాతో విజయం సాధించింది. 16వ రౌండ్‌లో మెరిసిన ఏకైక భారత మహిళల సింగిల్స్ షట్లర్ బారువాతో పాటు, దేవిక సిహాగ్ కూడా సీడెడ్ ప్రత్యర్థిని ఓడించింది. చైనీస్ తైపీకి చెందిన ఎనిమిదో సీడ్ తుంగ్ సియోటాంగ్‌పై జరిగిన మ్యాచ్‌లో సిహాగ్ కేవలం 32నిమిషాల్లోనే 21-14, 21-14 తేడాతో సునాయాసంగా విజయం సాధించాడు. అలాగే మన్నెపల్లి తరుణ్ కూడా పురుషుల సింగిల్స్‌లో చైనీస్ తైపీకి చెందిన టింగ్‌యెన్ చెన్‌పై 21-17, 14-21, 24-22 తేడాతో గట్టి పోరా టంతో గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గంటా 18 నిమిషాల తర్వాత విజయం సాధించాలని భారత ఆటగాడు తీవ్రంగా ప్రయత్నించడంతో ఇది ఉత్కంఠభరితంగా సాగింది. ఇక పురుషుల సింగిల్స్‌లో ఏడో సీడ్ కిరణ్ జార్జ్ ఇండోనేషియాకు చెందిన ప్రహ్దిస్కా బాగాస్ షుజివో చేతిలో కేవలం 36 నిమిషాల్లోనే 16-21, 11-21 తేడాతో ఓడిపోయాడు. వలిశెట్టి శ్రియాన్షి, అన్మోల్ ఖర్బ్ కూడా మూడు ఆటల నిర్ణయాత్మక మ్యాచ్‌లలో వారివార మహిళల సింగిల్స్ మ్యాచ్‌లలో ఓడిపోవడం ద్వారా థాయ్‌లాండ్ మాస్టర్స్‌లో వారి ప్రచారాలకు తెరపడింది.

## నెస్లే ఇండియా నికరలాభం రూ.1018 కోట్లు




**ముంబయి,జనవరి 30:** నెస్లే ఇండియా నికరలాభాల్లో 46శాతం వృద్ధిని నమోదుచేసింది. ప్యాకేజ్డ్ ఫుడ్ ఐటమ్స్‌లో భారీ వృద్ధి కనిపించింది. మ్యాగీ నూడిల్స్,కిట్‌క్యాట్ చాకొలేట్స్ వంటివాటిలో భారీ మార్కెట్ జరిగింది. పన్ను రాయితీలు కూడా కొంతమేర వ్యయాన్ని పెంచాయి. స్విస్ ఫుడ్ మేజర్ భారత యూనిట్ నికరలాభం మూడో త్రైమాసికంలో రూ.1018 కోట్లుగా వెల్లడించింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ.696 కోట్లు ఆర్జించింది. కంపెనీ షేర్లు నాలుగుశాతం పెరిగినట్లు కంపెనీ ప్రకటించింది. ద్రవ్యోల్బణం దిగిరావడం కూడా ప్రభుత్వ ఆదాయవనరులు, వినియోగరంగంలో పన్ను రాయితీలు అంటే జిఎస్టీ హేతుబద్ధీకరణ వంటివి కంపెనీ లాభాలకు కలిసొచ్చాయి. మూడోత్రైమాసికంలో నెస్లే రాబడులు 19శాతం పెరిగి 5667 కోట్లుగా ఉన్నాయి. కిట్‌క్యాట్, మంచ్ చాకొలేట్‌బ్రాండ్‌లు రెండంకెల వృద్ధిని నమోదుచేసాయి. గ్రామీణప్రాంతాల్లోకూడా డిమాండ్ పెరిగి ఆన్‌లైన్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌ల్లో ఎక్కువ ఆర్డర్లు వచ్చాయి. సిఎండి మనీష్ తివారి మాట్లాడుతూ జిఎస్టీ హేతుబద్ధీకరణ, మా పెట్టుబడులు ఉత్పత్తిసామర్థ్యం పెంపు వంటివి కలిసొచ్చాయని చెప్పారు. తోటి సంస్థలయిన గోద్రెజ్ కన్స్యూమర్ ఉత్పత్తులు,ఐటిసిలు కూడా తక్కువ నికరలాభాలు ప్రకటించాయి. భారత్‌లోని కొత్త లేబర్‌కోడ్‌లు ఒకపర్యాయం అదనపు భారాన్ని వేసినట్లు కంపెనీలు చెప్పుకొచ్చాయి. అయితే నెస్లె ఇండియాకు కూడా లేబర్‌కోడ్‌లు భారం పడినా తక్కువస్థాయిలోనే ఉంది.

# వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలు రివర్స్‌గేర్

**ముంబయి, జనవరి 30:** బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు వారాంతంలో స్వల్పంగా తగ్గాయి. మూడురోజుల ర్యాలీనుంచి తిరోగమించాయి. గ్లోబల్‌మార్కెట్ల ధోరణులు క్షీణించడం, కేంద్ర బడ్జెట్ రానుండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ట్రేడింగ్ చేసారు. విదేశీ నిధులు కూడా కొంతమేర విత్‌డ్రాలు పెరిగాయి. మూడోత్రైమాసిక ఫలి తాలు, భౌగోళిక ఉద్రిక్తతలు, కేంద్ర బడ్జెట్ అంశాలపైనే ట్రేడర్లు ఫోకస్ పెంచడంతో సూచీలు కొంతమేర క్షీణించాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 296.59 పాయింట్లు క్షీణించి 82,269.78 పాయింట్లవద్ద ట్రేడింగ్‌ముగిస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 98.25 పాయింట్లు క్షీణించి 25,320.65 పాయింట్లు వద్ద ట్రేడింగ్ నిలిపి వేసింది. గడచిన మూడు సెషన్లలో సెన్సెక్స్ 1.26శాతం, నిఫ్టీ 1.48 శాతం క్షీణించాయి. హిందాల్కో 5.98శాతం, టాటాస్టీల్ 4.81 శాతం, ఐసిఐసిఐబ్యాంకు 1.92శాతం క్షీణించాయి. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్ సూచీ 0.09శాతం తగ్గితే స్మాల్‌క్యాప్ సూచీ 1.25శాతంపెరిగింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 91.97గా చెలామణి అయితే ఎంసిఎక్స్‌లో పసిడి ఫిబ్రవరిఫ్యూచర్స్ 4.29శాతం క్షీణించి రూ.1,62,352గా కొనసాగాయి. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్‌ముడిచమురు 63 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 70.08 డాలర్లుగా కొనసాగాయి. నిఫ్టీలోమెటల్‌సూచీ 5.21శాతం పెరిగింది. హిందూస్థాన్‌జింక్ 12.4 శాతం వేదాంత 11.27శాతం, హిందూస్థాన కాపర్‌లు 11.07శాతం క్షీణించాయి. ఇక ఎన్‌ఎసి 10.69 శాతం, హిందాల్కో 5.98శాతం, టాటాస్టీల్ 4.81శాతం, ఎన్‌ఎండిసి 4.26 శాతం, సెయిల్ 3.94శాతం, జిందాల్ స్టీల్ 2.97శాతం, ల్లాయిడ్స్ మెటల్స్ 2.77శాతం చొప్పున క్షీణించాయి. ఇక ఆటోమొబైల్ పరంగా టాటా మోటార్స్ 2.54శాతం క్షీణించింది. డాబర్ ఇం డియా 0.57శాతం పడిపోయింది. ఐటిసి మాత్రం 1.11శాతం, కాల్గేట్ పామోలివ్ 0.39శాతం, ఎంటార్ టెక్నాలజీస్ 7శాతం, అల్లీడ్ బ్లెండర్స్ డిస్టిలరీస్ 6.58శాతం, నిప్పన్‌లైఫ్ ఇండియా అసెట్‌మేనేజ్‌మెంట్ 1.30 శాతం చొప్పున పెరిగాయి. వన్97 కమ్యూనికేషన్స్ 2.71శాతం క్షీణించింది. స్విగ్గీ కూడా 4.98శాతం షేర్లుపతనం అయ్యాయి. జిల్లెట్ ఇండియా 5.83శాతంపెరిగింది .కంపెనీ నికర లాభాలు పెరగడమే ఈ షేర్లు పెరగడానికి కారణం.

అలాగే ప్రభుత్వరంగంలోని హిందూస్తాన్ ఏరోనాటిక్స్ కూడా 0.34శాతం పెరిగింది. పవన్ హ్యాన్స్‌నుంచి 10 ధృవ్ ఎన్‌జి హెలికాప్టర్ల తయారీకి ఆర్డరును సాధించడంతో షేర్లుపెరిగాయి. పదేళ్ల బెంచ్‌మార్క్ యుఎస్ బాండ్లు కూడా 0.13శాతం క్షీణించి 6.690శాతంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో రూపాయి డాలరుకు చెలామణి కొంత క్షీణించడం కూడా ఇందుకు దోహదంచేసింది. అయితే ముందురోజు 91.99కంటే కొంతమెరుగుపడింది.




## బజాజ్ ఆటో నికరలాభం రూ.2759 కోట్లు





**ముంబయి,జనవరి 30:** ఆటోమొబైల్ మేజర్ బజాజ్ ఆటో శుక్రవారం ప్రకటించిన త్రైమాసిక ఫలితాల్లో 25శాతం నికరలాభాల్లో వృద్ధిని నమోదుచేసింది. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం రూ.2759 కోట్లుగా ఉందని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో లాభాలు రూ.2195.65 కోట్లుగా ఉన్నాయి. కంపెనీ రాబడులు త్రైమాసికంలో 21.2 శాతం పెరిగి రూ.15,378.24 కోట్లకు చేరాయి. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ. 12,688.96 కోట్లు మాత్రమే ఉండగా ఈసారి భారీ వృద్ధిని నమోదుచేసింది. ఎగుమతులు రెండంకెల వృద్ధిని సాధించడమే ఇందుకు మూలకారణం టూవీలర్లు, వాణిజ్యవాహనాల సెగ్మెంట్‌లోనే ఎక్కువ అమ్మకాలుజరిగాయి. మొత్తంగా బజాజ్ ఆటో అమ్మకాలు ఈత్రైమాసికంలో ఏడు శాతం పెరిగి 1.13 మిలియన్‌యూనిట్లుగా ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. వాణిజ్య వాహనాలు తొమ్మిది శాతంపెరిగి 1,29,829గా ఉంటే ఎగుమతులు టూవీలర్లు 5,31,175 వరకూ ఉన్నాయి. 14శాంపెరిగినట్లుకంపెనీ వెల్లడించింది. అలాగే వాణిజ్య వాహనాలు కూడా 56శాతం వృద్ధిని నమోదుచేసి 1,29,829 యూనిట్లుగా ఉన్నాయి.

## ఆర్థికలోటు తొమ్మిదినెలలకు రూ.8.56 లక్షలకోట్లు: వార్షిక లక్ష్యంలో 54.5% చేరిక



**న్యూఢిల్లీ,జనవరి 30:**భారత్ ఆర్థికవ్యవస్థలో లోటు అనేది కీలకంగా పరిగణిస్తారు. భారత్ ఆర్థికలోటు ఏప్రిల్‌డిసెంబరునెలలమధ్యకాలంలో మరింతగాపెరిగి రూ.8.56 లక్షలకోట్లుగా ఉంది. వార్షికటార్గెట్‌లో 54.5శాతం వరకూ ఉన్నట్లు కాగ్ శుక్రవారం ప్రకటించింది. తొలి తొమ్మిది నెలల్లో గత ఏడాది లోటు రూ.9.1 లక్షలకోట్లుగా ఉంది. అంటే వార్షిక టార్గెట్‌లో 56.7శాంగా ఉంది. పన్ను వసూళ్లు గణనీయంగా పెరగడం, రూ.19.39 లక్షలకోట్లు పన్నువసూళ్లు జరగడం ఇందుకు కీలంగా భావిస్తున్నారు. వార్షిక టార్గెట్‌లో వసూళ్లు 19.39 లక్షలుగా ఉన్నాయి. మూలధన వ్యయం కూడా పెరిగింది. 2026 ఆర్థికసంవత్సర టార్గెట్‌లో 70.3వాతం చేరుకుని రూ.7.87 లక్షలకు చేరింది. అంతకుముందునెలలోనే మూలధనవ్యయం రూ.6.58 లక్షలకు చేరింది. 58.7శాతంగా ఉందని కాగ్ ప్రక టించింది. అంతకుముందు ఏడాది అధిక పన్నుల వసూళ్లు అధిక ఆదాయపు పన్నురేట్లు పరోక్షపనుల రేట్లు కూడా కొంతమేర పెరగడంతో జిఎస్టీ శ్లాబ్‌లు కొంతమేర రాబడికి గండికొట్టాయి. కేంద్రం రెవెన్యూ లోటు ఏప్రిల్ డిసెంబరు మధ్యకాలంలో రూ.1.13 లక్షలకోట్లుగా ఉంది. వార్షిక టార్గెట్ 21.8శాతం సాధిస్తుందన్న అంచనా ఉంది. ఏడాదిక్రితం ఈ లోటు 44.1 శాతంగా ఉంది. తొలితొమినమదినెలల్లో మొత్తం వ్యయం రూ.33.8 లక్షలకోట్లుగా ఉంది. అఈంచనా బడ్జెట్‌లో 66.7శాతంగా ఉంది. మొత్తం రాబడులు తొమ్మిదినెలల కాలానికిగాను రూ.25.25 లక్షలకోట్లుగా ఉన్నాయి. వార్షిక లక్ష్యంతో 72.2శాతంగా ఉంది. పన్నువసూళ్లే 72.5శాతంగా ఉన్నాయి. తొమ్మిది నెలల్లో రూ.24.8 లక్షలకోట్లు రాబట్టింది. పన్నేతర ఆదాయం విభాగంలో ప్రభుత్వం వార్షిక టార్గెట్‌లో 92.6శాతం సాధించింది. డివిడెండ్లు, లాభాలు డిసెంబరు చివరినాటికి రూ.3.5 లక్షల కోట్లుగా ఉన్నాయి. వసూళ్లు వార్షిక లక్ష్యంలో 98శాతానికి చేరుకున్నట్లు కాగ్ అంచనావేసింది.

## సౌత్‌ఇండియన్ బ్యాంకు ఎండిసిఇఒగా వైదొలగుతున్న పిఆర్ శేషాద్రి




**త్రిచూర్, జనవరి 30:** ప్రైవేటురంగంలోని సౌత్ ఇండియన్ బ్యాంకు ఎండి సిఇఒ పిఆర్ శేషాద్రి తన పదవినుంచి వైదొలుగాలని నిర్ణయించుకున్నారు. మరోసారి ఆ పదవిలో కొనసాగేందుకు ఆయన సుముఖంగా లేరు. దీన్నిబట్టి ఇకపై ఆయన బ్యాంకులో తన పదవీకాలం 2026 సెప్టెంబరువరకూమాత్రమే కొనసాగాలని నిర్ణయించుకన్నట్లు తెలుస్తోంది. తన వ్యక్తిగత కారణాలపైపైనే శేషాద్రి రాజీనామాచేయాలని నిర్ణయించుకున్నారు. ఎస్‌ఐబి శేషాద్రి స్థానం భర్తీకోసం ఇప్పటినుంచే అన్వేషణ ప్రారంభించింది. అయితే కొత్త అపాయింట్‌మెంట్ రిజర్వుబ్యాంకు ఆమోదం పొందాల్సి ఉంటుంది. శేషాద్రి నిర్ణయం ప్రకటించినవెంటనే బ్యాంకు షేర్లు 18శాతం పడిపోయాయి. ఇంట్రాడేలో రూ.36.05 రూపాయలకు చేరాయి. మూడు నెలల కనిష్టంగా చెపుతున్నారు ఐఐఎం బెంగళూరు పూర్వ విద్యార్థి అయిన శేషాద్రి ఎండి సిఇఒగా 2023 అక్టోబరులో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు కరూర్ వైశ్య బ్యాంకులో ఎండి సిఇఒగా పనిచేసారు. బిఎఫ్‌సి బ్యాంకు సిఇఒగాను ఎండిగాను పనిచేసిన ఆయన సిటీబ్యాంకు ఆసియా పసిఫిక్ విభాగం ఎండిగా కూడా పనిచేసారు. బ్యాంకు తన మూడోత్రైమాసికంలో నికరలాభాలు రూ.374 కోట్లు ఆర్జించింది. అంతకుముందు ఏడాది 442కోట్లతో పోలిస్తే 9శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇపుడు శేషాద్రి వైదొలుగుతుండటంతో బ్యాంకు ఆర్థికపరిపుష్టివైపుయాజమాన్యం మళ్లీ ఫోకస్ పెంచింది.

## గిఫ్ట్‌సిటీ వైపు గ్లోబల్ రీఇన్సూరెన్స్ కంపెనీలు



**అహ్మదాబాద్,జనవరి 30:** ప్రపంచంలోని అతిపెద్ద రీఇన్సూరెన్స్ కంపెనీలన్నీ ఇపుడు గుజరాత్‌లోని గిఫ్ట్‌సిటీవైపు చూస్తున్నాయి. ఇతర అంతర్జాతీయ ఆర్థిక హబ్‌లకంటే భారత్‌లోని గిఫ్ట్‌సిటీ పై వీరి దృష్టిపడింది. ఇందుకోసం అనుమతుల సాధించేందుకు ఇప్పటికే దరఖాస్తులుచేసుకున్నారు. వీటిలో లండన్‌కు చెందిన ల్లాయిడ్‌సంస్థ కూడా ఉంది. గ్లోబల్‌కంపెనీల్లో దక్షిణ కొరియా శాంసగ్‌రీ, కన్యారే, స్పెయిన్ మాప్‌ఫ్రీరే వంటి కంపెనీలతోపాటు సుమారు డజనుకు పైగా గ్లోబల్ రీఇన్సూరర్లు యూరోప్; మధ్యప్రాచ్యం, ఆసియా దేశాలనునంచి కొత్త గిఫ్ట్‌సిటీవైపు దృష్టిసారించారు. భారత్‌లోని రూ.129.78 బిలియన్ డాలర్ల బీమా మార్కెట్‌పై వీరి కన్ను పడింది. భారత్ బీమా రంగం ప్రపంచంలోనే పదో అతిపెద్ద రంగంగా ఈ సంస్థలు పేర్కొంటున్నాయి. ఈ ఏడాదిలోనే ఈకంపెనీలకు ఆమోదం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. గిఫ్ట్‌సిటీలో శాఖలుప్రారంభిస్తే సానుకూల పన్నుల వ్యవస్థ ఇబ్బందికరంగా లేని వాతావరణం ఉంటుందని, పదేళ్లపాటు ట్యాక్స్ హాలిటీ కూడా ఉంటుందని, మూలధన లబ్ధిపై పన్నుకు కూడా మినహాయింపులు ఉంటాయని తెలుస్తోంది. అయితే భారత్‌తోపాటు సింగపూర్, దుబాయిల్లో కూడా అం తర్జాతీయ ఆర్థికకేంద్రాలున్నాయి. ప్రస్తుతం రీఇన్సూరెన్స్ మార్కెట్ స్విస్‌రే, మ్యునిచ్‌రేలు ఆధిపత్యంతో ఉన్నాయి. ప్రభుత్వపరిధిలోని జ ఐఐసిరే కూడా ఇపుడిపుడే వృద్ధిలోకి వస్తుంది. ఇప్పటికే గిఫ్ట్‌సిటీలో సాదిరే, కొరియన్‌రే, పీక్‌రే, కువైట్‌రే, అబూదాబి నేషనల్ ఇన్సూరెన్స్, కజక్‌కేంద్రంగా ఉన్న యూరేసియా బీమా కంపెనీ, జెఎస్‌సి సంస్థలు కూడా అనుమతులు పొందినట్లు తెలుస్తోంది. గ్లోబల్ రీఇన్సూరెన్స్‌కంపెనీలు 14 వరకూ గిఫ్ట్‌సిటీలో పనిచేస్తున్నాయి. సాలీనా 700 నుంచి 800 మిలియన్ డాలర్లు ప్రీమియంల రూపంలో వస్తున్నట్లు సమాచారం. మార్చినాటికి 20 సంస్థలకు పెరిగే అవకాశాలు న్నాయి. డాలరుకు రూపాయి విలువలు కూడా 91.90గా కొనసాగుతుం డటంతో డాలర్ల పరిధిలోనే ఇక్కడి టర్నోవర్‌ను కూడా లెక్కిస్తున్నారు. అందుకే గ్లోబల్ సం స్థలన్నీ ఇపుడు గుజరాత్ గిఫ్ట్‌సిటీవైపు చూస్తున్నాయి.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

రాజమహేంద్రవరం | శనివారం 31 జనవరి 2026 | I


# కాకినాడలో 60 పడకల కోరమాండల్ ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి లోకేష్





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 30(ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వలసపాకల బీచ్ రోడ్డులో కోరమాండల్ ఎరువుల కర్మాగారం ఆధ్వర్యంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటుచేసిన 60 పడకల ఆసుపత్రి నూతన భవనాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా ఆసుపత్రి ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు కోరమండల్ ఇంటర్నేషనల్ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం 60 పడకల ఇంటిగ్రేటెడ్ కోరమాండల్ హాస్పటల్ నూతన భవనాన్ని రిబ్బన్ కట్ చేసి మంత్రి ప్రారంభించారు. ఆసుపత్రి భవనం మొత్తం కలియతిరిగి వసతులను పరిశీలించారు. కార్పోరేట్ సామాజిక బాధ్యత కింద కోరమాండల్ సంస్థ గత కొన్నేళ్లుగా అవుట్ పేషంట్ హాస్పిటల్ ను నిర్వహిస్తోంది. కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల నుంచి ఏడాదికి 1.2 లక్షల మందికి పైగా రోగులకు సేవలందించడం జరుగుతోంది. మొదటి దశలో ఆసుపత్రి అభివృద్ధికి రూ.8 కోట్లు వెచ్చించారు. రెండో దశలో ప్రస్తుతం రూ.32 కోట్లు వెచ్చించి ఇన్ పేషంట్ సదుపాయాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్ఎమ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఏ అలగప్పన్, ఎండీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.శంకరసుబ్రహ్మణ్యన్, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అరుణ్ అలగప్పన్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ డైరెక్టర్ వి.నారాయణన్ తో పాటు ఎంపీ సానా సతీష్, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం వెంకటేశ్వరరావు, రాజమండ్రి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# తప్పులు తడక అంశాలపై సభ్యుల అభ్యంతరం

## బడ్జెట్ బిల్లు తిరస్కరించిన కౌన్సిల్ సమావేశం




**రామచంద్రపురం,జనవరి 30,(ప్రభాతవార్త):** పట్టణ పురపాలక సంఘ బడ్జెట్ తప్పుల తడకగా రూపొందించడంతో కౌన్సిల్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ మేరకు బడ్జెట్ సమావేశం వాయిదా పడింది.అనంతరం చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు.ప్రవేశ పెట్టిన బడ్జెట్ బిల్లు ప్రారంభ నిలవ ముగింపు నిలవ అన్ని తప్పులతో రూపొందించడంతో కౌన్సిల్ చీఫ్ విప్పు వాడ్రేవు సాయిప్రసాద్ ప్రారంభ నిలవ ముగింపు నిల్వ తదితర అంశాల్లో చాలా తప్పులు ఉన్నాయని తెలిపారు.వాటిపై వివరణ ఇవ్వాలని కోరగా మున్సిపల్ అకౌంటెంట్ సుబ్బారావు వివరణ ఇవ్వలేకపోయారు.సరైన లెక్కలతో వివరణ ఇచ్చేలా బడ్జెట్ను సవరించి మరల సమావేశం నిర్వహించాలని చైర్పర్సన్ కౌన్సిల్ సభ్యులు తీర్మానించారు.తదుపరి నిర్వహించిన సాధారణ సమావేశంలో మూడో అంశం పొంతన లేని వివిధ అంశాలు పొందుపరచడంతో సభ్యులు వ్యతిరేకించారు.ఎనిమిదో అంశం లోని ఒకటవ అంశాన్ని సభ్యులు తొలగించాలని కోరారు ఇదే అంశం మూడో అంశంలో పొందుపరచడంతో సభ్యులు వ్యతిరేగించి రద్దు చేయించారు.మూడు కోట్లతో పలు వార్డులో పనులు చేసేందుకు ఏజెండాలో పొందుపరిచారు.మూడో అంశం లోని 46 పనులతో పాటుగా ఈ46 పనులు లేని వార్డుల్లో కూడా ఆయా పనులు చేసేందుకు ఆమోదం తెలిపారు.సాధారణ సమావేశం ఎజెండాలో మూడు కోట్ల రూపాయల పనులకు గాను అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లకు చెందిన వార్డులోనే ప్రాధాన్యత ఇచ్చారని ప్రతిపక్ష వైసిపి కౌన్సిలర్లు పోడియం వద్దకు దూసుకు వెళ్లి తీవ్ర వాదోపవాదాలు జరిగాయి.తదుపరి కౌన్సిలర్లు చైర్ పర్సన్ తో సమావేశమై అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యం వచ్చేలా సద్దుబాటు చేసి ఆయా అంశాలు అన్నిటిని తిరిగి ఆమోదించారు...

# గోదావరి పుష్కరాలు 2027 కు సమగ్ర ఏర్పాట్లు

## పుష్కర ఘాట్లు ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

## భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి : కొత్తపేట ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, జనవరి 30,(ప్రభాతవార్త)** 2027 గోదావరి పుష్కరాలకు కోట్లాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధికారులకు సూచించారు శుక్రవారం వాడపాలెంలో హెడ్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి శ్రీనివాస్ దేవాదాయ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయ్ కుమార్ తదితర అధికారులతో పుష్కరాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రముఖ ఆలయాలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం కొత్తపేట అని పేర్కొన్నారు కోనసీమ తిరుమల వాడపల్లి మందపల్లి పలివెల ర్యాలి వానపల్లి చింతలూరు వంటి ప్రసిద్ధ ఆలయాలు ఉన్నందున పుష్కరాల సమయంలో కోట్లాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు దేవాదాయ శాఖ నిధులతో ఆలయాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు అలాగే పుష్కర ఘాట్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని నూతనంగా నిర్మించాల్సిన ఘాట్లను గుర్తించి త్వరితగతిన పనులు ప్రారంభించాలని సూచించారు సీ జీ ఎఫ్ ఫండ్స్ శ్రీవాణి ట్రస్ట్ ఫండ్స్ ద్వారా నిధులు సమీకరించి అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు

# ఘనంగా లక్ష బిల్వార్చన పూజలు..



**అంబాజీపేట,జనవరి 30,(ప్రభాతవార్త):** మండలంలోని గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసియున్న శ్రీ పార్వతి వీరేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి వార్ల ఆలయంలో లక్ష బిల్వార్చన పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.గ్రామానికి చెందిన గ్రంధి బాలాజీ -విశాలాక్షి, గ్రంధి మాణిక్యాలరావు – నీరజ, కడించర్ల శ్రీనివాస్ – రాణి, బొడ్డు రఘు – చైతన్యలక్ష్మి దంపతులు, గ్రంధి కుటుంబ సభ్యులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చంద్రమౌళి సూర్య కామేష్, సుదర్శనం కేశవాచార్యలు ఆధ్వర్యంలో వేద పండితులు మండా లక్ష్మీ నరసింహమూర్తి పర్యవేక్షణలో స్వామి వార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష బిల్వార్చన పూజలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కలశాలతో గ్రామవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

# హరిత మార్గం" లక్ష్యంగా కోరమండల్ రోడ్డు ఆధునీకరణ



**కాకినాడ రూరల్, జనవరి 30 (ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ మండలం లో వలసపాకల నుండి బీచ్ కి వెళ్లే రోడ్డును హరిత మార్గం లక్ష్యంగా కోరమండల్ ఎరువుల కర్మాగారం నుండి రూ 1.35 కోట్లు సి ఎస్ ఆర్ నిధులతో ఆధునికరించడం పట్ల కాకినాడ గ్రామీణ సభ్యులు పంతం నానాజీ కోరమండల్ ఇంటర్నేషనల్ యాజమాన్యాన్ని ప్రశంసించారు.కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చేతుల మీదుగా శుక్రవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం కోరమాండల్ సంస్థ చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. వలసపాకల నుండి బీచ్‌ను కలిపే 1.3 కి.మీ పొడవైన కోరమాండల్ రోడ్డు ఒకప్పుడు నిత్యం ట్రాఫిక్ రద్దీ ప్రమాదాలకు నెలవుగా ఉన్న ఈ రోడ్డును, కోరమాండల్ ఇంటర్నేషనల్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.1.35 కోట్లు నిధులతో విస్తరించి ఆధునికరించడంతో ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేశారు.. పచ్చదనంపర్యావరణ సుస్థిరతను పెంపొందించేలా రోడ్డుకు ఇరువైపులా విస్తృతంగా మొక్కలు , భద్రతా చర్యల లో భాగంగాప్రయాణికులు ఎల్లప్పుడూ సురక్షితంగా వెళ్లేందుకు వీలుగా మెరుగైన వీధి దీపాలు ఇతర నిర్మాణపరమైన పనులు కోరమండల్ సంస్థ మెరుగుపరిచారు. కార్యక్రమంలో కోరమండల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జ్ఞాన సుందరం , యూనిట్ హెడ్ కె. జగన్నాథం , సి ఎస్ ఆర్ హెడ్ జయగోపాల్ చతుర్ , సీనియర్ మేనేజర్ పి. పద్మనాభం , ఏజీఎం వంశీ కృష్ణ, పిఆర్వో వి. రవికుమార్ పాల్గొన్నారు.

# లోకేష్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, జనవరి 30,(ప్రభాతవార్త)** కాకినాడ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఐటీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ కు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్వాగతం పలికారు కాకినాడ జేఎన్టీయూలో పీజీ బాయ్స్ హాస్టల్ భవనాన్ని కోరమాండల్ ఆసుపత్రిని మంత్రి లోకేష్ ప్రారంభిస్తారు కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి లోకేష్ పాల్గొననున్నారు ఆ మేరకు రాజమహేంద్రవరం మధురపూడి విమానాశ్రయంలో మంత్రి లోకేష్ కు బండారు స్వాగతం పలికారు

# మహాత్మా.... మన్నించు

**పి. గన్నవరం జనవరి 30 (ప్రభాతవార్త)** మహాత్మా గాంధీ అవమానం జరిగింది. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని నియోజకవర్గ కేంద్రంలో ఉన్న పి. గన్నవరం గ్రామంలోని జనసేన తెలుగుదేశం పార్టీ కార్యాలయాల వద్ద నాయకులు ఎవరూ ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించకపోవడం వలన అవమానం జరిగిందంటూ అవమానం జరిగిందంటూ గాందేయవాదులు వాపోతున్నారు. అహింస ద్వారా దేశానికి స్వాతంత్రం తెచ్చిన మహనీయుడిని ప్రముఖ రాజకీయ పార్టీల నాయకులు విస్మరించడం సరికాదని పలువురు అంటున్నారు

# నకిలీ డాక్టర్ల ఆసుపత్రులు.. రోగుల నుండి దోపిడీ

**అయినవిల్లి జనవరి 30 ప్రబాత వార్త** అయినవిల్లి మండలంలో నకిలీ ఆసుపత్తులు యదేచ్చిగా కొనసాగుతున్నాయి వైద్య ఆరోగ్యశాఖ పట్టించుకోవటం లేదని పలువురు రోగులు ఆరోపిస్తున్నారు అయినవిల్లి మండలం ముక్తేశ్వరం మరియు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి వైద్యం నిర్వహించే కొంతమంది ప్రైవేటు వైద్యులు ఏ విధమైనటువంటి క్వాలిఫికేషన్ లేకుండా సెంటర్లలో రూములను అద్దెకి తీసుకొని ఎంబిబిఎస్ తరహాలో వైద్యం నిర్వహిస్తున్నారు గతంలో ముక్తేశ్వరం సెంటర్లో నకిలీ ఆసుపత్రులపై దాడులు జరిపి కొన్ని ఆస్పత్రుల్లో నకిలీ మందులు రక్త పరీక్ష పత్రాలు స్వాధీనం చేసుకున్నప్పటికీ ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడంతో వీరు వైద్యం యదేచ్చగా సాగుతుంది తక్కువ రకం మందులను వ్రాసి మందులు షాపుల నుండి పర్సంటేజీలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది కుట్లు వేయటం సెలైన్లు పెట్టడం యాంటీబయోటిక్స్ వాడటం మీరు నిర్వహించకూడదు వీరు అమాయక రోగులను మోసం చేసి అర్హత లేని వైద్యాన్ని నిర్వహిస్తున్నారు వైద్య ఆరోగ్య శాఖ వీరిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది

# రెండో రోజు కొనసాగుతున్న ఏసిబి సోదాలు.



**కడియం ,జనవరి 30 (ప్రభాతవార్త)** కడియం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పై గత కొంతకాలంగా అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్ ఈ లక్ష్మి కూడా తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈమె పై పలు పత్రికల్లో రక రకాల ఆరోపణలతో కూడిన కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం ఎసిబి డిఎస్పి కిషోర్ కుమార్, ఆయన సిబ్బందితో కలిసి రెండవ రోజైన శుక్రవారం కూడా సోదాలు కొనసాగించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్, డిఐజి, జిల్లా ఆడిటర్ సమక్షంలో రికార్డులను పరిశీలించామని తెలిపారు. (అండర్ వాల్యూ రిజిస్ట్రేషన్) ఆస్తి యొక్క విలువ ధర కంటే తక్కువ ధర చూపించి పది డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయడం కారణంగా ప్రభుత్వానికి సుమారుగా రెండు కోట్ల అరవై మూడు లక్షల రూపాయలు నష్టం వాటిలినట్టు గుర్తించామన్నారు. గతంలో కూడా తక్కువ ధర చూపించి రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా సుమారు 95 లక్షల 45 వేల రూపాయలు ప్రభుత్వానికి నష్టం వాటిల్లినట్టు గుర్తించడం జరిగిందన్నారు. అలాగే 2025 సంవత్సరంలో సరైన డాక్యుమెంటు ఆధారాలు లేకుండా 911 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు కూడా గుర్తించామని తెలిపారు. అదేవిధంగా( ఈ నెల 28, 29) బుధ, గురు వారాలలో 144 రిజిస్ట్రేషన్లు జరగగా, వాటిలో 107 రిజిస్ట్రేషన్ లకు సంబంధించిన డాక్యుమెంట్లు డెలివరీ చేయలేదని తెలిపారు. సమగ్రంగా సోదాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

# రుణం చెల్లిస్తే వడ్డీ మాఫీ



**రౌతులపూడి జనవరి 30 (ప్రభాతవార్త)** ఎస్ సి కార్పొరేషన్ ద్వారా 2014-2 019లమధ్యలో ఎన్ ఎస్ ఎఫ్ డీ సి మరియు ఎన్ ఎస్ కే ఎఫ్ డీ సి ల ద్వారా లోన్లు తీసుకున్న లబ్ధిదారులు ఈ ఏడాది ఏప్రిల్ ఆఖరి నాటికి రుణం చెల్లిస్తే ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తారని ఆంధ్ర ప్రదేశ్ మాల ఎస్ సి కార్పొరేషన్ డైరెక్టర్ కె మరడయ తెలిపారు. శుక్రవారం రౌతు ల పూడి లో సమావేశం నిర్వహించారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 319మంది లబ్ధిదారులు సుమారు 97లక్షలు వరకు రుణమాఫీ పొందవచ్చన్నారు. అంతేకాకుండా రుణాలు చెల్లిస్తే మరలా రుణం పొందే అవకాశం కల్పిస్తారని చెప్పారు. అప్పు తీర్చక పోతే హా మీ ఉన్న ఉద్యోగులపై చర్యలు తప్పవు అని తెలియజేశారు. ఏప్రిల్ నుంచి క్రొత్త లోనులకు అవకాశం కల్పిస్తారని చెప్పారు. ఈ కార్య క్రమంలో నాయకులు బత్తిన అప్పారావు , వెలుగు ఏపీ ఓ తదితరులు పాల్గొన్నారు

# గాంధీ మహాత్మునికి కాంగ్రెస్ ఘన నివాళులు



**ఉమడి తూరు గోదావరి జిలా బూరో జనవరి 30 (పభాత వార )** జిలా కాగెస్ పారీ కారాలయ కాకినాడ నదు డిసిసి అధక్షులు మాదేపలి సతానదరావు, జగపేట నియోజకవర కాగెస్ పారీ ఇచార్ మరోతి శివ గణేష్, పిసిసి సభులు శీ వతవాయి సతనారాయణ రాజు అనే బాబు, జిలా కాగెస్ శేణులతో కలిసి గాధీజీ 78వ వరతి సదరగా గాధీ మహాతునికి పూలమాలలు వేసి ఘనగా నివాళులరిచారు. అనతర డిసిసి అధక్షులు నాయకతలో కాగెస్ పారీ శేణులతో కలిసి జిలా కలెకర్ కారాలయకు చేరుకుని కారాలయ ఎదుట ఎన్ ఆర్ ఇ జి ఏ అనే ఉపాధి హామీ చటాని వి బి జి ఆర్ ఏ ఎ.జి పేరుతో మారు చేసి ఉపాధి కూలీల వేతనాని 100% కేద పభుత బాధతను 60 శాతానికి తగిసూ 40% ఆరిక భారాని రాష పభుతాలపై మోపడానీ నిరసిసూ ధరా నిరహిచారు. ఏఐసీసీ సరులర్,ఏపీసీసీ అదేశాలు, కేద మాజీ మతిఎ పలరాజు ఆదేశానుసార ఎజీఎన్ఆర్ఇజిఎ చటాని యధాతరగా కొనసాగిచాలని, ఉపాధి కూలీల వేతనాని 100% కేద పభుతమే భరిచాలని, మహాతా గాధీ పేరును చట నుచి వేరు చేయడ తగదని కేద పభుతాని డిమాడ్ చేసూ, రాష పభుత కేద పభుతపై ఒతిడి తీసుకు రావాలని రాష పభుతానికి, కేద పభుతానికి జిలా జిలా కలెకర్ కారాలయ డి ఆర్ ఓ, అదనపు జిలా ఎగికూటివ్ మెజిసేటు కు వినతి పత సమరిచారు ఈ సదరగా డిసిసి అధక్షులు మాదేపలి సతానదరావు, జగపేట నియోజకవర కాగెస్ పారీ ఇచార్ మరోతి శివగణేష్, డిసిసి పధాన కారదరి డాకర్ గాధీ రాజు, ఐఎనీయూసీ జిలా అధక్షులు తాళూరి రాజు తదితరులు మాటాడుతూ ఎ.జీ. ఎన్.ఆర్.ఇ.జి.ఏ చటాని యధాతధగా అమలు చేసే వరకు కాగెస్ పారీ పజల తరఫున పజల కోస పజలతో కలిసి రోజులు నెలలు సవతరాల తరబడి పోరాడుతూనే ఉటామని తెలియ చేశారు ఈ కారకమలో డిసిసి అధక్షులు మాదేపలి సతానదరావు తో పాటు జగపేట నియోజకవర కాగెస్ పారీ ఇనార్ మరోతి శివ గణేష్, పిసిసి సభులు శీ వతవాయి సతనారాయణ రాజు అనే బాబు, జగపేట బాక్ వన్ అధక్షులు చదమౌళి వెకటరత అనే చినారి, పిసిసి సభులు పోలిశెటి శీనివాసరావు, డిసిసి పధాన కారదరి దాట గాధీ రాజు,ఐ ఎన్ టి యు సి రాష నాయకులు తాళూరి రాజు,యూత్ కాగెస్ నాయకులు గొప కొడబాబు యాదవ్, జిలా ఎసీ సెల్ అధక్షులు మొయటి సూర పకాష్ రావు, కాగెస్ పారీ నాయకులు కారకరలు అభిమానులు పాలొనారు.

# గాంధీ మార్గం అందరికీ అనుసరణీయం

## వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, చెప్పులు పంపిణీ






**శంఖవరం జనవరి 30 ప్రభాతవార్త** జాతి పిత మహాత్మ గాంధీ భారత దేశానికి చేసిన సేవలు మరువలేనివని, స్వాతంత్రోద్యమం కోసం పోరాడటమే కాకుండా కుష్ఠు రోగులకు ఎనలేని సేవలందించేవారని రిఫరల్ ఛైర్మన్ ఎన్ స్లెస్సర్ బాబు పేర్కొన్నారు. మండలంలోని సీతంపేట గ్రామంలో గల ఆర్ ఐ యస్ డి టి ఆవరణలో గల ఆర్ ఆర్ ఆసుపత్రి లో గాంధీ వర్ధంతి మరియు కుష్ఠువ్యాధి నిర్మూలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా రిపరల్ ఛైర్మన్ ఎన్ స్లెస్సర్ బాబు మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో మాత్రమే కాకుండా దేశానికి సేవలు అందించడంలోనూ గాంధీజీ ముందుండే వారని ముఖ్యంగా కుష్ఠు వ్యాదిగ్రస్థుల పట్ల ఆయన చేసిన సేవలు కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ఆయన చేసిన కృషిని మరువలేమన్నారు. స్వాతంత్ర సమరానికి అన్ని జాతులను ఐక్యం చేసి పోరాడంతో పాటు నాటి సమాజంలో ఉన్న దుర అలవాట్లను ,రుగ్మతలను, కుష్ఠు వ్యాధి ని రూపుమాపేందుకు గాంధి చేసిన కృషి ఎనలేనిదని 2035 నాటికి దేశాన్ని కుష్ఠు రహిత భారత దేశంగాతీర్చి దిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. వైద్యులు రాజీవ్ కుమార్ మాట్లాడుతూ ఏం డి టి మందులు ద్వారా కుష్టి వ్యాధి నయమవుతుందని సక్రమమైన రీతిలో మందులు వాడితే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. కుష్ఠు రోగులకు వైద్యం కన్నా హృదయ శాంతి అవసరం అన్నారు. అనంతరం రోగులకు ఎం సి ఆర్ చెప్పులు, దుప్పట్ల పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కేశవరావు, ఆర్ ఐ ఎస్ టి డి డైరెక్టర్ రవీందర్, రిఫరల్ స్కూల్ ఇన్చార్జ్ రేణుక, మెడికల్ సూపర్డెంట్ ఎస్ఎస్ రాజకుమార్, పీఎంవోఎస్ ప్రసాద్ కుష్టు వ్యాధి నుండి విముక్తి పొందిన వారు ఆర్ సి ఎస్ ఆపరేషన్లు చేయించుకున్న రోగులు పాల్గొన్నారు.

# రుక్మిణి సత్యభామ సమేత గోపాల స్వామి వారి కళ్యాణం



**కె.గంగవరం, జనవరి 30, (ప్రబాతవార్త):** గంగవరం గ్రామంలోని వేంచేసినటువంటి రుక్మిణి సత్యభామ సమేత గోపాలస్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఈవో బాలకృష్ణార్జున్ రావు తెలిపారు. నూతనంగా ఏర్పడిన పాలకమండలి జరిపించిన మొదటి కళ్యాణం మహోత్సవానికి బ్రహ్మ బిక్కవోలు కేశవాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సుదర్శనం భాస్కరమూర్తి, భాస్కరం, పెద్దింటి అప్పలాచార్యులు, తిరుమల శ్రీనివాస్ వైఖాన ఆగమన ప్రకారం జరిపించినట్లు తెలిపారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ పెద్దింశెట్టి నరసింహమూర్తి ధర్మకర్తల మండలి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు ,నాయకులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.






# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్



**రామచంద్రపురం,జనవరి 30,(ప్రభాతవార్త):** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ నిర్వహించారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను నేరుగా మంత్రికి వివరించగా,ఆయన ఓర్పుతో విని,సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేస్తూ,కార్మికులు, పేదలు,సామాన్యుల సమస్యలు ఎక్కడ పెండింగ్‌లో ఉండకూడదని అన్నారు.అర్జీలపై నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.ప్రజాదర్బార్ ద్వారా వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి న్యాయం చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం,కూటమి నాయకులు, ప్రజలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...


[illegible] 63/2025 [illegible]

పిఠాపురం
తేదీ : 30.01.2026

ఇ-ప్రొక్యూర్ మెంటు షార్ట్ టెండరు నోటీసు

పిఠాపురం పురపాలక [illegible] 7 [illegible] BPS & LRS రూ.23.00 మరియు 1 [illegible] రూ.3.00 [illegible] 3 రూ.66.10 [illegible] ఇ – ప్రొక్యూర్ మెంటు ద్వారా [illegible]

మిగిలిన వివరములు https://tender.apeprocurement.gov.in నందు మరియు ఇతర వివరముల కొరకు సెల్ నెం : 9849906523 ద్వారా తెలుసుకొన వచ్చును.

| | | | |
|---|---|---|---|
| బిడ్లు డాక్యుమెంటు డౌన్ లోడ్ ప్రారంభ తేది | : | 31-01-2026 సమయం ఉదయం | గం. 10.00 |
| బిడ్లు డాక్యుమెంటు డౌన్ లోడ్ ఆఖరి తేది | : | 03-02-2026 సమయం సాయంత్రం | గం. 3.30 |

కమీషనరు
పిఠాపురం పురపాలక సంఘం

## ఘనంగా గాంధీ 78వ వర్ధంతి వేడుకలు.



ఆత్రేయపురం,జనవరి, (ప్రభాత వార్త) జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన ఆత్రేయపురం శ్రీ వల్లీ దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కళ్యాణ మండపం, మహాత్మా గాంధీ జూనియర్ కళాశాల నందు. శుక్రవారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ 78వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కస్పాండెంట్ పిఎస్ రాజు గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంస్మరణ సభలో పలువురు మాట్లాడుతూ గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే నినాదాలు ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో పాటించాలని ఆకాంక్షించారు. గాంధీజీ కలలుగన్న స్వరాజ్య స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వెచ్చా నాగ వెంకట సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఉప్పలపాటి సతీష్ కోశాధికారి పోలసానిపల్లిలక్ష్మీ శ్రీనివాస్, చార్టర్ ప్రెసిడెంట్ పేరూరి నాగేశ్వరరావు, వెచ్చా గోపాల్ కృష్ణ, పులవర్తి సూర్యనారాయణ,శ్రీకాకోళపు వెంకటరమణ, యలమర్తి శ్రీనివాస్, చిట్టూరి రామారావు, అద్దేపల్లి సుబ్రహ్మణ్యం, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాత్మాగాంధీ వర్ధంతి



మామిడికుదురు.జనవరి 30(ప్రభాతవార్త) భారత స్వాతంత్ర్య పోరాట మార్గదర్శి, జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షులు అప్పన శ్రీరామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మునికి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా స్థానిక సెంటర్లో ఉన్న గాంధీ విగ్రహానికి పార్టీ నాయకులు, స్థానికులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.శ్రీరామకృష్ణ మాట్లాడుతూ అహింసా మార్గంలో బారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చి పెట్టిన మహనీయుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు నీతిపూడి బాల సత్యనారాయణ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు బత్తుల సురేష్ బాబు, నుదురుమాటి వెంకటేశ్వరరావు,వానరాశి దుర్గారావు,మొల్లేటి సీతారామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల ఏర్పాటు



అంబాజీపేట,జనవరి 30, (ప్రభాతవార్త): విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులు అందరి మన్ననలు పొందారు. మండలంలోని పుల్లేటికుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.60 వేలతో వాటర్ ట్యాంక్,10 ట్యాపులు, వాష్ బేసిన్ ఏర్పాటుచేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. గ్రామ సర్పంచి జల్లి బాలరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీర ధర్మరాజు, ఎస్ఎంసి చైర్ పర్సన్ నూకల రత్నమాల, పూర్వ విద్యార్థి తాడంకి ఫణి కుమార్ లు సంయుక్తంగా శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా హెచ్ఎం ధర్మరాజు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సహకారం ఎంతో అభినందనీయమన్నారు. పాఠశాల తరపున పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి అందె సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కుటుంబ సంక్షిప్త సమాచారానికి సహకరించాలి



యు.కొత్తపల్లి, జనవరి 30(ప్రభాతవార్త) : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న కుటుంబ సంక్షిప్త సమాచార సేకరణకు వచ్చే అధికారులకు సహకరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ. లక్ష్మీరెడ్డి అన్నారు. మండలంలోని గోర్సలో జరుగుతున్న సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ప్రభుత్వం నిర్దేశించిన అంశాలపై యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే జరుగుతుందన్నారు. తద్వారా ప్రతీ కుటుంబం యొక్క మౌలిక సదుపాయాలు, ఆర్థిక స్థితిగతులు, విద్యార్హత, ఆరోగ్యం వంటి వాటి పూర్తి వివరాలు మేరకు నమోదు చేయడం జరుగుతుందన్నారు. వివరాలు నమోదు కోసం గృహాల వద్దకు వచ్చే ప్రభుత్వం సిబ్బందికి సహకరించాలని కోరారు.

## ప్రజా దర్బార్‌తో ప్రజలకు చేరువ : ఎమ్మెల్యే బండారు



కొత్తపేట, జనవరి 30, ( సత్యానందరావు ప్రజా దర్బార్ తో ప్రజలకు మరింత చేరువుగా ప్రభుత్వం పనిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు శుక్రవారం వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యానందరావు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు అభ్యర్థనలు స్వీకరించారు ప్రజలు నేరుగా తనను కలుసుకుని తమ సమస్యలను తెలియజేయడానికి ప్రజా దర్బార్ కార్యక్రమం ఉపయోగపడుతుందని ప్రజలు తమ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు మొత్తం 45 వినతులు అందాయి పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు మిగిలిన అర్జీలు త్వరగా పరిష్కారం అయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు

## ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి



రామచంద్రపురం,జనవరి 30,(ప్రభాతవార్త): మండల హసనబాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.భారత స్వాతంత్ర్య సాధనలో గాంధీజీ పాత్ర ప్రత్యేకమైనది అని సర్పంచ్ కొనియాడారు.అనంతరం ఇటీవల జిల్లా స్థాయిలో రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఉత్తమ గ్రామ రెవిన్యూ అధికారిగా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న నరహరిశెట్టి సత్తిబాబును సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు,పంచాయితీ కార్యదర్శి సబ్బెళ్ల ప్రసాద్ రెడ్డి ఇతర సిబ్బంది ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మన గ్రామ రెవిన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సత్తిబాబుకు ఈ అవార్డ్ రావడం అభినందనీయమని ఇది మన గ్రామానికి గర్వకారణమని తెలియజేస్తూ గ్రామానికి వారు చేస్తున్న సేవలను ప్రశంసించారు.సత్తిబాబు మాట్లాడుతూ తనకు ఈ అవార్డ్ రావడానికి కారకులైన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదములు తెలుపుతూ సర్పంచ్,తోటి ఉద్యోగులకు,పై అధికారులకు,గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ,సచివాలయం,రెవిన్యూ, అంగన్వాడీ,ఆరోగ్య సిబ్బంది,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకు ప్రకటించిన హామీలను వెంటనే నెరవేర్చాలి

## ఎన్నికల హామీలు అమలు చేయండి : ఎస్‌టియు



ఆలమూరు జనవరి 30, (ప్రభాతవార్త) ఎన్నికల సందర్భంగా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఇచ్చిన పిలుపుమేరకు ఆలమూరు మండల ఉపాధ్యాయ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఉద్యోగస్తులు శుక్రవారం మండల తాసిల్దార్ ఆఫీస్ వద్ద మరియు ఎంపీడీవో ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ పి.ఆర్.సి కమిటీని నియమించి, 30% ఐ. ఆర్. ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న డి. ఏ లను వెంటనే అమలు చేయాలని, సిపియస్ పెన్షన్ స్కీం పై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమస్యలను ప్రభుత్వానికి నివేదించవలసిందిగా తెలుపుతూ మండల తహసిల్దార్ కి, ఎంపీడీవో కి ఉద్యోగ సంఘ నాయకులు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి వాసా దుర్గాప్రసాద్, ఆర్థిక కార్యదర్శి యం. దాస్, అసోసియేట్ అధ్యక్షులు పట్టా శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు పి.శ్రావణి, మహిళా కార్యదర్శి టి. బాల ఉమామహేశ్వరి, జిల్లా మహిళా కార్యదర్శి కె. సుజాత, జిల్లా కార్యదర్శి ఉడత వెంకటేశ్వరరావు, విద్యా భవన్ కన్వీనర్ కె.ఎస్.ఎన్.మూర్తి, సీనియర్ నాయకులు కె. మల్లిక్ , సింహాద్రి శ్రీనివాసరావు, ఇ.చంటిబాబు , బి.గంగరాజు , ఎం.వీర్రాజు, పి. ప్రకాష్, చింతకుల శ్రీనివాస్, బి.తనూజ, పి సతీష్ కుమార్, మాదే రమణ ప్రసాద్, బి.విజయలక్ష్మి, పి.విజయలక్ష్మి కుమారి, సి.హెచ్. నాగమల్లీశ్వరి, అడపా మాచర్రావు, కొల్లూరు సూర్యనారాయణ, ఎన్.చంద్ర రావు, ఎం రాజగోపాల్, జె.ఏసు రాజు, జిఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## బాబు, పవన్‌ల కుట్ర : వైసీపి



కడియం, జనవరి 30 (ప్రభాత వార్త) కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి మహిమ మరోసారి నిరూపతమైందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు, పలురకాల కల్తీ నెయ్యి వాడినట్లు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లు గత వైసిపి ప్రభుత్వం మీద, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మీద కుట్ర పూరితంగా దుష్ప్రచారాలు చేశారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సిబిఐ ఆధ్వర్యంలో వేసిన సిట్ విచారణలో ఇవన్నీ అవాస్తవాలని తేలాయన్నారు. ఈసందర్భంగా గురువారం సాయంత్రం, కడియం కెనాల్ రోడ్డులో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి వేషధారుడితో, తిరుపతి నమూనా లడ్డూలను పంచుతూ, తిరుపతి లడ్డులో కల్తీ జరగలేదన్న విషయాన్ని ప్రజలకు భక్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల విష్ణు చక్రవర్తి, పంచాయతీ వార్డ్ మెంబర్ దాసరి నాగేంద్ర, లీగల్ సెల్ చింతపర్తి రాంబాబు, కుసునూరి బాబులు, చిలుకూరి రామకృష్ణ సర్కార్ భాష, గుత్తుల రమేష్, చెక్క కాశి, పూడి వీరబ్రహ్మం, మార్గాన్ని బలరాం, పున్నమి రాజు వీర్రాజు, నరమామిడి గణేష్, రాము, ఎస్ వీర నాగు, కోసూరి సూరిబాబు, పిండి నాగరాజు, శాఖ సతీష్, బండారు శ్రీను, బత్తిన శ్రీధర్, వైసిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యలకు పరిష్కారం



పి గన్నవరం జనవరి 30 (ప్రపోతవార్త )టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం పి. గన్నవరం టిడిపి కార్యాలయం వద్ద నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని టిడిపి కోకన్వీనర్లు మోకా ఆనంద సాగర్, దాసరి వీర వెంకట సత్యనారాయణ అన్నారు. వారు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు

## గాంధీజీ విగ్రహానికి నివాళులు



అయినవిల్లి జనవరి 30 ప్రభాతవార్త అయినవిల్లి మండలం ముక్తేశ్వరం సెంటర్లో గాంధీజీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మండల శాఖ అధ్యక్షులు కొత్త కృష్ణ మాట్లాడుతూ నేటి సమాజానికి గాంధీజీ నిర్వహించిన శాంతి మార్గమే శరణమని అన్నారు ఈ కార్యక్రమంలో చవల నాగేశ్వరరావు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు

## గజమాలతో లోకేష్‌కు సత్కారం



కాకినాడ రూరల్, జనవరి 30 (ప్రభాతవార్త): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చేరుకున్న సందర్భంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. సర్పవరం జంక్షన్ లో స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ గజమాలతో యువనేత లోకేష్ ను ఘనంగా సత్కరించారు.మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతుల ఆధ్వర్యంలో సుమారు 50 కార్లతో భారీ ర్యాలీ నిర్వహించి లోకేష్‌ను ఆహ్వానించారు. సర్పవరం జంక్షన్‌లోని ఎన్టీఆర్ కూడలి వద్ద నారా లోకేష్‌కు మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి,మహిళలు గుమ్మడి కాయతో దిష్టి తీసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు, కార్యకర్తలు, నాయకులు ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకొని పార్టీ జెండాలు ఊపుతూ నినాదాలతో ప్రాంతాన్ని ఉత్సాహభరితంగా మార్చారు. లోకేష్‌కు మద్దతుగా యువత, మహిళలు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు మాట్లాడుతూ, కాకినాడ రూరల్ ప్రాంత అభివృద్ధికి నారా లోకేష్ నాయకత్వం కీలకమని, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, ఐటీ రంగాల అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధికి మరింత వేగం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, కాకినాడ రూరల్ నియోజకవర్గం కో కోఆర్డినేటర్ కటకం శెట్టి బాబి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, చప్పిడి వెంకటేశ్వరరావు అధిక సంఖ్యలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఏఎస్‌ఓగా ప్రసాద్..



అమలాపురం కలెక్టరేట్,జనవరి 30,(ప్రభాతవార్త): ఏపీపీఎస్సి విడుదల చేసిన గ్రూప్ -2 ఫలితాలలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్గా ఎంపికైన ప్రసాద్ ను పలువురు ఆనందించారు. అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి గ్రామానికి చెందిన పిల్లా ప్రసాద్ 2023 సెప్టెంబర్లో గ్రూప్ -4 లో జూనియర్ అసిస్టెంట్ గా అంబాజీపేట తహసిల్దార్ కార్యాలయంలో పనిచేశారు. అక్కడ నుండి 2024లో రావులపాలెం తహసిల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. అనంతరం డిప్యూటేషన్ పై అమలాపురం కలెక్టరేట్ లో విధులు నిర్వహిస్తుండగా అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (జిఏడీ)గా ఎంపికయ్యారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తన ఉన్నతికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## 'అన్న సమారాధన'

కాత్రేనికోన,జనవరి 30 ( ప్రభాతవార్త) కాత్రేనికోన మండలం లోని శ్రీ పార్వతి కుండలేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆదివారం ఎం. పి. టి. సి అక్కల శ్రీధర్, డాక్టర్ పావని దుర్గ దంపతుల ఆధ్వర్యంలో అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కావున అధిక సంఖ్యలో భక్తులు,గ్రామస్తులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని అన్న సమారాధన ను విజయవంతం చేయాలని కోరారు.

## భక్తిశ్రద్ధలతో సత్యసాయి అఖండ జ్యోతి యాత్ర




సీతానగరం, జనవరి 30, (ప్రభాత వార్త) : సీతానగరంలో స్పిరిట్ ఆఫ్ యూనిటీ రన్ లో భాగంగా శ్రీ సత్యసాయి అఖండ జ్యోతికి భక్తులు ఘన స్వాగతం పలికారు. సాయి మందిరంలో శుక్రవారం తెల్లవారుజామున ఓంకార, సుప్రభాత సేవ, గోక్షీరాభిషేకం, భజనలు, జ్యోతి ధ్యానం నిర్వహించారు. భక్తులు అఖండ జ్యోతి నుండి జ్యోతులను వెలిగించుకుని తమ గృహాలకు తీసుకెళ్లారు. అనంతరం నాగరత్నం కాలనీ, రాజుపాలెం భజన మండలి లోనూ, ఇనుగంటివారిపేట సమితికి పురవీధుల గుండా పాదయాత్ర నిర్వహించి, మధ్యాహ్నం అఖండ జ్యోతిని కొవ్వూరు జోన్ కు పంపించారు.

## ఏలేశ్వరంలో ఉచిత కంటి వైద్య శిబిరం...



ఏలేశ్వరం, జనవరి 30, (ప్రభాతవార్త) ఏలేశ్వరం శ్రీ ఆదిత్య హాస్పిటల్ వారిచే ఏలేశ్వరం గవర్నమెంట్ హై స్కూల్ నందు కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయిడం జరిగింది ముదు రోజులు గా 650 మంది పిల్లలు కి ఆదిత్య గారు (ఆదిత్య హాస్పిటల్ మేనేజంగ్ డైరెక్టర్ ), రాజనాల జయ బాబు ఎం. ఆప్టమ్ కంటి పరీక్షలు చేశారు కంటి ఆరోగ్యం పై అవగాహనా కలిపించారు .ఆదిత్య హాస్పిటల్ స్టాఫ్ పాల్గొన్నారు. అవసరం వున్నా పిల్లల కి కంటి చుక్కలు మందు లు ఉచితం గా ఐవ్వడం జరిగింది.

## మంత్రి నారా లోకేష్ కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ:



జగ్గంపేట జనవరి 30 (ప్రభాతవార్త ) కాకినాడ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ కు రాజమహేంద్రవరం మధురపూడి విమానాశ్రయంలో జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ ఘన స్వాగతం పలికి అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదం, భగవద్గీత అందించారు. కాకినాడ జేఎన్టీయూలో పీజీ బాయ్స్ హాస్టల్ భవనాన్ని, కోరమాండల్ ఆసుపత్రిని మంత్రి లోకేష్ ప్రారంభించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఆయన వెంట రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్వి ఎస్ అప్పలరాజు, గండేపల్లి క్లస్టర్ ఇంచార్జ్ జాస్తి వసంత్, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ భూపాలపట్నం ప్రసాద్, టిడిపి యువనేత పాలచర్ల నాగేంద్ర చౌదరి పాల్గొన్నారు.

## హెల్పింగ్ యూత్ ఆధ్వర్యంలో ఫ్రూట్స్ బ్రెడ్ పంపిణీ..



ఏలేశ్వరం, జనవరి 30, (ప్రభాతవార్త) ఈరోజు హెల్పింగ్ యూత్ ఆధ్వర్యంలో గాంధీ గారి 78వ వర్ధంతి సందర్భంగా గాంధీ గారికి పూలమాలతో నివాళులర్పించి మన ఏలేశ్వరం గవర్నమెంట్ హాస్పిటల్ స్వీట్ షాప్ రామలాల్ ఆర్థిక సహకారంతోప్రెగ్నెంట్ లేడీస్ కి బేబీ బెడ్స్ ఫ్రూట్స్ బ్రెడ్ పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ౦ఎ అలీషా బండి కోటి పర్వత శివ పాల్గొనడం జరిగింది.

## లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న నీరుకొండ



సీతానగరం, జనవరి 30, (ప్రభాత వార్త) : మండలంలోని జాలిముడి గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని బీజేపీ రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నీరుకొండ వీరన్న చౌదరి శుక్రవారం దర్శించుకున్నారు. భీష్మ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## దేవస్థానం భూములు స్వాదీనం



అమలాపురం,జనవరి30, ప్రభాతవార్త అమలాపురం శ్రీసుబ్బాలమ్మ, నూకాలమ్మ, రాజ్యలక్ష్మి అమ్మ వారి దేవస్థానమునకు చెందిన విలువైన ఆస్తులను స్వాదీనం చేసుకోవడం దేవస్థానం అదికారయంత్రాంగం శ్రీకారం చుట్టింది. స్థానిక ఆర్టిసి బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న భూమి సర్వే నెంబర్ 158 లో య.2.28 సెంట్లు 159/2 లో య. 1.34 సెంట్లు వెరసి య.3.62 భూమి చాలా కాలం నుండి 11 మంది ఆక్రమించికుని వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దేవదాయశాఖ నిబంధనలు ప్రకారము గతేడాది డిసెంబర్.26 న 11 మంది ఆక్రమణదారులు లకు యు/ఎస్ 83(2) నోటీసులు ఇవ్వడం జరిగింది.సదరు నోటీసు ప్రకారం శుక్రవారం కర్రి బుద్దేశ్వర రావు య.0.48 సెంట్లును, పొన్నాడ వేంకటేశ్వర రావు య.0.24 సెంట్లు స్వచ్ఛందముగా దేవస్థానం అదికారయంత్రాంగం కి స్వాధీనము చేసియున్నారు. మిగతా 9మంది ఆక్రమణదారులు నుండి త్వరలోనే స్వాధీనము చేసుకోనున్నట్లు వారు తెలిపారు. జిల్లా దేవదాయశాఖ సహాయ కమీషనర్ వారి సూచలు మేరకు దేవాలయ కార్యనిర్వహణాధికారి రాగోలు శ్రీనివాస్, ధర్మకర్తల మండలి ఛైర్మన్ అప్పన వీరన్న, మాజీ ఛైర్మన్ పెద్దిరెడ్డి పుల్లయ్యనాయుడు ధర్మకర్తల మండలి సభ్యులు, దేవదాయశాఖ తనిఖీదారు జంపా రామలింగేశ్వర రావు ఇందులో పాల్గొన్నారు.స్వాదీనం చేసుకకున్న ఈమొత్తం భూమిని అభివృద్ధి చేసి ఆలయానికి ఆదాయం వచ్చేలాగా స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు అడుగులు వేస్తున్నారు.

## వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ



ఆత్రేయపురం, జనవరి, 30,(ప్రభాత వార్త) క్రియేటివ్ గ్రూప్స్ అధినేత కొవ్వూరి నరేష్ కుమార్ రెడ్డి కుమారుడు కొవ్వూరి వెంకట్ వియాన్స్ రెడ్డి పుట్టినరోజు వృద్ధులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. మండలంలోని ర్యాలి అన్నపూర్ణ డే కేర్ హోమ్ వద్ద శుక్రవారం రావులపాలెం అక్షయ సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో నరేష్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి వృద్ధులతో కలసి వారి కుమారుడు పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా 30 మంది వృద్ధులకు నూతన వస్త్రాలను బహూకరించడంతోపాటు వారి మధ్య కేకును కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులతో కలసి ఈ వేడుకలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని విలాసవంతమైనటువంటి ఖర్చులు తగ్గించుకుని ఇటువంటి వృద్ధులకు సహకరించడం ద్వారా నేటి చిన్నారుల్లో విలువలను పెంచడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంజిరెడ్డి డాక్టర్ మోహిత్ సీత అన్నపూర్ణ,తదితరులు పాల్గొన్నారు.

## పాళ్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న టీడీపీ శ్రేణులు.



మామిడికుదురు.జనవరి 30(ప్రభాతవార్త) ఈదరాడ గ్రామంలో వేంచేసియున్న గ్రామ దేవత శ్రీ పాళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద జరుగుచున్న చండీ హోమం కార్యక్రమాల సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సాధనాల సుబ్బారావు వీరికి సాదరంగా ఆహ్వానం పలికారు. రాజోలు టీడీపీ ఇన్చార్జి గొల్లపల్లి అమూల్య,జెడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ భూపతిరాజు సాయిబాబు రాజు,రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్ సంస్థ డైరెక్టర్ ముదునూరి వేణుగోపాల కృష్ణంరాజు, నగరం పిఏసీఎస్ ఛైర్మన్ శ్రీ ఈలి శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని చండీ హోమం పూజా కార్యక్రమాల్లో పాల్గొని పండిత ఆశీర్వచనాలు అందుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## విద్యార్థిని ఐశ్వర్య కుటుంబానికి చేయూత



కాకినాడ రూరల్, జనవరి 30 (ప్రభాతవార్త): కాకినాడ రూరల్ మండలం పి. వెంకటాపురం కేంద్రీయ విద్యాలయంలో నాలుగో తరగతి చదువుతున్న ఐశ్వర్య (9) గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై స్పందించిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మృతురాలి కుటుంబానికి అండగా నిలిచారు. సానా సతీష్ బాబు ఫౌండేషన్ ద్వారా సుమారు రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని గురువారం సాయంత్రం రమణయ్యపేట ఇందిరా కాలనీలో బాలిక నివాసానికి వెళ్లి ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ కుటుంబ సభ్యులకు అందజేసి చేయూతనందించారు. ఈ సందర్భంగా బాలిక తల్లిదండ్రులను ఓదార్చి తమ ఫౌండేషన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి. వీరభద్రరావు, అంకం రెడ్డి రాము నాయుడు , శ్రీనివాసరావు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ వర్ధంతి



అమలాపురం,జనవరి30,ప్రభాతవార్త శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వైశ్య సంఘం ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీజీ 78వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పచ్చిగోళ్ళ జనార్ధనరావు కళ్యాణ మండపం వద్ద, గాంధీ సెంటరులో (గడియార స్తంభం) గల గాంధీజీ విగ్రహాలకి పూలమాలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీజీ దేశ స్వతంత్రం కోసం చేపట్టిన ఉద్యమాల గురించి, త్యాగాల గురించి మననం చేసుకున్నారు. ఈ కార్యక్రమములో సంఘ గౌరవ అధ్యక్షులు యెండూరి వేంకట్రామయ్య, అధ్యక్షులు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి వెంకటచల ప్రసాద్, సుబ్బాలమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ అప్పన వీరన్నసంఘ సభ్యులు పాల్గొని నివాళులర్పించారు.

## దుర్గా మీనాక్షికి సహస్ర చామంతి పూజ



శంఖవరం, జనవరి 30, (ప్రభాతవార్త) దుర్గా మీనాక్షి అమ్మవారికి సహస్ర చామంతి పూజ ఘనంగా నిర్వహించారు మండలంలోని సీతయ్యమ్మ పేట గ్రామంలో కొలువై ఉన్న దుర్గా మీనాక్షి అమ్మవారి ఆలయంలో మాఘమాసం ద్వాదశి శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి ఆలయ పూజారి కాకర్ల కామేశ్వర ప్రసాద్ శర్మ అమ్మవారికి విగ్నేశ్వర పూజతో పాటు సహస్రనామాలతో సహస్ర చామంతి పూలతో ప్రత్యేక పూజ నిర్వహించారు ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వాహణాధికారి యర్ర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాఘ మాసం సందర్భంగా విశేష పూజలు నిర్వహించడం జరిగిందని మార్చిలో అమ్మవారి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నామని, భక్తులందరూ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. గ్రామస్తులు పరిసర గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## లక్కీ డ్రా విజేతలకు బహుమతులు అందజేత



కాత్రేనికోన జనవరి30 (ప్రభాతవార్త) క్రిస్మస్, నూతన సంవత్సర మరియు సంక్రాంతి సందర్భంగా కాత్రేనికోన.శ్రీ రామలక్ష్మి టెక్స్టైల్స్ మరియు ఎస్ ఆర్ ఎల్ షాపింగ్ మాల్ వారు మెగా లక్కీ డ్రాను శుక్రవారం టిడిపి సీనియర్ నాయకులు పి ఎస్ ఎన్.రాజు చేతుల మీదుగా లక్కీ డ్రా లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా. సుంకర తేజ. 25 వేల రూపాయలు నగదు బహుమతి, రెండవ బహుమతి వాషింగ్ మిషన్. నక్క దుర్గా భవాని కందికుప్ప మూడవ బహుమతి. వాషింగ్ మిషన్ పరశురాం అలాగే 60 బహుమతులు కూడా షాపింగ్ మాల్ నందు బట్టలు కొన్న కస్టమర్లకు బహుమతులను అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కృష్ణ, కంచు స్తంభం సోనీ, సుంకర పవిత్ర కుమార్, పాల్గొన్నారు

## వైసీపీ నేతల ప్రత్యేక పూజలు



అమలాపురం,జనవరి30,ప్రభాతవార్త శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నందు తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదానికి సంబంధించి జరిగిన విషప్రచారంపై వాస్తవాలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో అమలాపురంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లడ్డూ ప్రసాదంపై కూటమి ప్రభుత్వం చేసిన విమర్శలు అవాస్తవమని ఇప్పటికే స్పష్టమైన సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఎన్నడూ ప్రవర్తించలేదని నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ గారు పేర్కొన్నారు.స్వామివారిపై జరిగిన అపవాదు తొలగినందుకు కృతజ్ఞతగా, ఆలయ ధ్వజస్తంభం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి 200 కొబ్బరికాయలు కొట్టి స్వామి వారి పై చేసిన ప్రచారాలను అవాస్తవం అని తేల్చి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు,బొమ్మి ఇజ్రాయేల్,రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు జిన్నూరి బాబీ,రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు,వంటెద్దు వెంకన్నాయుడు, రాష్ట్ర,జిల్లా, నియోజకవర్గం, మండలాల ముఖ్య నాయకులు, మున్సిపల్, పట్టణ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps